'66 మార్చి

జ్యోతి

75 పైసలు





సౌందర్య పోషణకు
Remy
రెమి

ఒక ఉత్తరమే
ఉత్తరమే
ఒక ఉత్తరమే
ఉత్తరమే

సార్టర్ ఒక యంత్రం కాదు కాని అతను చేస్తున్న పని యాంత్రికంగా నైపుణ్యం కావాలి. గంటకు 600 ఉత్తరాలను ఎంతో త్వరితగతిలో పనిచేయడం; ప్రతి ఉత్తరం సరియైన స్థలంలోకి వెళ్లేట్టు చూడడం. ఒక్క రోజులో సుదర్శన్ 4500 వరకు ఉత్తరాల్ని పంపుతాడు. ఇది బాధ్యతతో కూడిన పని. దీని నాతడు తన సామర్థ్యానికి తగినట్టి నిపుణతతో జాగ్రత్తగాను చేస్తున్నాడు. తంతి తపాల శాఖలో ఇటువంటి 15000 మంది సుదర్శనులు ఉన్నారు వీరు 400 కోట్లు తపాలా సామగ్రిని త్వరగాను, సమర్థవంతంగాను ప్రజలకు అందజేస్తున్నారు.

తంతి తపాల శాఖ





తొలిమాట

ఈ మధ్య వరసగా రెండు మూడు నెలలనుంచి 'జ్యోతి' ఆలస్యంగా మార్కెట్‌లోకి వస్తున్నట్టు పాఠకులు, ఏజెంట్లుకూడా ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదు నిజమే కనుక, మన్నించవలసిందిగా మా మనవి.

ప్రస్తుతం మా కున్న పరిమిత సదుపాయాల తోనే సకాలానికి పత్రిక వెలువరించాలని ఎంత దురాశ పడుతున్నా, అది అడియాసగానే మిగిలిపోతోంది. దీని బాధ్యతలో నూటికి 80 వంతులు సర్కారువారు వహించక తప్పదు. మార్చి ఒకటి నుంచి 45 వంతులు కూడా వారు వహించవలసి వుంటుంది.

అయినప్పటికి, కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్టు తాలూకు మొదటి యూనిట్ నుంచి 60 మెగావాట్లు విద్యుచ్ఛక్తి మే నుంచి లభిస్తుందని దొరతనంవారు హామీ ఇస్తున్నారు. వాటిలో మా వాటా మాకు రావడం, అదే సమయానికి మా 'జ్యోతి ప్రెస్' కు కొత్త యంత్రాలు రావడం కూడా జరిగితే పత్రిక యథాప్రకారంగా ప్రతి నెల 26 వ తేదీకే వెలువడగలదని మేమూ హామీ ఇస్తున్నాము.

మా ఇంప్రువ్ మెంటాలిటీని, డెవలప్ మెంటాలిటీని (25 వ పేజీ) మా అభిమానులు ఆశీర్వదించ గలరని ఆశిస్తున్నాము.

జ్యోతి మేనేజింగ్ ఎడిటర్.

జ్యోతి బుక్స్

సరికొత్త ప్రచురణలు

వేట

ముళ్ళపూడి వెంకటరమణ

వెల : రూపాయిన్నర

వంటొచ్చిన మొగాడు

భమిడిపాటి రామగోపాలం కథలు

(మొదటి సంపుటం)

వెల : మూడు రూపాయలు

క్షమాహతుడు

(అద్భుత రస ప్రధానమైనగాథ)

రచన : భూపతి

వెల : రెండు రూపాయలు

1966 లో మీ రాశిఫలం

(జన్మ, నామ నక్షత్రాలనుబట్టి స్త్రీ పురుషుల అదృష్టాలను తెలియజేసే ఉత్తమ గ్రంథం)

రచన : మహేష్

వెల : రూపాయి

ఇతర ప్రచురణలు

80 రోజులలో భూప్రదక్షిణం

మూలం : జూల్స్‌వెర్న్

అనువాదం : ముళ్ళపూడి వెంకటరమణ

సాదా ప్రతి : వెల : రు. 5—00

మేలు ప్రతి : వెల : రు. 6—00

బి. వి. రమణరావు రచనలు

కథలు వెల : రు. 2—50

నాటికలు వెల : రు. 1—50

నేనుచూసిన అమెరికా

రచన : ఎ. నాగేశ్వరరావు

సాదా ప్రతి వెల : రు. 2—50

లైబ్రరీ ఎడిషన్ వెల : రు. 3—50

కూనలమ్మ పదాలు

రచన : ఆరుద్ర

అదనపు పదాలతో—వెల: రు. 1—00

రసికజన మనోభిరామం

(హాస్యసంపుటి) వెల: రు. 1—00

ప్రతులకు :

జ్యోతి బుక్స్, విజయవాడ-2

జ్యోతి

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట పోస్టు

విజయవాడ—2.

విడిప్రతి వెల

75 పైసలు

ఏడాది చందా

9 రూపాయలు

సంపుటి 4

మార్చి 1966

సంచిక 3

మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్

బాపు

సంపాదకవర్గం

నండూరి

రామమోహనరావు

ముళ్ళపూడి

వెంకట రమణ

వి. ఎ. కె. రంగారావు

రావికొండలరావు

ముఖచిత్రం :

అన్నపూర్ణావారి

'ఆత్మ గౌరవం' లో దృశ్యాలు

ఉత్తరాలు

మీరు ప్రచురిస్తున్న రెండు సీరియల్ నవలలూ అట్టే బాగు లేవని తెలియ చేయడానికి చింతిస్తున్నాను.

"చదువుకున్న కమల" నవల చాలా సిల్లీగా వుంది. శృంఖల తెలియని అత్తగారూ, అధునిక మైన కోడలూ, వీళ్ళిద్దరి మధ్యా దెబ్బ లాటలూ ఇలాటి వేసినా ఎంత సేపూను? పైగా ముప్పాళ్ళ రంగ నాయకమ్మగారి తక్కిన నవలలలో లాగే ఇందులోకూడా ఎక్స్ట్రీమిటీస్ కావాలని కల్పించినట్టు కనిపిస్తోంది. లేకపోతే ఎలాటి మధ్యతరగతి కుటుంబములో నైనా ఎడమచేత్తో పచ్చడి వడ్డించే అత్తగారూ, యువ దంపతుల మంచం మీద దర్జాగా పడుకునే మామగారూ నిత్య జీవితంలో ఉంటారా?

పోతే, విజేత నవల మామూలే. ఏవో నాలుగు సినిమాలు చూసి, అందులో హీరో, హీరోయిన్ లను దృష్టిలో పెట్టుకొని, మిరకిల్స్ లాటి సంఘటనలను వర్ణిస్తూ నవల రాయడం శ్రీమతి యద్దనపూడి సులోచనా రాణిగారికి అలవాటే.

సహజమైన వాతావరణంతో, సాంఘిక సమస్యలు చర్చించే చక్కటి తెలుగు నవలలు మీరు అందించలేరా?

ఎన్. రామకృష్ణారావు.
అనంతపురం.

ఫిబ్రవరి సంచికలో శ్రీ అక్కినేని గురించి శ్రీ సవ్యసాచి గారు వ్రాస్తూ శ్రీ అక్కినేని గార్ని "మార్పు తేవలసిన మనీషి" గా పేర్కొన్నారు. చక్కగా వివరించారు. చాలా సమంజసంగానూ, సందర్భోచితంగానూ సంస్కార వంతంగానూ వుంది రచయిత వ్యాసం, వ్యాఖ్యానం.

బి ఎస్. రామారావు,
తిరుపతి.

జ్యోతిలో మీరు ప్రచురిస్తున్న సీరియల్ 'చదువుకొన్న కమల' ఎంతో బాగుంది. మొదటినుంచి కథలో సహజత్వం, వాస్తవికత, పటుత్వం వుండటంవల్లనే కథ రసవత్తరంగా వుంది. దాదాపు కుటుంబాల్లోనూ, సమాజంలోనూ జరిగే సంఘటనలను ఆధారంగా వుంచుకొని కథను రసవత్తరంగా, పాఠకుల్ని ఆకర్షించేలా చేసే నైపుణ్యం ఈనాటి రచయిత్రులలో కెల్లా శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారి కలంలోనే వుందంటే అతిశయోక్తి కాదేమో ! వారి కథల్లోని

పాత్రలు, సంఘటనలు సహజంగానూ, వాస్తవానికి దగ్గరగాను వుంటాయి.

ఈ నెల జ్యోతిలో మీరు మీ అభిమానులకు తొలిమాటగా అందించిన సందేశం చదివి ఎంతో సంతోషించాను. మీ జ్యోతి ఆంధ్ర ప్రజానీకానికి ఆశాజ్యోతిగా మారాలని హృదయ పూర్వకంగా అభిలషిస్తున్నాను.

పాటిమళ్ళ శ్యామసుందరప్రభు
సత్తెనపల్లి.

ఫిబ్రవరి సంచికలో రెండవ బహుమతి పొందిన కథ 'విశాల' 6 లేక 7 ఏళ్ళక్రితం ఆంధ్రపత్రికలో ప్రచురింపబడిన కొండముది హనుమంతరావ్ (లేక వాకాటి పాండురంగారావు) కథ "సైకాలజీ"కి నకలు. ఇలాంటివి ఇక జరగకుండా చూడాలి మీరు.

యమ్. యస్. మూర్తి.
అహమ్మదాబాదు.

చదువుకున్న కమలకి — పాత కాలపు అత్తా మామలు పెట్టే ఆరళ్ళు—బొత్తిగా 'సిల్లీ' అనిపించినా, వాటిని చిత్రీకరించేందుకు రచయిత్రి ఎన్నుకొన్న శైలి చక్కగా వుంది. శ్రీమతి రంగనాయకమ్మగారు 'స్త్రీ' అనే సబ్జెక్ట్‌లో ఎంతకాలం రిసెర్చ్ చేశారోగాని, తరచుగా చదివే ఈమె కథల్లో చిత్రీకరణ చూస్తూంటే ఆ సబ్జెక్ట్‌లో ఈమెకు డాక్టరేట్ ఇవ్వవచ్చని పిస్తుంది.

జ్యోతిలో రాయని భాస్కరుడు వ్రాసిన గిరీశం లెక్చర్స్ మాకు చక్కిలిగింతలు పెడుతున్నాయి. జ్యోతి అందానికి మెరుగులు దిద్దుతోన్న అమూల్యాభరణాలు—మీరు నెల నెలా ప్రచురిస్తూన్న కార్టూన్లు మరియు — బిట్లులు

—తెన్నేటి రామారావ్,
రూర్కెలా, (ఒరిస్సా)

కొద్ది మాసాలుగా 'జ్యోతి' చదువుతున్నాను. ఇప్పుడు నా అభిమాన పత్రిక అయినది. ఈ నెల (ఫిబ్రవరి) జ్యోతిలోని కథ 'అసమర్థుని సామర్థ్యం' వాస్తవానికి దగ్గరగా నున్నది. "అణగి మణగి అణకువగా వున్నవాళ్ళని అనాదరం చెయ్యడం, ఎదిరించి పౌరుషంగా నిల్చినవాళ్ళని, పైకి ఎగతీయటం—నెమ్మదయిన వాళ్ళకి ఒక పూట కలవైనా దొరకదు" అను ఆ కథలోని వాక్యాలు ఏ ఆఫీసుకైనా వర్తించేవే. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. 'విజేత' సీరియల్ చాలా బాగున్నది. జ్యోతికి మా ధన్యవాదములు.

ఎన్. నరసింహారావు,
తిరుమల.

రాజకీయాలు

ప్రజలకు, ప్రభుత్వాలకు కూడా గడ్డురోజులు.
1965 కంటె 1966 అన్నివిధాలా దేశానికి పెద్ద సవాల్‌గా పరిణమించబోతున్నది.

ఈనాడు దేశాన్ని ఎదుర్కొంటున్న సమస్యలు కొత్తవని కాదు; ఇదివరలో లేవనికాదు. అవి మరీ వికృతరూపం ధరించి వెక్కిరించడమే ఆందోళనకరం. ఆ సమస్యలకు పరిష్కారావకాశాలు కనుచూపు మేరలో ఎక్కడా కనబడకపోవడం ఇంకా ఆందోళనీయం.

● ● ●

ముఖ్యంగా ఆహారసమస్య క్రింద కేడాది వర్షాలు దాదాపుగా లేకపోవడంతో ఆహార ధాన్యాలను బాగా పండించే కొన్నిరాష్ట్రాలలో పంటలు బాగా దెబ్బతిన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. వరిపంట సుమారు నాలుగోవంతు తగ్గిపోయింది

దేశం మొత్తం మీద చూసుకుంటే ఈయేడాది తిండిగింజల కొరత కోటినుంచి కోటిన్నర టన్నులలోపల ఎంతైనా ఉండవచ్చునని కేంద్ర ఆహార శాఖ వారి అంచనా. ఆ లెక్కలో అమెరికా నుంచి, ఇంకా ఇతర దేశాలనుంచి ధాన్యాలను (గోధుమలు, బియ్యం కూడా) దిగుమతి చేసుకుని కాటకం నుంచి బయటపడాలని ఆహార మంత్రి సి. సుబ్రహ్మణ్యంగారి పథకం.

కాని, ఆయన చెబుతున్న లెక్కలన్నీ తప్పని, కావాలని కల్పిస్తున్నవని, అసలు లోపం ప్రభుత్వ విధానాలలోనే వుందని కొందరి వాదం. ప్రస్తుతం వున్న ఆహార మండలాలను రద్దుచేయాలని ఒక వర్గంవారు, దేశమంతటా గుత్త పద్ధతిలో ధాన్యాలను సేకరించి రేషనింగ్ పెట్టాలని మరొక వర్గం వారు వాదిస్తున్నారు. ఇలాగే ఇంకా ఎవరికి తోచిన సూచనలు వారు చేస్తున్నారు.

నిజంగానే కాటకం రాబోతున్నదని, ధాన్యాలను దిగుమతి చేసుకోవడంకంటె మార్గం లేదని కేంద్ర మంత్రి వాదం.

నిజం ఈ విరుద్ధాభిప్రాయాల మధ్య ఎక్కడో ఉంది. మరొక నిజం ఏమిటంటే, వీలైనంత శీఘ్రంగా మనం ఆహార విషయంలో స్వయం పోషకత్వాన్ని సాధించకపోతే మన దేశానికి ముక్తి లేదన్నది. దేశం స్వతంత్రమై పద్దెనిమిదేళ్ళయినా, ప్రజల ముఖ్యావసరమైన ఆహార విషయంలో ఎందుకు వెనుకబడి వున్నాము? నూటికి 75 వంతుల మందికి ప్రధాన వృత్తి అయిన వ్యవసాయంలోనే మనం ఇంత

దీనావస్థలో ఎందుకుండాలి? ఈ విషయంలో ఎక్కడ లోపం జరిగింది? దాన్ని సరిదిద్దుకునే మార్గాలేమిటి? ఇవన్నీ తక్షణం ఆలోచించవలసిన ప్రశ్నలు.

నాల్గవ ప్రణాళిక అంతం నాటికి పెరిగే జన సంఖ్య దృష్ట్యా మనం పన్నెండున్నర కోట్ల టన్నుల ధాన్యాలను ఉత్పత్తి చేసుకోవాలి. అంటే ఈ యేడాది పంటతో పోల్చిచూస్తే అయిదుకోట్ల టన్నులెక్కువ. ఏడాదికి సగటున కోటి టన్నులు అధికంగా పండించాలి. ఈ సంఖ్యనుబట్టి, ప్రభుత్వం మీద, ప్రజలమీద ఎంత గురుతర భారం పడుతున్నదో ఊహించవచ్చు.

• • •

ఒక్క ఆహారం విషయమే కాదు, ఏది చూసినా రానున్నది గడ్డుకాలమనిపిస్తుంది. తృతీయ ప్రణాళిక ముఖ్య లక్ష్యాలన్నీ విఫలమైనాయి. చతుర్థ ప్రణాళిక వాయిదాపడింది. విదేశీ మారకపు ద్రవ్యం దొరక్క పరిశ్రమలలో అభివృద్ధి మందగించింది. తృతీయ ప్రణాళికలో ఉత్పత్తి ఆశించినంతగా పెంగకపోయినా, ఖర్చుమాత్రం అనుకున్నట్టు జరగడంతో ద్రవ్యోల్బణం పరాకాష్ఠ అందుకుంది. ధరలు విశృంఖలంగా పెరిగిపోయాయి మధ్యతరగతి, క్రింది తరగతి ప్రజల జీవితాలు జీతాల్లాగే ప్రతిష్టంభించిపోయాయి. వేతనాల హెచ్చింపుకోసం సర్వత్రా ఆందోళనలు ఎక్కువవుతున్నాయి. ఈ మధ్య కేరళలో బియ్యం రేషన్ తగ్గింపును పురస్కరించుకుని పెద్దపెట్టున జరిగిన అల్లర్లు నిజానికి దేశాన్ని వేధిస్తున్న సమస్త ఈతిబాధలను కలబోసిన చిహ్నమేనని చెప్పాలి.

ఈ సమస్యల నుంచి దేశాన్ని గట్టెక్కించడం తమవల్ల అవుతుందో కాదో, ఎప్పుడు సాధ్యమవుతుందో కూడా చెప్పలేని స్థితిలో ప్రభుత్వం వుండడం ఇంకా శోచనీయం.

• • •

ఒక్కటే కనిపిస్తోంది మనం సంతృప్తి పడదగిన అంశం. అది ఇండియా పాకిస్తాన్‌లమధ్య కొంతవరకైనా ఉద్రిక్తత తగ్గడం. తాష్కెంట్ ప్రకటనను రెండు దేశాలు గౌరవించ దలచుకున్నాయనడానికి నిదర్శనంగా మొన్నటి 25వ తేదీతో ఎవరి సైన్యాలు వారి యథా పూర్వ స్థానాలకు వచ్చేశాయి. కాశ్మీర్‌లో ఇంకా ప్లెబిసైట్ జరగాలనీ, దాన్ని 'విముక్తం' చేయడమే తమ లక్ష్యమని పాకిస్తాన్ నాయకులు ఇంకా ప్రకటిస్తూనే వున్నారు. కాశ్మీర్‌లో ఎటువంటి రాజీకి అవకాశం లేదనీ, అది ఇండియాలో అంతర్భాగమని మనం కూడా స్పష్టం చేస్తూనే వున్నాము. ఈ సమస్య అలాగే వున్నా, దీనితో సంబంధం లేకుండా మిగతా వివాదాలన్నిటిని పరిష్కరించుకుని రెండు

దేశాలు సఖ్యంతో మెలగాలని మనం కోరుతున్నాము పాకిస్తాన్ ఇండియాపై దౌర్జన్యం చేసి ఏమీ సాధించలేనని గ్రహించినట్టే వున్నది. అయినప్పటికి అది కాశ్మీర్‌పై దురాశను ఇంకా వదులుకోలేదు కనుక మన జాగ్రత్తలో మనం వుండడం తప్పనిసరి.

• • •

ఇన్ని సమస్యల మధ్య నలిగిపోతూ, ఎన్ని అలజడులకు, ఆందోళనలకు గురి అవుతున్నా మన దేశంలో ప్రజాస్వామ్యం చెక్కు చెదరకుండా నిలవడం మనం గర్వించదగిన విశేషం; ఇతరులు మెచ్చుకోదగిన విశేషం ఒక్కసారి మనచుట్టూ జరుగుతున్న సంక్షోభాలను చూస్తే ఈ సంగతి తెలుస్తుంది.

ముఖ్యంగా ఆఫ్రికా ఖండాన్ని తీసుకుంటే, గడచిన నాలుగైదు నెలలలో ఆరు మిలిటరీ తిరుగుబాట్లు జరిగాయి. ఆల్జీరియా, కాంగో, దహోమీ, అప్పర్ వోల్టా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, నైజీరియా; ఇప్పుడు ఏడవది ఘానా.

ఒక పదేళ్ళనుంచి ఘానాపై నియంతృత్వం చెలాయిస్తున్న ప్రెసిడెంట్ ఎన్‌క్రుమా పదవీ భ్రష్టుడయ్యాడు. ప్రెసిడెంట్ హోచిమిన్ ఆహ్వానంపై ఉత్తర వియత్నాం వెళ్ళడానికి బయల్దేరిన నాలుగురోజుల్లో, ఆయనపై స్వదేశంలోని సైన్యం తిరుగుబాటు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. ప్రతిపక్ష నాయకులందర్నీ జైళ్ళకో ప్రవాసానికో పంపించి, ఘానాలో ఏక పక్ష పరిపాలన నెలకొల్పి, తాను యావజ్జీవాధ్యక్షుడుగావుండి ఎన్‌క్రుమా సాగిస్తున్న నియంతృత్వం ఆయనకే ఎదురు తగిలింది. ఇప్పుడు విదేశాలలో వున్న ఎన్‌క్రుమా తిరిగి స్వదేశం వెళ్ళడం, తిరిగి అధికారం స్వాధీనం చేసుకోవడం దాదాపు అసంభవం అసంభావ్యం కూడా.

ఇండొనీసియాలో కూడా పరిస్థితి ఇంచుమించు ఇలాగే వుంది. కిందటేడాది అక్టోబరులో ప్రెసిడెంట్ సుకర్ణోపై జరిగిన తిరుగుబాటు విఫలమైంది. దేశంలో కమ్యూనిస్టు పార్టీపైన, చైనా పైన విపరీతంగా ద్వేషం రగిలింది. అప్పటివరకు చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సుకర్ణో పలుకుబడి తగ్గి, మితవాద సేనాని జనరల్ నసూతియాన్‌ను రక్షణమంత్రి పదవి నుంచి, సైనిక పదవులనుంచి బర్తరఫ్ చేశాడు. పోయిన బలాన్ని తిరిగి సంపాదించుకోవాలని ఆయన ఆశ. అయితే ఇది అంత సులభం కాదని, ఆయన ఎంత గొప్ప నాయకుడైనా, విప్లవ వీరుడైనా, ఆయన నియంతృత్వాన్ని సహించే స్థితిలో సైన్యం కానీ, ప్రజలు కానీ లేరని తేలిపోయింది. ఇదంతా చివరకు ఇండొనీసియాలో అంతర్యుద్ధంగా పరిణమించినా ఆశ్చర్యం లేదు.

□□□

[ఈ సంచికలో వస్తుందని ప్రకటించిన "బొమ్మ-బొరుసు" శీర్షిక అనివార్య కారణాలవల్ల వాయిదా పడవలసి వచ్చినందుకు సంపాదకవర్గం చింతిస్తున్నది.]

మానస సందేశం

నట్టింట ను వెలిగే యిల్లాలు
పుట్టింటికి వెళ్ళిన కొన్నాళ్ళు
పుట్టింటికి నేనిక పోలేను
పట్టింపుకునైనా రాలేను

చిరునవ్వులు పూచే మల్లియలు
సరితూగవు కాంతల తలపులకు
మురిపించే వలపుల చూపులకు
ధరకట్టగ యెవ్వరి తరమౌను

దూరాలకు పోయిన ప్రియురాలు
మారాములు చేయును మనసెరిగి
గారాలకు వనితలు దేవతలు
నోరాడదు వారిని గనినంత

విలపించిన నా వెత లాలించి
వలపించెను గిరు లా వేదనలో
గలగలమని పారెను సెలయేరై
కలవరమున నా మనసే కరిగి

విరహాలకు గురియౌ ప్రేమికుల
తరహాలే వేరని విన్నాను
కరువయ్యెను ప్రేయసి నాకిపుడు
మొరవినుటకు నాకిక దిక్కెవరు!

చిలుకలు హంసలు మేఘాలు
కలసొచ్చె రోజులు పోయాయి
కలమందుని కలకల మున్నపుడు
కల నాదము ధ్వనించు టెట్లాగ?


చిలకమ్మను పంపగ భయమౌను
ఫలమనుకొను నేమో అధరమును
కల కండని మోవిని కొరికేనా
నలువైనా తిరిగి యీ గలడా?

కలహంసను పంపుట అలవాటు
కలదైనా నాకొక సందేహం
జలజాలే హంసకు భోజనము
వలినా లే ప్రేయసి అంగాలు

మృదుభాషణ జలదమునకు లేదు
మధు భావన నైనా గర్జించు
నదమంతా తాగి కైపెక్కి
వ్యథ మిగులును నాకథవికటించి

నయకోవిదురాలై నా మనసు
పయనించెను రెక్కలు విరజాచి
ప్రియురాలికి నా దశ వినిపించు
నియమాలను దాటదు నాదూత.

ఎం. రామకోటి



పద్మశ్రీ అయిన మనీషి

రచయిత్రిగా పేరొందిన అభినేత్రి కాకపోతే, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి బహుమతి ఆమెకు లభించేదా?'

అభినేత్రిగా అంత చక్కని రచయిత్రి కాకపోతే ఆమెకు భారత ప్రభుత్వం వారి "పద్మశ్రీ" బిరుదు లభించేదా?

ఇది శ్రీమతి భానుమతిపై గాఢాభిమానం కలవారిని కూడా బాధించే గూఢానుమానం.

ఆమెకుమాత్రం అటువంటి అనుమానం, సంకోచం ఏ కోశానా లేవు. ఆ మధ్య హైదరాబాదులో జరిగిన ఒక సన్మాన సభలో మాట్లాడుతూ (పేపర్ల వార్తల ప్రకారం), తనకు కొత్తగా వచ్చిన గౌరవం ఏమీ లేదని, తాను మొదటినుంచి పద్మశ్రీనేనని ఆమె అన్నారట.

ఈ ప్రకటననుబట్టి తాను పద్మవిభూషణ, లేదా పద్మ భూషణ బిరుదానికి, అర్హురాలని ఆమె భావంగా ఎవరన్నా అర్థం చేసుకుంటే పొరపాటే. తన ఘనత తనకు తెలుసునని, దాన్ని బిరుదులతో, బహుమతులతో గౌరవించినా, మానినా ఒకటేనని మాత్రమే ఆమె భావం.

తరచుగా ఇటువంటి ప్రకటనలు చేయడం వల్లనే భానుమతిని అహంభావమతిగా గిట్టనివాళ్లు వర్ణించినా, తనకు అహంభావం బొత్తిగా లేదని, ఉన్నదల్లా ఆత్మ విశ్వాసమని ఆమె అభిప్రాయ పడతారు. కాని ప్రతి మనిషికి వుండవలసిన ఈ గొప్ప గుణం ఒక్క విసరు కసరెక్కి రాజసంగా పరిణమించిందని పలువురి నమ్మకం.

ఈ రాజసం ఆమెలో ఆమె చక్కదనమంత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. "స్వర్గ సీమ" నాటినుంచి, తారాపథానికి నిచ్చెనపై ఆమె ఒక్కొక్క మెట్టు, ఆమె రాజసం రెండేసి మెట్లు అధిరోహించడం చాలా ఆసక్తికరమైన విషయంగా చెప్పుకోవచ్చు.

నటన వృత్తిగా కలవారికి వ్యక్తిత్వం వుండదని, వుండరాదని ఈ వాక్యాల తాత్పర్యం కాదు. కాని, నటిస్తున్నప్పుడు స్వీయవ్యక్తిత్వాన్ని

పగ్గంవేసి పట్టుకో గలగడమే ఆ వ్యక్తిత్వమై ఉండాలి. భానుమతి గారి శక్తిమంతమైన వ్యక్తిత్వం ముందు ఏ పాత్ర అయినా బలాదూరే. మల్లీశ్వరి కానివ్వండి, దేవదాసి కానివ్వండి, నాయకురాలు కానివ్వండి, మరేపాత్ర కానివ్వండి భానుమతిగారి వేషంలో నటించ వలసిందే.

ఆమెను లలితకళా గీర్వాణిగా వర్ణించడం అతిశయోక్తి కాదు. గానంలో కూడా ఆమె గీర్వాణి తనం ప్రస్ఫుటంగా వినిపిస్తుంది. సరిగమల స్వరగమకాలను పలికించడం లోనే తాను గీర్వాణిననే భావాన్ని ఆమె పలికిస్తారు. ఈ భావం ఒక్కరవ్వ తక్కువవుంటే ఆమె కంఠం మరెంత మధురంగా వుండేదోనని ఆమె అభిమానులు ఊహించుకోవడం సహజం.

శ్రీమతి భానుమతి అందమైన రచయిత్రి అనడం కూడా అతిశయోక్తి కాదు. తనంత చక్కని రచన లామె చేయడం, తెలుగు సాహిత్య శ్రీకోశ ముత్యాలమాలను కూర్చడం మన అదృష్టం. తారగా ఆమె కీర్తిని, రచయిత్రిగా ఆమె స్ఫూర్తిని వేర్వేరుగా విడదీసి చూసి విలువకట్టినా ఆమె 'అత్తగారి కథల' అందాన్ని అస్వాదించడం కష్టం కానక్కరలేదు.

బహువిధ ప్రజ్ఞాశాలిత్వం కోసం ఆమె చేపట్టిన కళలన్ని (చలన చిత్ర దర్శకత్వం, సంగీత దర్శకత్వంతో సహా) ఒక ఎత్తు, రచనా పారీణత మరొక ఎత్తుగా ఆమె ఎన్నటికీ పద్మశ్రీమతే.

—నవ్యసాచి



రైలుకు ఇంకా గంటన్నర వ్యవధి వుంది, అక్కడనుంచి ఎంత త్వరగా బయట పడితే అంత మంచి దనిపించింది.

అనవసరంగా మనసు పాడుచేసు కున్నాడు. వరుసగా రెండు రాత్రిళ్ళ నుంచి ఆమెను గురించి ఆలోచిస్తూ నిద్ర పాడు చేసుకున్నాడు. ఏ పన్నెండింటికో ఒంటి గంటకో నిద్ర పడితే ఆ నిద్రలో కూడా ఆమెను గురించిన కలలు!

చిత్ర మేమిటంటే ఆమెను గురించి తనకు ఏమీ తెలీదు. డాక్టరింటికి ఎదురింట్లో వుంటున్నది ఆమె. మూడు రోజులనాడు తను వరండాలో కూచుని పేపరు చూస్తున్నాడు. ఆమె డోర్ కర్టెన్ పక్కకి తొలగించుకొని వచ్చి వాకిట్లో నిలబడ్డది. సన్నగా, ఎర్రగా, పెద్ద పెద్ద కళ్ళతో చూడ ముచ్చటగా ఉన్నది. ఆమె తన్ను గమనించి నట్టులేదు. ఏదో బొగొట్టుకొన్న దానికిమల్లే బజారుకేసి చూస్తోంది. పేపరు చూడటం మాని ఆమెకేసి చూస్తూ కూచున్నాడు తను. అవిడ చాలాసేపు అలాగే నిలబడి వుంది. తర్వాత లోపలికి వెళ్ళి దభీమని తలుపు వేసుకుంది.

ఆ అమ్మాయి అలా యింట్లోకి వెళ్ళిన తర్వాత కూడా విశ్వనాథం గారు అలాగే చాలాసేపు ఆ యింటి కేసి చూస్తూ కూచున్నారు. ఆ యింట్లో ఎవరూ వున్నట్టు లేదు. బహుశా భార్యా భర్తా ఇద్దరే వుండ వచ్చు. భర్త ఆఫీసుకు పోయ్యాడేమో అనుకున్నాడు.

ఆ అమ్మాయిని చూచిన తర్వాత, ఆ అమ్మాయి భర్తను గురించి



ప్రథమ బహుమతి [రూ. 50]

ఎస్. జయరామరెడ్డి
(బి. ఇడి. క్లాస్. కె. ఎన్. కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, బళ్ళారి)

వూహించకుండా వుండలేక పొయ్యాడు.

విశ్వనాథం వూహాలో చక్కటి అబ్బాయి మెదిలాడు. ఎర్రగా, నొక్కుల జుత్తు, కంటికి రిమ్‌లెస్ అద్దాలూ – అన్ని విధాలా ఆ అమ్మాయికి తగిన భర్త!

తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు.

మరి నిజంగా ఆ అమ్మాయిది అన్ని విధాలా అనుకూల దాంపత్యమైతే ఆ కళ్ళల్లో దిగులేమిటి? ఏదో పోగొట్టుకొన్న దానికిమల్లే అలా చూస్తూ నిలబడ్డ దెందుకు? లేదు – ఆ అమ్మాయి జీవితంలో ఏదో పోగొట్టుకున్నది. బాధపడుతున్నది!

ఆ అమ్మాయి భర్తను చూస్తే కొన్ని విషయాలు వూహించవచ్చు. ఆ అమ్మాయి భర్త తను వూహించినట్టు, అందమైనవాడైనా, ఆ అమ్మాయిపట్ల అతనికి ప్రేమలేకపోవచ్చు. ఆ అమ్మాయి అంటే లక్ష్యం లేకపోవచ్చు. లేదా బొత్తిగా రసికత్వంలేని చవట కావచ్చు. ఏదో ఉన్నది. అదితెలుసుకోవాలన్న జిజ్ఞాస అంతకంతకూ విశ్వనాథంగారిలో బలపడసాగింది.

విశ్వనాథంగారు మళ్ళీ నాలుగింటికి వరండాలో కూచున్నాడు. అట్లా కూర్చోవడంలో, విశ్వనాథంగారి వుద్దేశం ఆ అమ్మాయిని చూడాలని!

వేటుగానికి మల్లే అరుగంటల వరకూ అలాగే కాపువేసి కూచున్నాడు. సరిగ్గా ఆరింటికి ఒక వ్యక్తి వచ్చి తలుపు తట్టడం చూచాడు. ఎక్కడలేని జుగుప్స కలిగింది. తను ఊహించిన లక్షణాలు ఏ ఒక్కటి అతనిలో లేవు. అతనికి వయసు మళ్ళింది. వార్ధక్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మనిషి నల్లగా, పీలగా, పీనుగుమల్లే వున్నాడు.

ఆ అమ్మాయి జీవితంలో యేం పోగొట్టుకొందో కళ్ళముందు స్పష్టంగా కనిపించింది. ఆ అమ్మాయి మీద విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది.

విశ్వనాథానికి ఆ రోజు రాత్రి అన్నం రుచించలేదు. మనసంతా అస్తవ్యస్తమైపోయింది.

రాత్రి పడుకుంటే పక్క కుదరలేదు. నిద్ర రాలేదు. ఆ అమ్మాయిని గురించిన ఆలోచనలే. ఏ పన్నెండింటికో కాస్త కలతనిద్ర పట్టింది. రకరకాల కలలు వచ్చాయి. ఆ అమ్మాయి బట్టలమీద కిరసనాయిలు పోసుకొని నిప్పంటించుకున్నది. ఇంట్లోనుంచి మంటలు – పొగలు, ఇంటిచుట్టూ జనం పోగయ్యారు. గునపాలతో తలుపులు పగలగొడుతున్నారు!

విశ్వనాథం కెవ్వున కేక వేసి కూర్చున్నాడు. తర్వాత నిద్ర పట్టలేదు. వెళ్ళి కిటికీ తెరచి ఆ యింటి వైపు చూచాడు. గ్లాస్ విండోస్ గుండా పచ్చటి బెడ్‌రూము లైట్ కాంతి కనిపిస్తోంది. కిటికీ చువ్వలు పట్టుకొని, అట్లాగే, ఆ యింటి వైపు చూస్తూ నిలుచున్నాడు.

ఉదయం ఎనిమిదింటికి ఆమె మళ్ళీ గడపలో నిల్చుంది. తెల్లటి చీర–తెల్లటి రవికా – రాయంచలా గుమ్మంలో నిల్చుంది. రోడ్డుమీద పోయే జనాన్ని, కార్లని, బస్సుల్ని చూస్తున్నది. ఒకటి రెండు సార్లు విశ్వనాథం వైపు చూసింది.

విశ్వనాథానికి అక్కడ ఉండటం ముళ్ళమీదున్నట్టుంది. గబగబా బెడ్డింగు సర్దాడు. ఇంతలో కాఫీ వస్తే, అది కూడా ముగించి–డాక్టరు తోనూ–ఆయన భార్య సుశీలతోనూ సెలవు తీసుకుందామని – గబగబా మెట్లుదిగి కిందికి వచ్చాడు.

మండువాలో సుశీల ఎవరితోనో మాట్లాడుతోంది. ఆ మాటలు తనకు సంబంధించినవి. విశ్వనాథం లోపలికి వెళ్ళకుండా గడపలోనే తచ్చాడుతూ నిలుచున్నాడు. మాటలు స్పష్టంగా వినిపిస్తున్నవి.

'ఆయన, విశ్వనాథం గారని మా వారికి ఫ్రెండు. ఏదో పనిమీద వచ్చాడు. ఇవ్వాళో రేపో వెళతారు' అంటున్నది సుశీల.

అవతలి వ్యక్తి సన్నగా నవ్వడం వినిపించింది. తర్వాత 'ఎవరో పేషంటనుకున్నాను. మూడు రోజుల నుంచి చూస్తున్నాను. వరండాలో కూచొని బజారుకేసి దిగులుగా చూస్తుంటాడు. టి. బి. లాంటి వ్యాధేమో, ప్రాణభయం గామాలు అనుకున్నాను అయితే డాక్టరుగారి ఫ్రెండన్నమాట. ఏమిటో ఒకోసారి పిచ్చిగా ఆలోచిస్తాము. ఆ ఆలోచనలకు అర్థం పర్థం వుండదు."

విశ్వనాథానికి తల గిర్రున తిరుగుతున్నట్టయింది. లోపలికి తొంగి చూచాడు. ఆ అమ్మాయి!

లోపలికి వెళ్ళడమా. మానడమా అన్న సందిగ్ధంలో పడ్డాడు. వెనక్కు తిరుగుతున్నాడు.

"ఎవరూ? విశ్వనాథం అన్నగారా? లోపలికి రండి" అన్నది సుశీల. ఎవరో వెనక తోస్తున్నట్టు లోపల అడుగుపెట్టాడు. ఆ అమ్మాయి తనవైపు వింతగా చూస్తూ బయటకు వెళ్ళిపోయింది.

విశ్వనాథంగారికి గొంతు పెగలలేదు. కష్టం మీద "వూరికి వెళ్తున్నానమ్మా, చెప్పిపోదామని వచ్చాను" అన్నాడు.

సుశీల కొడుక్కి రిక్షా పిలవమని చెప్పి "చూచారా అన్నగారూ! ఎదురింటి జానకి మిమ్మల్ని చూచి..."

విశ్వనాథంగారు మధ్యలోనే మాటు తుంచుతూ. 'విన్నాను' అన్నాడు పేలవంగా నవ్వి.

జానకి తన్ను గూర్చి అట్లా వూహించినందుకు వంటి మీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టుంది. అట్లాంటి స్థితిలో కూడా, విశ్వనాథానికి ఆమెను గూర్చి తెలుసుకోవాలన్న జిజ్ఞాస సడలలేదు.

"ఎవరమ్మా, ఆమె? యథాలాపంగా అడుగుతున్నట్టు అడిగాడు.

"మన ఎదురింట్లో వుంటున్నారు. ఆ అమ్మాయి భర్త లెక్చరరు. ప్రేమించి పెళ్ళిచేసుకున్నారిద్దరూ" అన్నది సుశీల.

తలమీద సుత్తితో కొట్టినట్టు అదిరిపడ్డాడు విశ్వనాథం. 'వస్తానమ్మా' అంటూ వెళ్ళి రిక్షాలో కూచున్నాడు. ప్రక్క రూములో వున్న డాక్టరుతో చెప్పి వెళ్ళాలన్న విషయం కూడా స్ఫురించలేదు ఆయనకి ఆ క్షణాన.

□□□

సైకాలజిస్టు శంకరం

విపరీతమైన ఉత్సాహం కన్పిస్తోంది ఎటు చూసినా. రోడ్డుకు రెండు వంకలా చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నాడు శంకరం. శంకరం మఠందగ్గర చాలా రద్దీగా గడబిడగా వుంది. కనిపించని దేముడి కోసం, శరీరాల్ని మనసుల్ని పట్టి వ్రేలాడుతున్న పాపాల్ని దులువుకోవడంకోసం మనుషు లక్కడ పోగవుతున్నారు.

చుట్టూ ఉన్న చైతన్యం చూస్తుంటే శంకరంలో కూడా ఉత్సాహం ఉప్పెనలా ఎగసింది. వెంటనే ఏదో చెయ్యాలి. కాని శంకరంలాంటి సామాన్యుడు అనుకున్న వెంటనే ఏం చెయ్యగలగుతాడు. విమానం ఎక్కి గాలిలో ఎగరలేడు. కారులో కూర్చుని చక్రం తిప్పలేడు. క్రొత్తదనంకోసం రిక్షా ఎక్కి త్రొక్కనూ లేడు. ధనికుడూ కాలేడు. దరిద్రుడూ కాలేడు. మధ్యస్థమైన భావుకత్వపు వ్యక్తిత్వంలో బ్రతకవలసినవాడు మరి.

నెమ్మదిగా శంకర మఠం లోపలికి దారి తీశాడు. కాలికేదో తాడు పేనుకున్నట్లనిపించి క్రిందకు చూస్తే ముష్టివాడిలాంటివాడొకడు కాళ్ళు పట్టుకున్నాడు "చెప్పు లిక్కడియ్యండి సార్. ఐదు పైసలు" అన్నాడు వాడు. "నా దగ్గర నాలుగు పైసలే సార్" అన్నాడు వాడి ప్రక్కనున్న మరొకడు. ఇద్దరి దగ్గర చెరో చెప్పూ పడేసి, ఇద్దరికీ చెరో మూడు పైసలూ యిచ్చి నవ్వులాంటి ముగ్గులు వాళ్ళ ముఖాన పడేసి తెల్లబోయిన వాళ్ళు నల్లబడకముందే లోపలకు వెళ్ళాడు శంకరం.

అడ్డెడు వడ్లు గిన్నెలో కుంచెడు బోసినట్లు కిటకిటలాడుతోంది లోపలంతా. పరికిణీలవాళ్ళూ, చీరలవాళ్ళు, పంచెలవాళ్ళూ గోష్టాం పంట్లాలవాళ్ళూ అందరూ భుజాలు పూసుకుంటూ లోపల సందడిగా తిరుగుతున్నారు. ఎవరి మనసుకు నచ్చిన పనులు వాళ్ళు చేస్తున్నారు.

ఊహిస్తూ తర్కిస్తూ కాలంగడపాలంటే సరదాపడే రకం శంకరం.

'ఇంతమంది జనం యిక్కడ యిలా కూడారుకదా, వీళ్ళందరూ ఈ క్షణాన ఏం ఆలోచిస్తుంటారు." శంకరం ఆలోచన లిప్తకో విధంగా విరుగుతోంది.

మనుషు లందర్నీ పోగు బోసి చూస్తున్న దృష్టి నెమ్మదిగా వెళ్ళి ఎవరో మధ్యవయసావిడ ప్రక్కన కూర్చున్న కుర్రవాడిమీద నిలిచింది. పదేళ్ళుంటాయేమో. బొద్దుగా సామాన్యమైన ఎత్తులో వున్నాడు కుర్రాడు. రుచులకోసం వాపోతున్న వాడి చేతికి, జీడిపప్పు పకోడీ అందినట్లయింది శంకరానికి.

ఆ కుర్రాడు తన వంక చూస్తే పిలుద్దా మనుకున్నాడు. పిలిచి... వాడి మనసుకు ప్రపంచం అంటే ఏం అనిపిస్తుంటుందో ప్రశ్నించి తెలుసుకోవాలనిపించింది సైకాలజీలో బి. యే. చదివిన శంకరానికి.

కుర్రాడు చూడనే చూశాడు శంకరం కేసి యాదృచ్ఛికంగా. శంకరం సూచన గ్రహించి ముందు తటపటాయించినా కదిలివచ్చాడు మొత్తానికి. ఆ కుర్రాడి భుజంమీద చేతులువేశాడు శంకరం. కొండ మీదపడ్డట్టు ముడుచుకున్నాడు వాడు.

... ... ?

అవిడ మా అమ్మ. ప్రక్కన కూర్చుంది మా అక్కయ్య, మధ్య వయసావిడ ఎడంవేపు అందం పోగుబోసినట్లు సొగసుగా పదహారేళ్ళ వయసు కూర్చుని వుంది. కళ్ళు విప్పార్చి చూశాడు రెండు క్షణాల పాటు శంకరం.

"నువ్విక్క డెందుకున్నావ్ ?"

"పురాణం విందామని..." వాడి గొంతులో వణుకు వినబడింది.

"ఆయనెవరో తెలుసా నీకు ?" శంకరం వేలు హరిదాసును సూచించింది.

"దేముడట. మా అమ్మ చెప్పింది" ఈసారి మరీ పీలగా వినిపించింది వాడి గొంతు. వాడు భయపడుతున్న సంగతి గుర్తించలేదు శంకరం. అదే ధోరణిలో తన ప్రయోగం సాగిస్తున్నాడు.

"నిజంగా నువ్వు దేముడ్ని చూద్దామని వచ్చావా ? ప్రసాదం కోసం కాదూ..."

ఆ పిల్లాడు జవాబు చెప్పలేదు. మొహం అంతా ఎర్రబడిపోయింది. కళ్ళు భయంగా, రాక్షసుడికి చిక్కిన వాడిలా చూస్తున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయేమో కూడా. వాడి మనసులో ఏం తిరుగుతోందో కానీ పెదిమలు దడదడ లాడుతున్నాయి. భయపెట్టడానికి వాళ్ళమ్మ చెప్పిన కథలో రాక్షసుడిలాగే కన్పిస్తున్నట్లున్నాడు శంకరం.



ద్వితీయ బహుమతి [రూ. 25]

శ్రీమతి వి. యస్. భారతీమూర్తి

(బి. యస్ సి [ఫైనల్]. ఒ. యు. సైన్సు కాలేజీ, హైదరాబాదు.)

సంగతి అప్పటికిగానీ తెలీలేదు శంకరానికి. ప్రశ్న తీర్చుద్దామని నోరు విప్పబోయేంతలో భుజం మీది చేతులు గట్టిగా విదిలించుకుని బోను తెగ్గొట్టుకు బయటపడిన ఎలక లాగా పారిపోయాడు వాడు.

తల్లి దగ్గరకు వెళ్ళి ఏం చెప్పాడో ఆవిడ రెండు మూడుసార్లు తిరిగి తిరిగి శంకరంవంక చూసింది.

మళ్ళీవస్తే వాడిని పట్టుకుని భయంలేదని సముదాయిద్దామనుకుని నిలబడ్డాడు శంకరం. ఎంతసేపు నిలబడ్డా వాడు మళ్ళీ అటు తిరగలేదు. తల్లి వెనక నక్కి కూర్చున్నాడు. పురాణం అయిపోయాక వెతుకుతే వాళ్ళ జాడ దొరకలేదు శంకరానికి.

• • •

"కొంప వీధిన పడేద్దామనేరా నీ ఉద్దేశం? అవతల వీధిలో శేషమ్మగారని ఉందటోకావిడ, నిన్న సాయంత్రం శంకరమఠంలో వాళ్ళ బ్బాయి నేదో బెదిరించావట. హడిలిపోయి రాత్రంతా ఒకటే జ్వరం పలవరింతలూనట. వాళ్ళ పిల్లనేదో అన్నావుట. మీ వాడిని కాస్త అదుపులో ఉంచండమ్మా అని ఈరోజు ప్రొద్దున్న ఆవిడొచ్చి పెద్ద గలాటా చేసి వెళ్ళింది. ఇదేం బాగుంది చెప్పు."

శంకరం త్రాన్పడిపోయాడు ఈ పరిణామం చూసి.

అంతకంటే ఆశ్చర్యం ముందు ఎదురైంది శంకరానికి.

"రేపు శేషమ్మగారి పిల్లను చూడ్డానికి వెళ్తున్నాం సిద్ధంగా వుండు."

"ఇవుడే పెళ్ళేమిటి నాన్నగారూ..."

"ఇంట్లో జాగ్రత్తగా పడివుంటావని" అంత కఠినంగా మాట్లాడుతున్న తండ్రికి ఏం చెప్పినా వినడన్నది శంకరానికి తెలుసు.

• • •

అత్తవారింట్లో బాదం చెట్టు క్రింద బావమరిదిని బుజ్జగించి బిస్కట్లు పెట్టి బెల్లించాడు శంకరం.

"జుట్టు నుదురుమీద పడేవాళ్లూ గొట్టాంలాగూ తొడుక్కునేవాళ్ళూ మంచివాళ్ళు కాదుట బావా. ఆడపిల్లల్ని అంటే అక్కయ్యలాంటి వాళ్ళని ఏడిపిస్తారుట. పిల్లలచేత కబుర్లు చేస్తారట. అక్కయ్య నాకోసారి చెప్పిందిలే..." దూరంగా వస్తున్న శకుంతలని చూసి ప్రక్కనుంచి జారిపోయాడు కుమ్మ~డు, శంకరం బావమరిది.

వాడిపీక నలుపుదామనిపించింది శంకరానికి. అల్లరిగా నవ్వుతున్న శకుంతల మెడనా నలపాలనుకున్నాడు.

అతని నుదురుమీద పడుతున్న జుట్టుతో ఆడుతున్న శకుంతల మెడ ఎలా నలపాలో తోచక ఉక్కిరిబిక్కిరైపోయాడు - మల్లెపూలు తొడుక్కొచ్చిన రాత్రిలో శంకరం. పాపం పైకాలజిస్టు శంకరం.


□□□

నా ప్రేమ కథ

నేను చాలమంది అమ్మాయిలను ప్రేమించటం నిజం. ఇంతమంది వెంట తిరిగిన ప్రేమ నిజమైన ప్రేమ కాదనీ, అసలది ప్రేమే కాదనీ తీర్మానించాడు ఒక ప్రబుద్ధుడు. ఒకళ్ళతను మరీ ఇదిగా నా దగ్గరకు వచ్చి అడిగాడు కూడా, "నిజంగానే ప్రేమించావా?" అంటూ. ప్రేమలోకూడా నిజంగానూ, అబద్ధంగానూ అని రెండు తరగతులున్నాయని నాకు తెలియదు. మనస్ఫూర్తిగానే వాళ్ళందరినీ అభిమానించాను. "నువ్వు లేకపోతే నేను బ్రతకలేను. నువ్వు నిరాకరిస్తే చచ్చిపోతాను" అంటూ సినిమా డైలాగులు చెప్పకపోయినా, వాళ్ళందరికీ భారతమంత 'లవ్ లెటర్సు' వ్రాయకపోయినా, నేను హృదయపూర్వకంగానే వాళ్ళంటే 'పడిచచ్చి' పోయాను.

"నువ్వు దేన్ని చూసి ఫలానా అమ్మాయిని ప్రేమించావ్?" అని నా మిత్రుడొకడు అడిగాడు, ఇంటర్వ్యూ జరుపుతున్న విలేఖరి ఫోజులో. "ఆమె ముక్కు బాగుందని" అని తడిమని జవాబిచ్చాను. ఒక్క ముక్కు కోసం ప్రేమించటం మహాపరాధం అన్నట్లు మొహం పెట్టాడు.

ఆమాటకొస్తే, నేను ప్రేమించిన పడతులందరూ అటువంటికోవకు చెందినవారే. దస్తూరీ బాగుందని ఒకమ్మాయినీ, క్లాసులో నిర్భయంగా ప్రవర్తించేదని ఇంకో అమ్మాయిని ఇష్టపడ్డాను చిన్నప్పుడు. కొద్దిగా పెరిగిన తరువాత, ముక్కు బాగుందనీ, నోరు అందంగా వున్నదనీ, కళ్ళు చక్కగా విశాలంగా ఉన్నాయనీ, జడ పెద్దదనీ ఇలా ఎన్నో కారణాలుకనబడి చాలమంది



ద్వితీయ బహుమతి [రూ. 25]

ఆర్. కాళిదాసు

[ఫోర్త్ బి. ఇ. మెకానికల్, ఇంజనీరింగ్ కాలేజ్, అనంతపురం]

అమ్మాయిలను ప్రేమించాను. కాలేజీ కల్చరల్ ప్రోగ్రాములో చక్కగా పాట పాడిందనీ, ఇంకొకమ్మాయి బొమ్మలు వేస్తుందనీ - ఇలా ఎంతోమందిని ఆరాధించాను - ఇటువంటివే నా ప్రేమ పురాణాలన్నీను.

చదువు పూర్తయి ఉద్యోగంలో చేరాక కూడా ప్రేమ నన్ను వదలలేదు. ఎందరో అమ్మాయిలు తారసపడ్డారు, నా హృదయాన్ని పట్టుకొని పోయారు.

ఈ ప్రేమ ప్రవాహంలో నేనెక్కడికి కొట్టుకుపోతానో నాకు తెలియదు. ప్రేమ కథలకు వివాహం ముగింపు అనేది నిజమైతే - నా కథను ముగించటానికి ఎవరు సిద్ధపడతారు ? – ఈ విషయాలను ఇంతకు ముందెప్పుడూ ఎక్కువగా ఆలోచించలేదు.

కానీ, వారం రోజులక్రితం మా మేనమామగారింటికి వెళ్ళడంతో నా ప్రేమ కథ హఠాత్తుగా ముగింపుకు వచ్చిందని తెలిసింది. నే నిన్ని రోజులూ, ప్రేమ ప్రేమ అంటూ దేని వెంబడి తిరిగానో, అది నిజమైన ప్రేమకాదనీ, ప్రేమకు మహత్తరమైన బరువు బాధ్యత లున్నాయని నాకు భానుమతిని చూస్తేనే గాని తెలియలేదు. భానుమతి మా మేనమామ కూతురు. బొద్దుగా చామనచాయగా ఉండే భానుమతి ప్రబంధ సుందరికాదు. ఆ మాటకొస్తే సుందరేకాదు

భానుమతి నన్ను అదోకరకంగా చూడటం మొదలు పెట్టింది. నేను వాళ్ళింటికి వచ్చి రెండు రోజులు కాకమునుపే, భానుమతి తనకు నా పట్ల ఉన్న ఆదరాభిమానాలతో నన్ను కట్టి పడేసింది. తేరుకోలేక పోయాను ఆ అనురాగ సముద్రం నుంచి. భానుమతి నా చుట్టూ నాకు తెలియకుండానే పెనవేసుకొని పోయింది. ఈ సత్యాన్ని నేను రెండు, మూడురోజులు ఆలస్యంగా కనుక్కొన్నాను. నేను ఇరవైమంది అమ్మాయిల వెంట తిరిగిన వచ్చి నిజం కూడా అమెని, ఆమె ప్రేమను ఏమీ చెయ్యలేక పోయింది.

ఇదివరలో "నువ్వు ఫలానా అమ్మాయిని ఎందుకు ప్రేమించావ్?" అని నన్ను అడిగితే, "ఫలానా గుణం" చూసి అని చెప్పేవాణ్ణి. కానీ, భానుమతి నాలో ఏ సుగుణం చూసి నన్ను ప్రేమించిందో నాకు అంతుపట్టలేదు. భానుమతిలో గల ఈ సుగుణాన్ని చూసే, తపీమని ఆమెని ప్రేమించటం మొదలుపెట్టాను.

□□□



1. గవర్న్‌మెంటాలిటీ:



గవర్న్ - అనగా పాలించు, లేదా శాసించు. తెలుగులో బుకాయించు. లేదా చెలాయించు. గవర్నమెంటు ఉద్యోగంలో చేరగానే అబ్బునది గవర్న్‌మెంటాలిటీ నాబడును. ఉదాహరణము; రైల్వేలో బుకింగాఫీసాయన, ఇంక్వయిరీలాయన, పోస్టాఫీసులో ఇచ్చుట తపాలాబిళ్ళ లమ్ముబడునాయన, తాలూ కాఫీసులో పర్మిట్లిచ్చునాయన.


ఈ మెంటాలిటీ తరచుగా ఇళ్ళలోకూడా కనిపిస్తూ వుంటుంది.




2. పోస్టుపోన్ మెంటాలిటీ:

(పోస్టల్ శాఖవారికి కూడా ఈ అభ్యాసం లేకపోలేదు. ఉత్తరాల కన్న టెలిగ్రాములు ఒకొక్కసారి

పెందరాళే చేరడానికి ఇదే కారణం) గవర్న్‌మెంటాలిటీలో ఇదొక శాఖ. ఈ శాఖీయులకు భవిష్యత్తుమీద విశ్వాసం జాస్తి. దీని సాంకేతిక పరిభాష: రేపు చూదాం, రేపు రాదాం, రేపు రావయ్యా...




దీన్ని మొదట కనిపెట్టి ప్రత విధానంగా మానవులకు ఉపదేశిం చింది పార్వతీ దేవి అని పౌరాణికుల మతం. వినాయకుడు తనపెళ్ళి చేయ వలసిందిగా అడిగినప్పుడల్లా తను గోడమీద రాసివుంచిన "రేపు" అనే మాటని పార్వతి చూపించేదట.




అయితే ఈ మధ్య చరిత్ర పరి శోధకులు చెప్పేదాన్నిబట్టి మద్రాసు ముఖ్య మంత్రిగా వుండే రోజుల్లో కామరాజుగారు ఈ మెంటాలిటీని మళ్ళీవాడుకలోకి తెచ్చారని తెలు స్తు ది."పార్కలాం"(చూద్దాం)అనేది ఆయన ఊతపదం.ఆయన కాంగ్రెసు అధ్యక్షులయ్యాక కాంగ్రెసు కూడా ఈ అభ్యాసం అలవరచుకుని చెయ్య దలచినవి, చేస్తానని చెప్పినవి అన్నీ వాయిదా వేయడం అలవాటు చేసు కుంది. (ఉదా: ప్రజలందరకు తిండి, బట్ట; భూసంస్కరణలు, సోషలిస్టు సమాజము వగైరా.) కాని కిట్టని వాళ్ళు ఈ వాయిదాకు అసలు కార ణం మరొకటి చెబుతారు. చెప్పిన వన్నీ చేసేస్తే, వచ్చే ఎన్నికలలో చెయ్యడానికి వాగ్దానాలు, ఇవ్వడా నికి స్లోగన్లు వుండ వనే బెంగతోనే కాంగ్రెసు ఈ మెంటాలిటీని అల వర్చుకున్నదట.

3. అడజస్ట్ మెంటాలిటీ:



అనగా సర్దుకుపోవుట. కార్లలో, రైళ్ళలో ఒంటికాలిమీద నించుని సర్దుకుపోవడం, ఇంట్లో శ్రీమతి ఉప్పులో పప్పు తక్కువ వేసినా, కారంలో కూర మరిది పోయినా సర్దుకు పోవడం ఒకడు కొన్న పేప రుతో పదిమంది సర్దుకోవడం,



పెరగని జీతంలోనే జీవితాన్ని సర్దుకు పోవడం, మంత్రి పదవి రాకపోయినా ఏ కమిటీ అధ్యక్ష పదవితోనో, గవర్నరు గిరి తోనో సర్దుకుపోవడం దీనికి ఉదాహ



రణలు, అసలు భారతీయ వేదాంతమే సర్దుకుపోవడంతో ప్రారంభ మవు తుంది సంస్కృతంలో దీన్నే "మన ఖర్మ"వాదం అంటారు.


ఇంకా చెప్పాలంటే, ప్రజా స్వామ్యంలో ప్రతి వాడికీ ఇది వెన్నతో పెట్టినవిద్య. ఇన్ కంటాక్సు అకౌంట్స్ వేసే వాళ్ళు నిత్యం చేసే తపస్సు. ఇండియాలో చాలా మంది ఒకపూట భోజనంతోనే అడ్జ స్టవుతున్నారు, ఒక గిట్టని వాడి (అనగా అపోజిషన్, పొలిటిషి యన్) అంచనా ప్రకారం చాల మంది రోజుకు పావలాతో సర్దుకుం టున్నారు. కొందరు నెలకు లక్షతో తంటాలుపడుతున్నారు.



4. డిపార్టు మెంటాలిటీ:

ఇదికూడా గవర్న మెంటాలిటీలో భాగమే ఒక పనిని ముక్కలుచేసి వేరు వేరు డిపార్టుమెంట్లుకు తలోటి పంచటం. పని జరగదు కనుక ప్రతి డిపార్టుమెంటు తప్పు తమదికాదు,

మరోదాన్ని అని తోసెయ్యడం దీని వల్ల సులభం అవుతుంది.



5. అడ్జర్న్ మెంటాలిటీ :

ఇదిన్నీ, అమెండ్ మెంటాలిటీన్నీ పార్లమెంటాలిటీలోకి వస్తాయి శాసనసభ్యులు ఈ ధోరణులు విధిగా అలవర్చుకుని వుండాలి.

6. స్టేట్ మెంటాలిటీ :


ఇది నాయకులందరికి వుండేదే. ఇదే లేకపోతే దినపత్రికలు నిండడం కష్టం. ఇది మరీ ఎక్కువగా వున్నవాళ్ళు మంత్రులైపోతారు.

ఇండియాలో ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి ఇది తగు మోతాదులో వుంటుంది. ప్రతి స్టేటూ మరొక




దానికన్న ఎక్కువగా బాగుపడిపోవాలని చూస్తుంది. దాంతో కేంద్ర ప్రభుత్వం పని ఇరకాటం అవుతుంది.


7. సంకోచ్ మెంటాలిటీ:



ఇంగ్లీషనుకునేరు. ఇందులో సగమ్మాట తెలుగే. కాపోతే మునిమాణిక్యం [హెర్మిట్ డైమండ్] గారు ఆరోపించినట్లు శబ్దాశ్రయహాస్యం. ఇంగ్లీషు, తెలుగు మాటల కలయికతో పుట్టినట్టి నవ్వు [నిజం?]



ఇది కలిగినవారు నిత్య శంకితులు. ఈ ధోరణికి ఉదాహరణ ఇదే తీసుకుందాం. వీరికి అన్నీ డౌటే హాలే. [శ. హా.] ఇందువల్ల నవ్వు వస్తోందా? వచ్చేది నవ్వేనా? ఒక వేళ నవ్వే అయితే, రాసింది తెలుగోసేనా? వాడికింగ్లీషొచ్చా? వస్తే చాలు, కాపీ కొట్టినట్టే. ఇది కాపీ జోకే [ఆనందం... హమ్మయ్య]



8. ఎన్లార్జ్ మెంటాలిటీ :


ఇది తెలుగువాళ్ళకి బాగా అలవాటు. పద్యాలు రాసే ప్రతివాడు మహాకవి. సినీవేషాలు వేసే ప్రతివాడూ మహానటుడు. ప్రతి మంత్రి దేశ సేవకుడు. కొంచెం పచ్చగా వున్న వాడు కాపిటలిస్టు. కాళిదాను తెలుగువాడే. మనవాళ్ళట్టి వెధ వాయిలోయ్.

'నేనేమిటి సార్! మా తమ్ముడు నన్ను మించిన జీనియస్.'


9. కంటెంట్ మెంటాలిటీ :

10. ఎంటర్ టెయిన్ మెంటాలిటీ :

ఈ రోజుల్లో సినిమాలన్నీ ఈ కోవకు చెందినవే. ట్రాజిడీల



విషాద సన్నివేశాల్లో కూడా నవ్వొచ్చేయడానికి ఇదే కారణం.




11. మేనేజ్ మెంటాలిటీ.

గుమస్తాలో ఇంకి మెంటాలిటీ అంకురిస్తోందని పసి గట్టిన యజమానిలో ఈ మేనేజ్ మెంటాలిటీ విజృంభిస్తుంది.

చెయ్యవలసింది చేస్తే ఎందుకు చేశావు? చెయ్యకపోతే ఎందుకు చెయ్యలేదు? చెయ్యగూడనిది చెయ్యకపోతే ఎందుకు చెయ్యలేదు. చేస్తే ఎందుకు చేశా... చెయ్యలే...

12. మింటాలిటీ :

మంత్రుల్లో, ప్రొహిబిషన్, పి. డబ్ల్యు. డి. రైల్వే మొదలైన శాఖలలో దొరుకుతుంది అని 'గిట్టని' వాళ్ళంటారు.



13. ఆర్గ్యు: మెంటాలిటీ :

దీన్ని తిరగేస్తే ఆగ్రి మెంటాలిటీ.

"ఎలాగైనా రష్యావాళ్ళున్నారే, సైన్సులో గొప్పవాళ్ళండీ."

"ఆ. ఏం గొప్పలెద్దురూ. అవన్నీ అమెరికానుంచి కొట్టేసినవే."

"అది నిజమే ననుకోండి."

"ఏమిటండీ నిజం. తెలియకడుగుతాను. అమెరికావాళ్ళు మాత్రం పోడిచేశారా ? జర్మనీనుంచి నేర్చుకున్నవేగా ఈ రాకెట్లు, యాటంబాంబులు..."

"అవును. అసలు అమెరికాలో సైంటిస్టులంతా జర్మనీవాళ్ళేనట."

"ఏడిశారు. జర్మనీవాళ్ళకి ఒరిజినాలిటీ ఎక్కడేడిసిందండీ. మన వేదాలన్నీ చదివి వాటిల్లోంచి కాపీ కొట్టేశారు."

"మరేమరే. మన వాళ్ళకి మన వేదాలని ఉపయోగించుకునే తెలివితేటలు కూడా లేకపోయాయి."

"తెలివితేట ల్లేకపోతే మనవాళ్లు వేదాలెలా రాశారండీ. మీ దంతా చాదస్తంగాని."

"మన పూర్వులు గొప్పవాళ్ళే ననుకోండి."

"ఏం గొప్పండీ. బోడి గొప్ప. వాళ్ళ మూలంగానే దేశ మిలా అఘోరిస్తోంది."

"... ..."


14. 'సెంట్' మెంటాలిటీ :

ఈ మధ్య రష్యావెళ్ళి కొత్తరకం సెంట్లు కొనుక్కొచ్చిన కేంద్రమంత్రి సత్యనారాయణ సిన్హాగారికే కాదు; ఈ మెంటాలిటీ మొత్తంపై ఇండియా ప్రభుత్వానికి వుంది. అమెరికానుంచి వీలైనన్ని 'సెంట్లు' సంపాయించాలని దాని తాపత్రయం.

15. ట్రీట్ మెంటాలిటీ:

ఇది డాక్టర్లకు బొత్తిగా సంబంధం లేని విషయం. సినీమా రచయితల్లో బాగా కనిపిస్తుంది. సినిమా కథలు ఎవరు పడితే వాళ్ళు రాయగలరు. వాటిని ట్రీట్ చెయ్యడానికే ప్రత్యేకమైన తెలివితేటలు కావాలి. అందుకే సినీరచయితల్లో వీళ్ళదొక విశిష్టస్థానం. సినీ కథలు రాసిన వారిలో వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, షేక్స్పియరు, గురజాడ, శరత్ మొదలైన వాళ్ళున్నారు వాళ్ళ కథల్ని సినీ రచయితలు ట్రీట్ చేసి వాళ్ళరోగం కుదర్చడా న్నే

ట్రీట్ మెంటాలిటీ అంటారు.



16. ఎక్స్‌పెరి మెంటాలిటీ:

ఇది గవర్న మెంటాలిటీలో ఇంకో భాగం. బ్లాకులనీ, సమితులనీ, సహకార సంఘాలనీ, రేషనింగ్ అనీ, కంట్రోళ్ళనీ, ప్రొహిబిషన్ అనీ గవర్నమెంట్లు రకరకాల పద్ధతులు ప్రజలమీద ఎక్స్‌పెరిమెంట్లు చేస్తూ వుంటాయి.


కొత్తగా కాపరానికొచ్చిన కోడళ్ళలో ఈ 'మెంటాలిటీ' అధికం ముఖ్యంగా వంటలపై వారి పరిశోధనలు జరుగుతూ వుంటాయి. హోటళ్ళకు గిరాకీ హెచ్చడానికి ఇదొక కారణం.

డాక్టర్లు రోగులపై శాంపిల్ మందులతో ఎక్స్‌పెరిమెంట్ చేయడానికి, ఒక్కోసారి మునిసిపాలిటీ నీళ్ళతో ఎటువంటి జ్వరానికైనా చికిత్స చేయడానికి ఈ మెంటాలిటీ తోడ్పడుతుంది. రోగులు ఒక్క జ్వరానికి అయిదారుగురు డాక్టర్లతో ఎక్స్‌పెరిమెంట్ చేయడానికి కూడా ఇదే కారణం.

తెలుగుసినిమాల్లో ఇది జాస్తిగా కనబడదు.

17. ఎంకరేజ్ మెంటాలిటీ.

ఈ మెంటాలిటీని ప్రజలలో ఎంకరేజ్ చేయడానికి ఎన్నికలప్పుడు నాయకులు చాలా శ్రమపడతారు. "నాకు మీ వోటు వేసి దేస్సేవకు నన్ను ఎంకరేజ్ చెయ్యండి" అని నిర్మొహమాటంగా అడిగేస్తారు. పత్రికల వారికి కూడా ఇది అలవాటే. వారి స్లోగన్ "మాకే మీ వోటు"



□□□

ప్రవాసి

భమిడిపాటి జగన్నాథరావు

శేఖరానికి పల్లెటూళ్ళంటే ఓ విధమైన అసహనంతో కూడిన ఏవగింపు. ఆ పల్లెటూళ్ళూ, ఆ వాతావరణం, ఆ కక్షలూ, స్పర్ధలూ, రచ్చబండ రాజకీయాలూ, శ్కాండల్స్—ఇవన్నీ అతని కెంతో వెగటు. తన సంస్కారం, చదువు వీటన్నిటికీ ఎత్తున, ఎంతో ఎత్తున వుందని అతని నమ్మకం

అందుకే అతనికి తల్లి మాటలు రుచించడం లేదు.

ఆఖరిసారిగా చెబుతూన్నట్టు ఆవిడ అంది: "నువ్వు ఈ విషయంలో ఇంత మూర్ఖంగా వుంటావని ఏనాడూ అనుకోలేదు. నువ్వు అమెరికానుండి తిరిగి వస్తున్నావని తెలిసిన ఈ రెణ్ణెళ్ళనుండీ కంట్లో వత్తులు వేసుకు చూస్తున్నట్టుగా వుంది. ఏడెనిమిదిసార్లు ఇప్పటికే కబురు పంపింది. పెద్దది—అమ్మమ్మని చూసివస్తే నీదేం పోతుందో నాకర్థమవడం లేదు."

"అంతలా నన్ను చూడాలని వుంటే ఆవిడే ఇక్కడికి ఓ సారి రాకూడదూ?" అతని మాటల్లో చిరాకు స్పష్టం.

"నువ్వలాంటి మాటలు మాట్లాడకు, ఎప్పుడైనా ఆ పల్లెటూరు వదిలి వచ్చిందా ఏవిటీ? చిన్నతనంలో దేవుడే అన్యాయం చేశాడు – ఈ రోజున నీలాంటివాళ్ళు ఇలా బాధపెడితే సహించక ఏం చేస్తుందిలే."

అతని తల్లి కళ్ళల్లో తడి. సెంటిమెంట్‌కు దూరంగా వుండాలని అతని ప్రయత్నం.

"అంతగా చెబుతోంది గదా! పోనీ వెళ్ళి అమ్మమ్మనో సారి చూసిరా" అన్నాడు తండ్రి ఆఖరికి.

ఆ మధ్యాహ్నం మృణాళినినుండి ఉత్తరం వచ్చింది. అతనెంతో ఆతురతతో అందుకున్నాడు నీలం కవరు. లేత నీలంరంగు కాగితం. అందమైన కాగితం. అందమైన అక్షరాలు. మృదువైన పలకరింపులు. ఎప్పుడు వస్తున్నావని ప్రశ్న. చప్పున రావాలి సుమా అన్న హెచ్చరికతో కూడిన ఆజ్ఞ. ఆఖరున వ్రాసింది 'నీకు మా బెంగాల్ అంతా చూపించాను. మీ ప్రాంతం విశేషాలన్నీ వచ్చినప్పుడు చెప్పాలి!"

ఆ ఉత్తరాన్ని అంటివున్న మృదు

వైన సెంటు వాసనలాగే అతని మనసంతా గాలిలో తేలి ఆడింది.

ఆ సాయంత్రం శేఖరం ఆ పల్లెటూరు వెళ్ళి అమ్మమ్మని చూడ్డానికి ఒప్పుకొన్నాడు.

"వచ్చే సోమవారం బయలుదేరి వస్తున్నానని అమ్మమ్మకు ఉత్తరం వ్రాయండి"

ఆ అమ్మమ్మ అతనికి స్వయానా అమ్మమ్మ కాదు. తల్లి పినతల్లి. శేఖరం చిన్నతనంలో, అతని తండ్రి ఉద్యోగరీత్యా, ఐదారు నెలలకో వూరు బదిలీ అవుతూంటే, ఆ అమ్మమ్మ దగ్గరవుండి చదువుకున్నాడు-ఎనిమిదవ క్లాసు దాకా. అతనక్కడ వున్నన్నాళ్ళూ ఆవిడ అతన్ని చాలా ముద్దుగా,మురిపెంగా చూసుకొంది. లాలనతో పెంచింది.

అతనికి తన చిన్నతనం; ఆ ఊళ్ళో చదువుకోడం అన్నీ సగం సగం జ్ఞప్తికి వస్తున్నాయి. ఊరి చెరువులో ఈతలుకొడుతూ స్నానం.విష్ణ్వాలయం లోని ధ్వజస్తంభం చుట్టూ తిరుగుతూ ఆటలూ, ఆలయంలో గన్నేరుపూలు ఏరడం, పూజారిపెట్టే ప్రసాదానికి చేతులు చాచడం, గుళ్లో గంటలు కొట్టడానికి ఆత్రం, మునసబుగారి తోటలో మామిడికాయలు దొంగతనంగా తినడం ... అన్నీ లీలగా గుర్తుకొస్తున్నాయి. ఆ చిన్నతనం ఆ పల్లెటూరు, ఆ వాతావరణం... అన్నీ గొప్పగా వుండేవి. అలా తను చిన్నతనంలో ఫీల్ అయినందుకు శేఖరానికి ఈనాడెందుకో చిన్నతన మనిపిస్తోంది.

శాస్త్రం, విజ్ఞానం పెరిగి, ప్రపంచమంతా అతివేగంగా మారిపోతున్న ఈ రోజుల్లో కూడా ఆ పల్లెటూళ్ళు ఎదగవనీ, ఎదగడానికి ప్రయత్నించవని అతనికి కోపం.

ఆ సోమవారం రైల్లో హాయిగా మొదటి తరగతి మెత్తలపై జారబడి అతడు మెత్తని మధురమైన ఊహలలోకి జారిపోయాడు ఈ పల్లెటూరి అనుభవం మృణాళినికి చెప్పాలి. వింతగా చూస్తుంది-ఆ పెద్ద కళ్ళతో. ఆమె వ్రాసిన ఉత్తరం తీసుకొన్నాడు. ఆ నీలం కాగితం, ముద్దొచ్చే ఆ అక్షరాలూ, ఆ కాగితాలు వెదజల్లే సన్నని, హాయైన పరిమళం అతన్ని ఏదో లోకాలలోకి తీసుకుపోతోంది.

ఆ సెంటే మృణాళిని వాడుతుంది. ఏ సెంటు అంటే చెప్పదు. పైగా తన వళ్ళే సెంటుట ... ఎంత కొంటెగా రాసిందీ ఆ మాటలని ...

అతనికి మెలుకువ వచ్చే సరికి నాలుగైంది. నాలుగున్నరకు అతను దిగే స్టేషను వచ్చింది.ఆ చలిగాలిలో అతను ఆ స్టేషనులో చాలా చిరాకుగా దిగేడు.

ఈ చీకట్లో చలిగాలిలో ఇంకా ఆరుమైళ్ళు పోవాలి ఎలాగో?

అతనికి చాలా చిరాకుగా వుంది.

అందుకే ఈ పల్లెటూళ్ళ ప్రయాణమంటే అతని కంత మంట.

'బండి తెచ్చేనుబాబూ! ఎల్దా రేటి?'

చూసేడు. ముసలితనం గూడు కట్టిన ముఖం.


"నాను సుబ్బన్నని బాబూ! మర్చిపోనా రేటి? అమ్మమ్మగోరు మీరొత్తున్నారని బండంపారు"

ఎలా వెళ్ళాలా అని మథనపడుతున్న శేఖరానికి ఆ మాట హాయిగా వినిపించింది.

బండిలో సామానుపెట్టి, అతను ఎక్కాక బండి కదిలించాడు సుబ్బన్న. ఊరు దాటాక చలి ఎక్కువైంది. శేఖరానికి వణుకు లాటిది వచ్చింది.

"చలేత్తే ఆ రగ్గు కప్పుకోండి బాబూ! అమ్మమ్మగోరు ఇచ్చారు. ఆ మూల చాప కింద ఎట్టాను. మీకు సుఖంగా వుంటానికి బండిలో పరుపు కూడా ఏయించినారు అమ్మమ్మగోరు మీ కోసం మహా చూత్తుండారు లెండి, మీరొత్తున్నారని పెళ్ళంత అడావిడి సేత్తున్నారు" అన్నాడు సుబ్బన్న.

రగ్గు కప్పుకొన్నాడు. వెచ్చగా వుంది. బండి గతుకుల బాటమీద పోతోంది అతనికి మళ్ళా చిరాకు కలిగింది సుబ్బన్న మధ్యమధ్య ఎద్దుల్ని అదలిస్తూ, చిన్నగా ఏదో పాట పాడుతున్నాడు. ఎద్దుల మెళ్ళో మువ్వల చప్పుడు వింతగా వుంది. నక్షత్రాలు ఆకసంనిండా పువ్వులు పరుచుకొన్నట్టుగా వున్నాయి అవి



ఒక్కొక్కటి కరిగిపోతున్నాయి. క్రమంగా తూరుపున తెల్లబడుతోంది. అతనికి పైకి చెప్పుకోడానికి ఇష్టంలేకపోయినా ఆ వాతావరణం, ఎద్దుల మెళ్ళో మువ్వల శబ్దాలూ, ఆకాశంలో అయాచితంగా లభించిన అమృత దృశ్యం అతనికి చాలా మనోహరంగా వుంది. సూర్యోదయ సమయం ఇంత ఆహ్లాదంగా వుంటుందా అనిపించింది—ఈ మధ్య ఎన్నడూ, ఆ అనుభవం లేని శేఖరానికి. నెమ్మదిగా అతడు పరుపు మీద వాలాడు. వెచ్చగా, వళ్ళంతా రగ్గు కప్పుకొన్నాడు. మగతగా ఆకసంలో మార్పుల్ని వింతగా, అప్రతిభుడై చూస్తున్నాడు. అతనికి నిద్ర పట్టింది. మెలుకువ వచ్చేటప్పటికి ఇంటిముందు బండి ఆగివుంది. ఒద్దికంగా లేచి బండి దిగాడు. ఎదురింటివాళ్ళు 'అతన్నే గుచ్చి, గుచ్చి చూస్తున్నారు.

ఇంట్లోకి వెళ్ళాడు. 'కాఫీ'కోసం మారాం చేస్తోంది ప్రాణం. అది తాగితేకాని అతనికి పనులేవీ జరగవు. ముఖం కడుక్కోడానికి వేడి నీళ్ళందించి "అమ్మమ్మగారు పూజలో వుండారు" అన్నాడు సుబ్బన్న. ముఖం కడుక్కొన్నాడు.

"కాఫీలాటి దేదైనా దొరుకుతుందా ఈ ఇంట్లో?" అన్నాడు.

"అదేటంకోయ్! మీ రొత్తున్నారని పట్నంనించి పెసల్ కాఫీ పొడరు తెప్పిస్తే అమ్మమ్మగారు" ఫ్లాస్కువంచి కప్పులో అందించాడు.

'ఇది ఎంతఘోరంగావుంటుందో'. అనుకుంటూ తాగేడు. ఒక్క 'సిప్' తోనే అతనికి ఆశ్చర్యం కలిగింది' చాలా బావుంది కాఫీ. రెండో కప్పు పోసుకుతాగేడు. ఆ తర్వాత అతనికి కాస్త ప్రాణం వచ్చినట్టు అనిపించింది. చాలా ఉత్సాహంగా చుట్టూ చూశాడు. ఈసారి మరీ ఆశ్చర్యపోయాడు.

ఆ గది అలంకరణ, చాలా 'నీట్'గా వుంది.

"మీ రొత్తున్నారని కరణం గోరింటినించి రేడియో తెప్పించారు. చదువుకోనానికి పట్నంలో సదూతూన్న ఎంకట్రాజుగారి చిన్నబ్బాయిగోరి పుస్తకాలు తెప్పించారు. ఆ ఫ్లాస్కు, కుర్చీలు పట్నంనుండి నానే కొని తెచ్చినా" అన్నాడు సుబ్బన్న.

ఎదురుగుండావున్న గదిగుమ్మానికి గాజు పూసలతో కూర్చిన జాలరి వుంది. రకరకాల పూసలు-చాలా బావున్నాయి. ఆ గదదగ్గరకొచ్చి ఆ జాలరి ముట్టుకొన్నాడు. పూసలన్నీ కదిలాయి - కదుల్తూ చిన్న, చిన్న శబ్దాలు. ఎండపొడపడి గాజు పూసలు మెరుస్తున్నాయి.

ఇంతలో అతని అమ్మమ్మవచ్చింది. అతన్ని చూడగానే బిళ్ళల్లాంటి ఆ కళ్ళు గర్వంగ వెలిగాయి.

"వచ్చావా బాబూ!"

మంచి కాఫీ తాగిన ఉత్సాహం అతన్నింకా వదల్లేదు.

"ఇంత బాగా కాఫీ చేయడం ఎప్పుడు నేర్చుకొన్నావ్ అమ్మమ్మా?" అన్నాడు, సిగరెట్ వెలిగిస్తూ.

"నాకేం వచ్చురా బాబూ! మన సావిత్రి కాచింది" అంది ఆవిడ.

"అలాగా!"

మధ్యాహ్నం భోజనం చేస్తూండగా అడిగింది ఆవిడ "నువ్వు ఏదో విదేశాలకు వెళ్ళావుగదా—ఎక్కడకు బాబూ"

"స్టేట్స్, వెళ్ళానమ్మమ్మా"

"మరి మన సావిత్రి నువ్వు అమెరికా వెళ్లావంటుం దేవిటీ? దానికి మాత్ర మేం తెలుసులే"

అతను నవ్వుకున్నాడు.

భోజనం చేసి గదిలోకి వస్తుంటే ఆ గది పక్క గుమ్మం నుండి ఎవరిదో చీరకొంగు మాయమవడం చూశాడు. గదిలో ఆకులు, వక్క పొడి సిద్ధంగా వున్నాయి. తాంబూలం వేసుకున్నాడు. ఈల వేసుకుంటూ అద్దంలో చూసుకున్నాడు. పరుపుమీద పాల నురగలాటి తెల్లని దుప్పటి ఆహ్వానిస్తోంది. దిండుగలేబు మూలలో కుట్టిన కుందేలు బావుంది. అతను నిద్రపోయాడు.

లేచేటప్పటికి సాయంత్రమయింది. కాఫీతాగి, పెరట్లోకి వెళ్ళాడు. తులసికోట గుబురుగా పెరిగింది. తులసికోటకు నీళ్ళు పోస్తున్న బలమైన, వయసులో వున్న చేతులు. మొహం సరిగా కనబడలేదు. చీరకొంగు దోపుకోడం వల్ల పచ్చగా, బలంగా కనిపిస్తూన్న పాదాల పై భాగం. అతనికి మృణాళిని సున్నితమైన చేతులు, ఆ చీకటి రాత్రి తన మెడ చుట్టూ పెనవేసుకున్న ఆ చేతులు, ఉద్రేకంతో మెరిసే ఆ కళ్ళూ, ఎగురించిన చెక్కిళ్ళూ, ఆ ఎర్రటి పండులాటి పెదాలపై తన పెదాలు... జ్ఞాపకం వస్తున్నాయి.

"వెళ్ళాలి ... వెంటనే కలకత్తా వెళ్ళిపోవాలి. ఆ సున్నిత మయిన చేతుల బిగిలో వుండిపోవాలి. తల్లీ, తండ్రి, అమ్మమ్మ వీళ్ళంతా 'అనాడీ' లు, తన విజ్ఞానానికి, శాస్త్ర పరిజ్ఞానానికి పదును పెట్టి మానవ

- *ఒక కొత్త రచయిత షాని తన నాటకం విని ఎలావుందో చెప్పమని వంపుకతిన్నాడు. షా సరే నన్నాడు. మొదటి అంకం పూర్తయి రెండో అంకం మొదలుపెడుతుండగా షా నిద్రఆపుకోలేక కళ్ళుమూని గుర్రుపెడుతున్నాడు. రచయిత షాని లేపి "అభిప్రాయం చెప్పమంటే వినకుండా నిద్రపోతున్నారే" మన్నాడు.*

  "నిద్రపోవడమే నా అభిప్రాయం" అన్నాడు షా.

జాతి అభ్యుదయానికి బాటలు వేయాలి.

తులసి కోటకు నీళ్ళు పోస్తున్న ఆమె అటు పక్కగా వెళ్ళిపోయింది. కుతూహలం కలిగింది.

'ఇంట్లోకి వెళ్ళి 'తులసి కోటకు నీళ్ళు పోస్తున్న దెవరమ్మమ్మా?' అన్నాడు.

'అప్పుడే మర్చిపోయా వటరా! మన సావిత్రి- చిన్నప్పుడు నీతో ఈ ఊళ్ళో ఆడుకున్న పిల్ల. మన స్వామి గారి అమ్మాయి...'

సావిత్రి ... సావిత్రి ... అతనికి ఓ రూపం మసగ్గా జ్ఞప్తిలోకి వస్తోంది... వచ్చేసింది.

ఆ రూపం ఆకారం స్పష్టమవ గానే అతని ఊపిరి జ్వరం వచ్చిన వాళ్ళా అయిపోయింది. అతని దేహ మంతా మంటలు లేచాయి. బల హీనుడి కోపంలాటి కోపం అతనిలో రగులుతోంది.

'ఇక్క డెందుకుంది?' అతని గొంతులోని కర్కశానికి అవిడ తలెత్తి ఖంగారుగా చూసింది.

'ఇంకెక్కడుంటుందిరా! పెళ్లా అవలేదు, వాళ్ళ నాన్న పెద్ద కట్నాలా ఇవ్వలేడు. నువ్వు వస్తున్నావని, పక్కిల్లే గదా అని నేనే సాయంత్రం రమ్మన్నాను. ఇల్లంతా సద్ది, వంటంతా చేసి... అంతా అదే చేస్తోంది. ముసిలిదాన్ని నేనేం చెయ్యగలను?'

అతన్ని ఎందుకో చేతగాని, చేవ లేని అసహనం చుట్టు ముడుతోంది. అక్కడ నిలవలేక గది దగ్గరకొచ్చి గాజు పూసల జాలరి కదిలిస్తూ, ఆలోచన మళ్ళిద్దామని ఎంతో ప్రయత్నించాడు.

అయినా చిన్నప్పుడు తనతో ఆడి, కవ్వించి, గంతులు వేసిన సావిత్రి రూపం కళ్ళముందు రూపు కట్టింది. ఆ రూపంతో అతనికి చిక్కు లేదు. ఆ చిన్నప్పటి సావిత్రి పెరిగింది ... వయసుతో లావణ్యాన్ని తెచ్చుకొంది. ఓణీ వేసుకొని, పెద్ద కళ్ళతో, తనని కవ్వించిన ఆమోటు పెదాల సావిత్రి ... ... ఆ రూపం మాత్రం అతన్ని ఇరుకున పెట్టి, చిరాకు పెడుతోంది. ఏ మూలో అణిచివేసిన, మరిచిపోయిన, ఉపయోగంలేని చిన్నతనపు చేష్ట... అది జ్ఞప్తికొచ్చి అతని వంట్లో సెగలు రేగుతోంది.

...చాలా కాలానికి, ఆనర్స్ చదివే రోజుల్లో, వేసవి సెలవుల్లో, మళ్ళా ఆ ఊరు వచ్చాడు. ఓణీ బిగించి, సిగ్గుపడుతూ, పట్నవాసపు అలవాట్లని రంగరించుకున్న అతనిని సావిత్రి చూసింది.

రమ్మంటే దగరకు వచ్చింది.

'మర్చిపోయావా?' అన్నాడు.

'లే' దన్నట్టు తల ఆడించింది, చెవి రింగులు గమ్మత్తుగా ఊగాయి.

'అంత భయమెందుకు?' అన్నాడు.

పెద్ద కళ్ళతో చూసి, తల దించు కొంది.

'అంత సిగ్గెందుకు?'

ఆమె బుగ్గలలో లోతుగా పడిన సొట్టలు అతన్ని నిలవనివ్వలేదు. చామన చాయరంగులో మెరుస్తూ, వళ్ళంతా తళుకు అద్దినట్టుగా ఉంది ఆమె. వయసులో ఉన్న ఆ పిల్ల తనకళ్ళకి 'ఆమె'గా కనబడింది.


అక్కడున్నన్నిరోజులు ఆమెను మచ్చిక చేసుకుందామని ప్రయత్నించేడు. ఉండేరోజులు పొడిగించాడు.

మళ్ళా వేసవి సెలవులకు పరిగెత్తుకు వచ్చాడు. ఈసారి ఆమె అతని కళ్ళకి మరీ వింతగా కనిపించింది. చీర కట్టింది ... చీరలో మెరిసింది. ఆ కళ్ళని తాకాలని, ఆ చెక్కిళ్ళను నిమరాలనీ అతనికి వుంది.

ఆమె దూరంగా కూర్చునేది. విహ్వలత్వంతో అతని కబుర్లు వినేది.

రెండు రోజుల్లో అతను వెళ్ళి పోవాలి. ఆ చల్లని సాయంత్రం ఆమె తలంటి పోసుకుని, చల్లని వెన్నెలలా వచ్చింది. దగ్గరకు చేరాడు. కోరికతో ఊగిపోయాడు.

కళ్ళని పొగిడాడు — కళ్ళని తాకాడు. చెక్కిళ్ళు గులాబీ రంగులో మెరుస్తున్నాయన్నాడు...





చెక్కిళ్ళు నిమిరేడు — ఆమె బెదిరినట్టుగా దూరంగా వెళ్ళింది.

ఆమె దూరమైనకొద్దీ అతనికి ఆవేశం పెరిగింది. దగ్గరకు వచ్చాడు. ఆమె అధరాలు అదురుతున్నాయ్. మోటుగా కదిలే ఆ పెదాల్ని తన నోటితో మూసివేసేడు. ఆమెను తనలో ఇముడ్చుకొన్నాడు. ఆమె వింతగా వణికింది. ఉన్నట్టుండి తప్పించుకొంది.

'తప్పు కాదా? నువ్విలా... నేనెప్పుడూ అనుకోలేదు' ఆమె కళ్ళల్లో నీళ్ళు.

తనని అర్థం చేసుకోలేదని చిన్నబుచ్చుకున్నాడు. అతనిలో ఆవేశం లాంటిది పెరిగింది.

'ప్రస్తుతం తప్పేనేమో! కాని... కాని... నిన్ను పెళ్ళి చేసుకుంటూను. ఈ సంవత్సరంతో చదువయిపోతుంది—' అంటూన్న అతని చేతుల్లోంచి తప్పించుకొని హంసలా గాలిలో తేలిపోతూ పారిపోయింది. అతను వెళ్ళేరోజున ఆమె ఒక్క మాట మాట్లాడకపోయినా, ఆ పెద్ద కళ్ళల్లో ఎన్నో భావాలు నింపుకుంది.

వైజాగ్ వెళ్ళి ఉత్తరం వ్రాశాడు. 'ఫస్టుక్లాసులో ఫస్టున ప్యాసయ్యాను. నాన్నగారితో చెబుతాను — ఆయన నా కోరిక కాదనరు. త్వరలో ముహూర్తం - ఆ తర్వాత ఎలా పారిపోతావో చూస్తాను. జవాబు రాయాలి!'

అతనికి ఆమె జాబు వ్రాయలేదు. వ్రాసినా అతనికి అందిఉండేదికాదు. ఆ తరువాత అతను పైచదువులకు అమెరికా వెళ్ళాడు. ఏడేళ్ళు ఉన్నాడు. తన 'సబ్జెక్ట్'లో నిధి అనిపించుకొన్నాడు. ఈ ఏడేళ్ళ కాలంలో ఎన్ని అనుభవాలు? ఎందరో యువతులు, ఎన్నో రకాలు అన్నీ చవిచూశాడు. మనిషే మారిపోయాడు. తన విభాగంలోనే 'రిసెర్చ్' చేస్తున్న మృణాళినితో మూడేళ్ళ క్రితం పరిచయం.

గతం మరుగున పడింది.

ఆ గతమంతా ఈనాడు కళ్ళ ముందు నాట్యమాడుతోంది. అసహనం చెలరేగింది.

ఆ ఉత్తరం ఆమె దగ్గరే వుంది... బ్లాక్ మెయిల్—నో, నో — అటువంటివి వీళ్ళకు తెలీదు. అమ్మమ్మకు ఈ సహాయ మెందుకు? ఇన్నాళ్లూ ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?

● ఒక మతిమరుపాయన తన వీధి తలుపుకి పెంపుడు పిల్లి రావడానికి, పోవడానికి ఇబ్బంది లేకుండా వుండడానికి పెద్ద రంధ్రం ఒకటి వేశాడు. దాని పక్కనే వుంకో చిన్నసైజు రంధ్రం కూడా వేశాడు పిల్లి తాలూకు పిల్లకి.

ఆమెతు పెళ్ళి కాతపోడం తన తప్పేంకాదు.

కోపంతో ఊగిపోయాడు.

గాజు పూసలతో గుమ్మానికి కట్టిన జాలరి అతని ఊపుకి ఊడి కింద పడింది.

చప్పుడుకు అతని అమ్మమ్మ వచ్చింది. తెగికిందికి జారిన జాలరి, విసురుగా వీథిలోకి పోతున్న మన వడూ కనిపించారు. ఆమె తెల్లబోయింది. సావిత్రి వచ్చి తెగిన జాలరి సద్ది, విరిగిన పూసల్ని ఏరింది.

"గుమ్మానికి మళ్ళా కట్టావే సావిత్రీ" అంది ఆవిడ.

"పూర్తిగా తెగిపోయింది బామ్మగారూ – ఇక నిలబడదు" అనేసి సావిత్రి పెరటిలోనికి వెళ్ళిపోయింది.

శేఖరం ఊళ్ళోకి వెళ్ళాడు. తెగ తిరిగేడు. ఊళ్లో తెలిసిన వ్యక్తులు పలకరించి ప్రశ్నలు వేశారు.

"ఏదో దేశ మెళ్ళావటగా? దొరసాన్ని చేసుకుంటావనుకున్నాం, లేదా? నేవిల్స్ చూశారా? బ్రహ్మచారి ముదరకూడదయ్యోయ్ పంతులూ!"

వాళ్ళ మాటలు అతనిమీద అగ్గిమీద గుగ్గిలంలా పనిచేశాయి. బాగా చీకటిపడ్డాక తిరిగి వచ్చాడు.

"అన్నం తినుబాబూ" అని ముసలావిడ వడ్డించింది. అన్నం తింటూ "మా సావిత్రి వెళ్ళిపోయిందా?" అన్నాడు.

"బాగా పొద్దోయింది కదూ – వాళ్ళమ్మ పిలిచిందని వెళ్ళింది. మర్చిపోయాను–మన సావిత్రి నాన్నగారు స్వామిగారు వచ్చారు ఇందాక"

"ఎందుకు? వాళ్ళ సావిత్రికి నన్ను సంబంధం వెతకమంటాడా?"

"అనలేదు గాని–వెతికితే తప్పేం కాదు. ఊరికే వచ్చాడు – నిన్ను చూద్దామని. పక్కింటివాడు, మంచివాడు. నీకు చిన్నతనంలో పాఠం చెప్పిన పంతులుగారు కదా – నువ్వు ఎన్నో దేశాలు తిరిగి, పరీక్ష అయి, ఇంతవాడివయ్యావని విని, చూసి సంతోషిద్దామని వచ్చాడు. రేపో మాటు వాళ్ళింటికి వెళ్ళు"

అతనికి వెళ్ళాలనే వుంది. వెళ్ళి ఆ సావిత్రిని గాయపరచాలనీ ఉంది.

మర్రోజు తమ ఇంట్లో సావిత్రిని పలకరిద్దామని చూశాడు. ఆమె తప్పించుకు తిరిగి ఇంటికి వెళ్ళిపోయింది. అతని కింకా మండిపోయింది.

ఆ సాయంత్రం స్వామిగారింటికి వెళ్ళేడు. వీధి గదిలో లైటు చిమ్నీ తుడుస్తోంది స్వామిగారి భార్య. అతనిని చూసి, కంటి మీద చేయాన్చి పరీక్షగా చూసి, గుర్తుపట్టింది.

"కూర్చోబాబూ" అంది లేచి నిలబడి.

అక్కడున్న ఒక చేయి విరిగిన కుర్చీలో కూర్చున్నాడు.

"మాష్టారు లేరాండీ?"

"లేరు బాబూ! ఊరెళ్ళారు. రేపు వస్తారు."

అతని తండ్రి, తల్లీ, అక్కయ్యల కుశల మడుగుతోంది. అతను పరాక్యాన్నంగా సమాధానాలు చెబుతూ, సావిత్రికోసం వెతికాడు.

"కాఫీ తెస్తా"నంటూ ఆవిడ ఇంట్లోకి వెళ్ళింది.

ఆ సంజె చీకట్లో నే సావిత్రి కాఫీ గ్లాసు తెచ్చి అందించింది. సావిత్రిని చూడాలని అతనికి మహా ఇదిగా వుంది.

"అతన్ని చీకట్లో కూచో పెట్టావా? సంజె వేళ. నాకివతల చేయి తీరికలేదు. హాల్లో దీపంపెట్టు సావిత్రీ?" వాళ్ళ అమ్మగారు వంటింట్లోంచి కేకేసింది.

సావిత్రి దీపం తీసుకొచ్చింది. గదిమధ్య వేళ్ళాడుతూన్న తీగకు తగిలించింది. ఆ లైటు వెలుతురుకు రాజుకున్న నిప్పులాగ ఆమె వదనం గప్పున వెలిగింది. చెంప, సగం వళ్ళూ కనబడుతున్నాయి. పక్కకే తిరిగి వుంది

"నన్ను మర్చిపోయావా?" అన్నాడు.

"కాఫీ తాగండి" అంది ఆమె ఇటు తిరిగి.

కాఫీ తాగుతూ ఆమెను చూస్తున్నాడు. పెద్ద కళ్ళు, మోటు పెదాలు, వాలుజడ, సగం మాసిన చీర, వదులుగా జాకెట్టు, చెంపన



మని - మృణాళిని 'బ్యూటీ స్పాట్' గుర్తుకొచ్చింది.

'నన్ను మరిచిపోయావా అన్నాను?'

లోపలికి వెళ్ళబోతున్నదల్లా ఆగి, వెనక్కి తిరిగి "నాన్నగారు ఊరు వెళ్ళారు" అంది.

"అంటే నన్ను వెళ్ళమనా అర్థం" కోపంతో ఊగిపోయాడు.

"ఎంతమాట! మీరు మా ఇంటికి రావడమే గొప్ప. మీ లాంటివారిని సరిగా ఆదరించడమైనా చేయలేని వాళ్ళం—వెళ్ళమని చెప్పగలమా?"

"మాటలు చాలా నేర్చావే"

"మాటలు కాదు. ఉన్న నిజం అన్నాను. మీకు తెలిసిన నాన్నగారు ఊరు వెళ్ళారు. తెలిసిన అమ్మ మా ట్లాడి వంటింట్లోకి వెళ్ళింది. ఆమెకు ఓ గంటదాకా ఆ పని తెమలదు. ఇక ఈ సావిత్రి ఎవరో బామ్మగారు గుర్తు చేస్తేగాని గుర్తుకు వచ్చేది కాదుగదా!"

"నువ్వు చాలా మారిపోయావ్- ఎలా గుర్తుపట్టగలను? పెద్దదానవయిపోయావుగదా"

"అవును! చాలా పెద్దదాన్నయిపోయాను."

"మీ నాన్నగారు ఎక్కడికి వెళ్లారేవిటి?"

"మీరు అన్నీ తెలిసిన వారు. వయసువచ్చి, వయసు మీరిపోతూన్న ఆడపిల్ల ఇంట్లోఉండగా ఏ తండ్రయినా ఎండలో, అరిగిన చెప్పులు, బుజాన మాసిన తుండువా వేసుకుని ఎందుకు ప్రయాణమవుతారో మీకు తెలియదా?"

అర్థమయినా ఆమె నోటి మీదుగానే సంగతి చెప్పించి హేళన చేయాలని ఉంది అతనికి.

"మీ పల్లెటూరు మాటలు నాకర్థమవవ్. ఎందుకు వెళ్ళారో ఈ పాత స్నేహితుడికి కొంచెం చెబుదూ"

"మా నాన్నగారికో పిల్లవుంది. ఇరవై నాలుగు సంవత్సరాలు వచ్చేశాయి. ఊళ్ళో వాళ్ళు పెళ్ళి చేయలేదని కాకులు పొడిచినట్టు పొడుస్తున్నారు. ఆ అమ్మాయి బావుంటుందని ఊళ్ళో వాళ్ళందరూ అనుకుంటారు. ఏనాడో ఆ మాట ఆ అమ్మాయికే చెప్పి నమ్మించినవారూ వున్నారు. ఆ అమ్మాయికి పెళ్లి సంబంధం చూడటానికి వెళ్ళారు."

"మరి ఇన్నాళ్ళూ ఆ అమ్మాయికి పెళ్లెందుకు కాలేదు?"

"మీరు బాగా చదువుకొన్నవారు. సంస్కారం వున్నవారు. విదేశాలకు కూడా వెళ్ళి విజ్ఞానధనాన్ని పుష్కలంగా సంతరించుకొన్నారు. ప్రజ్ఞా పారమితులు— కనుక మిమ్మల్ని అడుగుతున్నాను— ఆ అమ్మాయికి కూడా ఆ సంగతే తెలీడంలేదు. కాస్త కారణం ఊహించి చెప్పరూ?"

అతనికి మళ్ళా కోపం ముంచుకు వచ్చింది.

తన చదువునూ, సంస్కారాన్ని ఎద్దేవా చేస్తోంది. దాగుడుమూతలనవసరం. తిన్నగానే 'ఎటాక్' చేయాలి.

"నీలో అన్ని లోపాలే, చదువు లేదు. ఈ రోజుల్లో నీలాంటిదాన్ని ఎవరు చేసుకుంటారు?"

"నేర్పిస్తే ఆడది నేర్వలేని విద్య లేదనిగా సూక్తి"

"కావ్యాలు చదివావా? ఆ పాత చింతకాయ పచ్చడి ఎవడికి నచ్చుతుంది."


"అయ్యో! ఒక్క కావ్యాలనేవిటి. మీ రన్నట్టుగానే ఏడేళ్ళ క్రితం ఓ పెళ్ళికొడుకు వచ్చి చూసి చదువు లేదన్నాడు. ఆ లోటు భర్తీచేయడానికి నాన్నగారు ఇంగ్లీషు నేర్పించారు. ఒకాయన హిందీ వచ్చా అన్నాడు. హిందీ విశారద ప్యాసయాను. ఒకాయన సంస్కృతం వచ్చా అన్నాడు.సంగీతం, చదువూ, ఇంగ్లీషు చదువు, సినిమాపాటలు, అత్తగారికి అధ్యాత్మ రామాయణ కీర్తనలూ అన్నీ నేర్పించారు. ఒకాయన డాన్స్ వచ్చా అన్నాడు. ఈ వయసులో గెంతడం బావుండదని వూరుకొన్నాను.ఏదో మీ దయవల్ల, డాన్స్ తప్ప, అన్నీ వచ్చాయ్"

"చదువు నేర్చినా సంస్కారం ఉండద్దూ? ప్రపంచం ఇంత వేగంగా మారిపోతోంటే, ఈ పల్లెటూరిలో కూపస్థమండూకంలాగ..."

"మీరు పాపం చాలా కాలంగా దేశంలో లేరు. మీకు తెలీదేమో ఈ పల్లెటూళ్ళన్నిటికీ రేడియోలు, పత్రికలూ, గ్రంథాలయాలు - అన్నీ వచ్చేయి. మా ఊళ్లో కొనుకు వెళ్ళి నెలకి ఇరవైనాలుగుసినిమాలుచూసే వాళ్ళూ, ముప్ఫయిదాకా ఎమ్. ఎ. ప్యాసయినవాళ్ళూ వున్నారు. ఐనా ఏ సంస్కారమైనా ముద్దుతో నేర్పితే, నేర్చుకుంటే అలవడదంటారా? విజ్ఞానులు కనుక అడుగుతున్నాను."

అతనికి మాటల్లో ఓడిపోతున్నానని తెలిసింది.

ముసలావిడ	: మద్రాసు వెళ్ళబండి ఏ ప్లాట్ ఫామ్ మీద నాయనా ఆగేది.
కూలి	: ఎడంవైపుకి తిరగండి, సరిగ్గా కుడివైపు నుంటుంది.
ముసలి	: ఏమిటోయ్, మరీ బడాయి, ఆ చెప్పేదేదో సరిగ్గా చెప్పు.
కూలి	: అయితే సరే, మీ కుడివైపుకి తిరగండి, సరిగ్గా ఎడంవైపు నుంటుంది.



ఆమె బలహీనతలమీంద దాడి చేయాలి.

'నీ కనులు అందంగా కనబడ్డం కూడా చేతకాదు. ఆ వదులు జాకెట్టు, ఆ మాసిన చీరా, ఆ జడా అలా వుంటే ఏ పెళ్ళి కొడుకూ మెచ్చడు, కోరడు'


'అయ్యో! మీరు పెళ్ళి చూపుల కొచ్చారని తెలీలేదు మా కుటుంబ హితైషిగా వచ్చి కుశలమడుగుతున్నారనుకున్నాను. పెళ్ళి కొడుకుగా 'చూపుల' కొచ్చారని తెలిస్తే... ఒక్క ఐదు నిముషాలు ఆగరూ?—మా అమ్మ పెద్ద చీర, మా అమ్మకున్న ఆ ఒక్క బంగారు గొలుసూ, చెవులమీదికి జుట్టూ, నుదుటు ముంగురులూ ... ఒక్క ఐదు నిముషాల్లో 'రెడీ' అయిపోతాను. అలవాటు మూలాన ప్రాక్టీస్ ఉంది. ఏమంటారా?'

అతనిలో సెగలు రేగాయి.

టాపిక్ మార్చాలి.

'మీ నాన్నగారు వెళ్ళిన పెళ్ళి కొడు కెవరేవిటి? అన్నాడు.

'ఈ ఏడేళ్ళబట్టీ నలభై ముగ్గురు యువకులు చూశారు నన్ను. వారందరికీ ఏదో ఒక వంక దొరికింది. ఆ వంకల వెనక వాళ్ళ మనసుల్లో పాపం ఎన్ని ఆశలు, ఆశయాలు ... మోటార్ సైకిళ్ళు, రోలెక్స్ వాచీలు, పార్కర్ పెన్నులు, టెర్లిన్ సూట్లూ చాలా వున్నాయి ఆ అసలు నిజాలు మా నాన్నగారికి మొన్నటివరకూ తెలిసి రాలేదు. తెలియక ఏదో తంటాలు



పడ్డారు. నిజం తెలిసి తొక్కవలసిన బాట తొక్కారు. ఇక్కడికి ఇరవై రెండు మైళ్ళ దూరంలో ఓ ఏభై నాలుగేళ్ళ పెళ్ళికొడుకు వున్నారట. వారికి ఈ మధ్యనే భార్యా వియోగమైంది. ఐదారుగురు పిల్లలు. వాళ్ళని సాకడానికి ఓ మనిషి కావలసి వచ్చింది. ఆ మనిషిని భార్యగానే తెచ్చుకోమని హితులు పట్టుపడితే, పాపం వారు చాలా అయిష్టంగానే ఒప్పుకొన్నారుట. అయన్ని చూసి, పిల్ల పెళ్ళి స్థిరపరుచుకు వద్దామని వెళ్ళారు"

ఆ మాటలు వినగానే అతని సంస్కారమంతా పైకి వెల్లువలా పొంగింది.

"నువ్వు ఒప్పుకున్నావా?" 'షాక్' అవుతూ అడిగాడు.

"ఈనాడు నేను ఒప్పుకోడం ప్రసక్తి వుందంటారా? 'ఓనాడు, చాలా ఏళ్ళక్రితం, ఒకరు కోరితే నేను ఒప్పుకున్నాను. వారికి ఆ విషయం తెలుసు. ఆ కథ చెప్పమంటారా?"

తనని ఎత్తిపొడుస్తోందని అతని మనసంతా కోపంతో ఘూర్ణిల్లింది.

లాభంలేదు ఈ యువతికి సానుభూతి చూపించనవసరం లేదు,

"నీ కసలు బుద్ధిలేదు. నువ్వు ఉత్తి ఫూల్‌వి. ఎన్నో చదివి నేర్చుకున్నానంటావ్-ఆ మాత్రం స్వంతంగా, స్వతంత్రంగా ఆలోచించలేవా?"

"అయితే ఈ సంబంధానికి ఒప్పుకోవద్దంటారా?"

"నేనేమీ అనను. నీకు ఆలోచన లేదా అని"

"అదే నేననేదిను-మీలాంటివారు ఏమీ అనరు. చెప్పరు. ఇక ఏమీ తెలియని. ఓ పల్లెటూరు పిల్ల నిర్ణయించుకోవాలన్నమాట"

"ఇదే విదేశాల్లోఅయితే జరుగుతుందా? నీ లాంటి పరిస్థితే వస్తే, సంస్కారవంతమైన దేశాలలో, ఆ పిల్ల నచ్చినవాణ్ణి చేసుకుని తీరుతుంది. సాహసం కావాలి, మీ నాన్నగారు ఈ వయసులో ఇలా తిరగడానికి నీ అసమర్థతే కారణం"

"అందుకేకదా మీవంటి విజ్ఞుల సలహా అర్థిస్తున్నాను. కాని మీరిప్పుడు చెప్పిన సలహా పాటిస్తే ఈ ఊళ్లో దానిని లేచిపోడమంటారు. ఈ విషయాన్నే మన పట్నాలలో కాస్త నాజూకు పేరెట్టి క్లబ్బులో చెప్పుకొంటారు. కారణం నన్ను మెచ్చిన కుర్రాడు అందరి ముందూ పెళ్ళి చేసుకోడు. నా కళ్ళకి గంతలు కట్టి, ఊళ్లో వాళ్ళ కళ్ళు కప్పి లేవదీసుకు పోడానికి మాత్రం తయారు పోనీ మీ సలహా పాటించి ఆ పనే చేస్తాను. నన్ను లేవదీసుకుపోయే కుర్రాణ్ణి కాస్త చూసిపెట్టండి"

"మీ ఊళ్ళో ఎవరూ లేరా?" అన్నాడు కసి అంతటినీ ఆ మాటల్లో ఇముడుస్తూ,

ఆ అబల పెదవి పంటితో నొక్కి పట్టింది. కళ్ళలో నుఖ్ఖాలు నిలి...

అతనికి దగ్గరగా వచ్చింది.

'ఉంటకేం? ఉన్నారు. కాని ఎన్నాళ్ల తర్వాత వదిలేస్తారా అన్న ఆలోచనే తెగకుండా వుంది. వదిలేయడం తథ్యం. వదిలేసిన తర్వాత ఎలాగూ మెడకు ఓ తాడు బిగించుకోవాలి. దానికి బదులు ఈనాడే ఆ ముసిలాయన చేత కాస్త గౌరవంగా మెళ్లో ఓ తాడు వేయించుకొని మూడుముళ్లూ బిగించుకుంటే మంచిదేమోనన్న మరో ఆలోచన, ఇంకో ఆలోచన కూడా వుంది. మా ఇంట్లో బంగారం, కరెన్సీ నోట్లూ లేకపోయినా నా మెడకు సరిపోయే తాడు ముక్కలు చాలా వున్నాయి.

ఊళ్ళో పెద్ద చెరువుంది. అలా చస్తే, చావడంలో కూడా పల్లెటూరు మోటుదనం అంటారు మీరు. అంచేత కాస్త నాజూగ్గా చద్దామనుకుంటే మీలాంటి పట్నవాసపు స్నేహితుల్ని ఎవర్ని అర్థించినా నిద్రమాత్రలో, సైనైడో దయతో తెచ్చి ఇస్తారు...'

ఉన్నట్టుండి ఆమెలో దుఃఖం పొంగింది. ఏడుపు దిగమింగుకోడానికి గొంతులో కొంగు కుక్కుకున్నా ఎగుపులు వస్తున్నాయి.

అతను తెల్లబోయాడు.

'మీరంతా వట్టిమూర్ఖులు. పరిగెడుతూన్న జీవిత విధానంతో, శాస్త్ర పరిజ్ఞానంతో ముందుకు పోతూన్న ఈ ప్రపంచానికి పనికిరారు. అజ్ఞానం మీ సొత్తు' అన్నాడు.

'అజ్ఞానిని కాబట్టే అడుగుతున్నాను. నా సమస్య తేలలేదు. ఓ యువకుణ్ణి చూసుకొని లేచిపొమ్మంటూరా? మా ఇంటి చిన్న గదిలో ఓ తాడు బిగించుకోమంటూరా? లేక ఆ ఏభైనాలుగేళ్ళ పెళ్ళికొడుకుచేత మెడలో తాడు కట్టించుకొని, వారి కొడుకుల్ని, కూతుళ్ళని ప్రేమతో సాకి, భర్తగారిని భక్తితో పూజించి, చిరంజీవిగా జీవించి, అందరిచేతా 'ఓహో' అనిపించుకోమంటూరా? నా ధర్మమేమిటో చెప్పి వెళ్ళండి'

ఆమె చూపునతడు తప్పించుకొని లేచి నిలబడ్డాడు.

ఆమెకు ఆవేశం కలిగింది.

అతడిని ఆపి, అతని గుండెపై వేలాని అడిగింది. "నా ప్రశ్నకు బదులు చెప్పవలసిన బాధ్యత మీ మీద వుంది. మీ బాధ్యతని విదిలించుకొని పోవడం ఆత్మవంచన, నా ధర్మం ఏదో నాకు బోధించాలి. శిరసావహిస్తాను."

ఆమె చూపులు నిప్పుల్లా వున్నాయి.ఆ సెగ అతన్ని కాల్చింది. అతని పని అయోమయమయిపోయింది. వెంటనే తెలివి తెచ్చుకొని. ఆమెను తోసేసుకొంటూ 'ఛీ' అంటూ వీధిలోకి మెరుపులా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రే ఆ వూరు నతడు విడిచి వెళ్ళాడు.

● ● ●

పదేళ్ళ తర్వాత ప్రొఫెసర్ శేఖర్ ఆ అర్ధరాత్రి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాడు. అతనికి భయంకరమైన కల వచ్చింది. అతని నుదురంతా చెమటపట్టింది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

సావిత్రి కలలో కనబడింది. అతి భయానకంగా కనబడింది. మళ్ళా భయం కలిగింది.

ఎక్కడ వున్నానా అని చుట్టూ చూసుకున్నాడు. పక్క మంచం మీద మృణాళిని పువ్వులా పవళించి వుంది. ఆ గదిలో, నీలిరంగు కాంతిలో మొగలిపువ్వులా మెరుస్తోంది. ఎయిర్ కండిషన్డ్ గది హాయిగా వుంది. మెత్తటి పరుపూ, కింద కాశ్మీర్ కార్పెట్, అలవాటైన సుఖప్రదమైన పరిసరాలు అతని భయాన్ని పోగొట్టాయి. పక్కగదిలోకి వెళ్ళాడు. పిల్లలు సునీల్, కొబితా హాయిగా నిద్రపోతున్నారు.

అతనికి భార్యా, పిల్లల్నీ 'డిస్టర్బ్' చేయడం ఇష్టంలేక 'స్టడీ'లోకి వెళ్ళాడు. స్విచ్చి నొక్కాడు. పాల వెన్నెలలాంటి కాంతి గదినంతా మృదువుగా కౌగలించుకుంది.

ప్రతి విషయం విజ్ఞానపరంగా ఆలోచించే ప్రొఫెసర్ శేఖర్ ఇన్నాళ్ళకు పదేళ్ళతర్వాతసావిత్రి ఎందుకు కలలోకి వచ్చిందా అని ఆలోచించాడు. ఈ పదేళ్ళ బట్టీ అతను తన వాళ్ళతోనే చాలావరకు సంబంధం తెంపుకున్నాడు. ఆవేపుకే వెళ్ళలేదు. మర్యాదకు చిన్నవైన ఉత్తరాలు మిగిలాయి. ఉన్నట్టుండి అతనికి కారణం తట్టింది. పొద్దుట తండ్రినుండి వచ్చింది 'మీ అమ్మమ్మ ఫలానా తేదీన దివంగతురాలైనది 14 వ తారీకున పదవరోజు, కాన తెలియపరచడమైనది' అని ఉంది ఉత్తరంలో. ఆ ఉత్తరాన్ని గురించి అతను అట్టే ఆలోచించలేదు. అయినా సావిత్రి కలలోకి వచ్చింది.

రేపు 'మళ్ళా ఫ్రాయిడ్' చదవాలి.

...సావిత్రి కలలోకి వచ్చింది. చాలా భీకరంగా కనిపించింది. సావిత్రి చచ్చిపడి వుంది. మొహమంతా వికృతంగా మారిపోయింది. కమిలిపోయిన రంగులో వుంది. ఆ రంగు వున్నట్టుండి 'గాఢ' రంగులోకి మారుతోంది. చుట్టూ ముసలి భర్తా, సవితిపిల్లలూ వున్నారు.

వంట్లో నలత లేదు, వంటిమీద గాయాల్లేవు.

జబ్బులేదు, హత్యకాదు అన్నారు వైద్యులు.

కంఠంమీద మాత్రం సన్నని, నల్లని చారవుంది. ఆ చార, కలలో, అతనికి భీతిని కలిగించింది. ఇంకా గమత్తు—ఆ చార ఎవ్వరికీ కనబడ్డం లేదు, తనకి తప్ప.

తాళి కట్టుకున్న పచ్చని పసుపు తాడు తన కంఠం చుట్టూ బిగిసిపోయిందని సావిత్రి ఏడుస్తూనే చెప్పింది. ఆ మాటలూ, ఏడుపూ మిగతా వాళ్ళకి తెలీడం లేదు. ఆమె ఏడుపు భీతావహంగా వుంది. ఈ చావు పదేళ్ళ క్రితమే తానే తెచ్చుకుంటే తేడా ఏమిటంటోంది. తనకి తెలియడం లేదుట. చెప్పమంటోంది.

ఆమె తనతోనే మాట్లాడుతోంది.

ఆమె ఉన్నట్టుండి లేచికూర్చుని మెడలో తాళికట్టిన తాడు తీసి, వికృతంగా నవ్వుతూ తన మెడలోకి హారంలాగా విసిరింది. ఆ తాడు తన మెడని చిత్రంగా నొక్కుతూ, కంఠం బిగిసిపోతూవుంటే సావిత్రి భయానకంగా నవ్వుతూ నవ్వుతూ ఏడుపులోకి దిగి రోదిస్తోంది. ఆమె రోదన ఎక్కువైనకొద్దీ తన కంఠం చుట్టూ తాడు బిగుసుకుపోతోంది. అతనికి ఊపిరి ఆడనట్టూ, ప్రాణం పోతున్నట్టుగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

...అంతలో మెలకువ వచ్చింది.

ఆ కలను అతడిప్పుడు ఖాతరు చేయడు. టైము చూసుకున్నాడు. మణికట్టుంతా నిండిన వాచీ నాలుగు చూపిస్తోంది. వాచీలో తేదీ మారింది. 14 వ తారీఖు వచ్చింది.

ఇంకెలాగూ నిద్దుర పట్టదు. మృణాళినిని లేపడం ఇష్టం లేదు - రాత్రి క్లబ్బునించి పాపం అలస్యంగా వచ్చింది. లేడీస్ క్లబ్ తరఫున చందాలు వసూలు చేసి డస్సిపోయింది.

రేపు సైన్స్ కాంగ్రెస్‌లో అతడు చదవవలసిన పేపరు ఒకటుంది. ఎంతో విప్లవాత్మకమైన థియరీ ప్రతిపాదిస్తున్నాడు దాంట్లో. రేపు కలకత్తాకు మేధావులంతా వస్తున్నారు.

ఆ కాగితాలు ముందువేసుకుని కూర్చున్నాడు ప్రొఫెసర్ శేఖర్.

నిముషంలో అతని తీరు మారిపోయింది.

కంటికి జోడూ, వెనక్కి పోతూన్న జుట్టూ, విశాలమైన నుదురూ, సునిశితమైన బుద్ధీ, తీక్షణమైన పట్టుదలా-ప్రతిభావంతుడైన విజ్ఞాని అతడు. అతను చూపూ, ఆలోచనా అంతా ముందే వుంది. మానవ శ్రేయస్సుకోసం సర్వ జనావళి సుఖించేటందుకు నిరంతరం పరిశ్రమించే విజ్ఞాన కోవలోని వాడు.

అతనికి జేజేలు. జోహార్లు.

□□□

[గత సంచిక తరువాయి]

చదువుకున్న కమల

ముప్పాళ రంగనాయకమ్మ

ముసలాయన ధోరణికి ఎప్పుడూ కమలకు ఓ రకమైన అసహ్యం జుగుప్సా కలుగుతూ ఉంటాయి.

ఆయన మామగారు - తను కోడలు.

ఆయన గౌరవం పొందాల్సిన పెద్దమనిషి- తను పెద్దవాళ్ళని గౌరవించాల్సిన బాధ్యత కలది. ఆయన ఎదటపడి తిరగటానికే కమలకు కొంచంగా సంకోచంగా వుంటుంది. కానీ, ముసలాయనలో 'ఆకతనం' అడుగడుగునా తొంగిచూస్తూనే వుంటుంది. అత్తాకోడళ్ళతోపాటు ఆయన కూడా వంటింట్లో చేరతాడు. కోడలికి పనులు వురమాయిస్తూ వుంటాడు. 'మీ అత్తగారు రెండు వుల్లిపాయలు ఒలిచి యిమ్మని చెప్తోందే!' అంటూ అటు మనిషి కబురు ఇటూ - ఇటు మనిషి కబురు అటూ చేరవేస్తూంటాడు. శేషమ్మ చెప్పటం కమల వినవే వింటుంది. మధ్య ఈ మనిషి హెచ్చరింపు లేవిఁటి?

'రెండు పాయలిలా పడేయ్. నేనుకూడా ఒలుస్తాను.' అంటూ కత్తిపీటదగ్గర పెట్టుకున్న వుల్లిపాయలు తీసి కోడలికి ఎదురుగా కూర్చుని తనూ ఒల్చటానికి వుపక్రమిస్తాడు. అలాగే వుడికిన దుంపలు కలిసి ఒలవటం - అలాగే కొబ్బరి చిప్పలవీ కోరిపెట్టటం - ఆడవాళ్ళకి సాయం చేస్తున్నానని ఆయన అనుకోవచ్చుగానీ, ఆయన ప్రవర్తన కమలకి ఎబ్బెట్టుగా తోస్తుంది. ఆయన సాయం చెయ్యనంత మాత్రాన ఏ పనీ అగిపోదు. అసలా సాయం కమలకి ఎంతమాత్రం యిష్టం వుండదు.

ముగ్గురుఆడవాళ్లుకలిసి మాట్లాడుకొంటోన్నట్టే - మాటలో మాట కలపటం-అమ్మలక్కల విషయాలన్నీ ముచ్చటించుకోటం- అప్పుడప్పుడూ కోడల్ని కలివిడిగా హాస్యాలాడటం చమత్కరించటం-చనువు ప్రదర్శిస్తూ మండలించటం సందర్భాన్ని బట్టి జరుగుతోనే ఉంటాయి.

మాట్లాడుతూ మాట్లాడుతోనే - ఏ గడపమీదో, ఏ పీటమీదో, అదీ ఇదీ కాకపోతే మోచేయి తల కింద చేర్చుకునో, ఆడవాళ్ళలాగా, నేలమీదే ముడుచుకు పడుకుని ఓ కునుకు తీస్తోంటాడు.

'మామయ్యా కొంచెం తప్పుకుంటారా? నేనలా బీరువా దగ్గరికి వెళ్ళాలి. అత్తయ్య కందిపప్పు తెమ్మన్నారు.' అంటే.

'ఆఁ ఆఁ వెళ్ళవే! వెళ్ళు' అంటూ మనిషి తప్పుకువెళ్ళగలిగేంత చోటు యిస్తాడు ఒక్క పిసరు జరిగి.

ఎంత జాగ్రత్తగా నడిచినా పైట కొంగో చీర కుచ్చెళ్ళో ఆ మనిషికి తగులుతోనే వుంటాయి. మామగారి చెయ్యో - కాలో తగిలినప్పుడు కమల శరీరం జుగుప్సతో జలదరిస్తుంది. ఇక మధుమూర్తి యింట్లో వున్నప్పుడు కొడుకూ కోడలూ ఏ కథలగురించో - సినిమాల గురించో స్నేహితుల గురించో - మాట్లాడుకొంటోంటే - ఎక్కడవున్నా లేచి దగ్గరికివచ్చికూర్చుని- సంభాషణలో భాగం పంచుకుంటూంటాడాయన.

విషయం ఏవిటోకొసామొదలూ తెలీనప్పుడు 'ఏవిట్రా? ఏవిటి? ఆ కబురేవిఁటి?' అని జవాబు చెప్పే వరకూ ప్రాణాలు తోడేసి విషయం తెలుసుకుని - 'అవునుమరి, నువ్వు చెప్పిందే నిజం. ఈ రోజుల్లో ధరలెలా మండిపోతున్నాయనీ! ఎవర్నంటేమాత్రం ఏం లాభం ఉందీ?' అంటూ ఏమిటో అతక్కుండా పొతక్కుండా మాట్లాడేస్తాడు.

'వారం రోజుల్నుంచీ చెప్తున్నా వినటంలేదు మీరు ఒక్క పుస్తకం తెచ్చిపెట్టటానికి అంత నిర్లక్ష్యం ఏమిటి?' అంది కమల ఓ రోజు.

మధుమూర్తి నవ్వేస్తూ 'నిజమే నాకు నిర్లక్ష్యమే. నీ అన్నకి వుత్తరం రాయలేకపోయావా? ఈ సరికి పంపించేవాడు.' అన్నాడు హాస్యంగా.

'బాగా చెప్పావురా! అన్నకేం ఖర్మ? బాబుకే రాస్తేసరి. ఎందుకు పంపించడూ?' అంటూ ముసిముసిగా నవ్వాడు ముసలాయన.



కమల విస్తుపోయింది. కొడుకూ కోడలూ ఆడుకునే హాస్యాలలో ముసలాయన కలగజేసుకుని కోడలితో వేళాకోళం ఆడటం భరించలేనంత రోత పుట్టించింది.

కానీ మధుమూర్తికి తండ్రి సంభాషణ వీసమెత్తుకూడా అసహజంగా తోచినట్టు కన్పించలేదు.

మధుమూర్తి స్నేహితులెవరైనా ఇంటికి వచ్చినప్పుడు కూడా వాళ్ళ దగ్గరే చేరతాడు ముసలాయన. వాళ్ళ సంభాషణమధ్య తలదూరుస్తూ వుంటాడు. చూడగా చూడగా అదంతా ముసలాయన పొరపాటుగా మాత్రమే తోచలేదు. మధుమూర్తి కూడా తన వయస్సులోనూ తండ్రి వయస్సులోనూ భేదం లేనట్టూ - ఎలాంటి అరమరికలూ లేకుండా ప్రవర్తిస్తాడు.

తనకూ భార్యకూ మధ్య కలగజేసుకుంటోన్నప్పుడుగానీ, తనకూ స్నేహితులకూ మధ్య తలదూరుస్తోన్నప్పుడుగానీ అతను తెలివిగా కొన్ని కొన్ని సందర్భాలు తప్పించవచ్చును. తండ్రి ప్రవర్తనకు అవకాశాలు లేకుండా చెయ్యవచ్చును. కానీ ఆ దృష్టితో మధుమూర్తి ఆలోచించినట్టే కన్పడదు.

మధ్యాహ్నం వేళ యింటికి ఆడవాళ్లెవరైనా వచ్చి కూర్చుంటే వాళ్ళదగ్గిర కూడా చేరతాడాయన. పిల్లలు ఏడుస్తోంటే - 'అద్దం వేసుకోండర్రా! పాలియ్యరాదూ? వాళ్ళనలా ఎందుకేడిపిస్తారూ?' అంటూ మందలింపులతో సలహాయిస్తాడు.

పెద్ద వయస్సులో మగాయనకు వుండదగ్గ హుందా - గాంభీర్యం ఆయనలో ఏకోశానా కానరావు. ఆయన్ని చూస్తే - 'తాతగారు! పెద్దవారు.' అన్న గౌరవభావం మొలకెత్తదు.

మామగార్ని చూస్తోంటే కమలకు అప్పుడప్పుడు జాలికలుగుతూంటుంది.

తండ్రి ప్రవర్తన ఏమాత్రమూ ఎబ్బెట్టుగా తోచని మధుమూర్తి కూడా - పెద్దవయస్సులో - ఇలాగే ప్రవర్తించి నవ్వుల పాలౌతాడేమో నన్న భయంకూడా దాన్ని వెన్నంటి వుంటుంది.

ఓ రోజు కమల మధుమూర్తి వచ్చాక— 'ఏదైనా సినిమాకి వెళ్దామా? నాకేమీ తోచటంలేదు' అంది.

'సరే' అన్నాడు మధుమూర్తి. వెంటనే గదిలోంచి బయటికి వెళ్ళి 'అమ్మా! నువ్వూ వస్తావా ఏమిటి సినిమాకి' అన్నాడు.

'దేనికి బయల్దేరారూ? అయినా యిప్పుడెందుకూ?' అంది మొదటి మెట్టుగా అభ్యంతరం చెప్తూ—

నే చూశాగానీ మీ నాన్నని తీసికెళ్ళు - ఏమండోయ్! మీరు వెళ్ళరాదూ? వాళ్ళు సినిమా కెళ్తున్నారూ!' అంటూ వంటింట్లోంచి కేక పెట్టింది.

అన్నదే తడవుగా లేచివచ్చాడు ముసలాయన.

మధుమూర్తి గదిలోకి వెళ్ళాడు— 'కమలా! ఇంకా ఇలాగే కూర్చున్నావేమిటి? టైమెంత అనుకొంటున్నావు? మహా అయితే ఓ అరగంట వుంటుంది.'

మధుమూర్తికేసి పరిశీలనగా చూస్తూ అడిగింది కమల—'అత్తయ్య ఏమిటో అంటున్నారు?'

'ఏంలేదు తనని రమ్మన్నాను. చూసిందట. మా నాన్నని వెళ్ళమంటోంది. లేమరి! ఎలాగూ వెళ్తూ అలశ్యం దేనికి?'

కమల తీరిగ్గా కుర్చీలో కూర్చుంది— 'నేను రాను. చాలా తలనొప్పిగా ఉంది.'

'అదేమిటి? ఇప్పటికిప్పుడు ఏమైంది?'

'ఏమో! ఏమైందో! తలనొప్పి మాత్రం చంపుతోంది'

నమ్మకమేనా? అన్నంత అనుమానంగా చూశాడు. మధుమూర్తి —'నిజమేనా? లేకపోతే అలకలేమైనా సాగిస్తున్నారా అమ్మాయిగారు?' అంటూ దగ్గిరికివచ్చి భుజం మీద చెయ్యి వేశాడు.

కమల చిన్నగా నవ్వింది— 'ఆ మాత్రం బుర్రవుంది అబ్బాయిగారికి అయితే ఫర్వాలేదు. నాకే తలనొప్పి లేదు, నేనమాత్రం రాను. తండ్రిగారూ పుత్రుడుగారూ కలిసి వెళ్ళండి.'

'అరె! వెళ్ళాలంటే అందరం కలిసే వెళ్ళచ్చు. అసలు సంగతి చెప్పు.'

కమల విసుగ్గా లేచి నిలబడింది— చిరాకులూ పరాకులూ వున్నవి వున్నట్టుగా ప్రకటించేంత అన్యోన్యత వుంది ఆ దంపతులమధ్య—'కారణం ఏముంది? నేను సరదాపడి సినిమా కెళ్దామన్నాను. అంటే మనం ఇద్దరం కలిసి వెళ్దామని వేరే చెప్పాలా? మీకు బుద్ధిలేక అమ్మగార్ని పిలిచారు. ఆవిడకు బుద్ధిలేక నాన్నగారికి చెప్పారు. ఆయనకు బుద్ధిలేక మనతో ప్రయాణమయ్యారు. నాకుమాత్రం బుద్ధివుంది. మీ వెంట రానంటున్నాను. అదీ విషయం, చాలు. ఇక వెళ్ళండి.'

మధుమూర్తి బుర్ర గోక్కు

● *కుండ కొందామని వెళ్ళిన మతిమరుపాయన కొట్లో కుండొకటి తలక్రిందులుగా వుండటం చూసి "ఎంత వింత! ఈ కుండకి మూతే లేదు" అనుకున్నాడు. మళ్ళీ దాన్ని తిరగేసి "ఓష్! ఓష్! ఇంతలో దీనికి అడుగుకూడా మాయమైపోయిందే" అని ఆశ్చర్యపోయాట్ట.*

న్నాడు – 'అదికాదు కమలా! నేను అంత ఆలోచించలేదు. పోనీ అమ్మ వస్తుంది కదాని అడిగాను పాపం ఆవిణ్ణి మాత్రం ఎవరు తీసికెళ్తారు ?'

కమల విస్మయంగా చూసింది.

శేషమ్మ పెద్దవయస్సే అయినా దేనికీ బద్ధకించకుండా అత్తమ్మగారూ ఏ పక్కింటి పిన్నిగారితోనో–బామ్మ గారితోనో – అక్కగారితోనో – సినిమాలకూ – దేవుడి గుళ్ళకూ – చిన్నచిన్న ప్రయాణాలకూ వెళ్ళి వస్తోనే వుంటుంది. వూళ్ళోకి ఓ ఎగ్జిబిషన్ వచ్చినా – ఓ సర్కస్సు వచ్చినా ఓ విశేషం జరిగినా ఆ వీధిలో ఆడవాళ్ళు వెళ్ళకుండా మాత్రం అది వూళ్ళోంచి కదలదు. కదలనివ్వరు.

పట్టుపట్టుకి – పర్సులోంచి ఒకటీ రెండూతీసి అందించే మధుమూర్తికి ఆ భోగట్టా తెలియందేమీ కాదు. అయినా తమతోపాటు తల్లిని రమ్మని పిలిచి– 'ఆవిణ్ణిమాత్రం ఎవరు తీసి కెళ్తారూ?' అంటూ సానుభూతి కురిపించాడు. అంతే కారణం అర్థం కాకపోలేదు. తల్లి మెచ్చుకోలు కొడుక్కి కావాలి.

కమల మామూలుగా జవాబు చెప్పింది – 'ఎవరో తీసికెళ్ళటం ఏమిటి? మీ అమ్మా నాన్నా ఓసారి వెళ్ళి మనం యిద్దరం ఓసారి వెళ్ళ కూడదూ?'

మధుమూర్తి కొంచెం నవ్వాడు 'ఛ! పెద్దవాళ్లు అలా కలిసి వెళ్తారా?'

'సినిమాలు చూడ్డానికి లేని పెద్ద తనం – భార్యాభర్తలు కలిసి వెళ్ళ డానికా? అందులో కొన్నివేవేమిటో నాకేం బోధపళ్లేదు.'

కమల మధుమూర్తితో అనలేదుగానీ– తను అత్తగారి వయస్సులోవుండి, తనకి మధూలాంటి కొడుకూ కోడలూ వుంటే — వాళ్లతోపాటు తనూ వెనక బయల్దేరుతుందా ? వాళ్ళు రమ్మంటే మాత్రం – ?

'అయ్యో! నేనెందుకర్రా! మీ రిద్దరూ వెళ్ళిరండి. ఇల్లు కని పెట్టుకుని వుంటాను.' అనదూ ?

కమల పెదవులమీద చిరునవ్వు చిందులాడింది. మధుమూర్తి ఇరుకునే పడ్డాడు– 'అవును. నువ్వు చెప్పినట్టు అమ్మా నాన్నా కలిసి వెళ్తే బావుంటుంది. అయితే నన్నిప్పు డేం చెయ్యమంటావు ?'

'గంతులెయ్య మంటాను.'

'అబ్బ! చెపుదూ !'

'తండ్రీ కొడుకులు వెళ్ళండి.'

'నువ్వు రాకుండానా ? చస్తే వెళ్ళను.'

'మామగారితో కలిసి నేను చస్తే రాను.'

'పోనీ ఈ ఒక్కసారికి ఒప్పే సుకో కమలా ! మరోసారి ఇలాంటి క్లిష్టపరిస్థితి సంభవించకుండా చూస్తాను.'

'మధుమూర్తి అభ్యర్థనలన్నీ త్రోసిపుచ్చింది కమల. మొత్తంగా ప్రోగ్రాం కేన్సిలైంది.

'ఏమిరా? సినిమాకి వెళ్లాం అన్నావూ?' అంటూ కర్టెన్ పక్కకి లాగి గదిలోకి వచ్చాడు ముసలా యన. కమల మూర్తికి దూరంగా పోయి నించుంది. ఓ ఘడియచూసి బయటికి వెళ్ళిపోయింది.

'కమలకి తలనొప్పిగా వుందట' అంటూ ఏదో సర్ది చెప్పాడు మూర్తి. తండ్రి కొడుకుతో కబుర్లాడుతూ కూర్చున్నాడు.


• • •

సాధారణంగా మధుమూర్తి తల్లీ తండ్రీ కొడుకు యింట్లో వున్నంత సేపూ చీటికి మాటికి పలకరిస్తూ— కొడుకు కనుసన్నలలోనే మసు లుతూ కొడుకుని అంటిపెట్టుకుని వున్నట్టే ప్రవర్తిస్తారు.

కొడుకు ఆఫీసు నుంచి వచ్చీ రాగానే – ఇంట్లో జరిగిన విశేషా లన్నీ ఏకరువు పెట్టి చెప్పేస్తుంది శేషమ్మ— 'అత్తారి వూరు నుంచి వుత్తరం వచ్చిందిరా! అంతాబాగానే ఉన్నారట. మీ బామ్మరిది రెండు లంఖణాలు చేసి లేచాడట.

అన్నట్టు సుభద్రమ్మ వచ్చి వెళ్లిం దిరా మధ్యాన్నం! పెళ్లయ్యాక ఎంత మారిపోయిందనుకున్నావ్? పోల్చ లేకపోయానంటే నమ్ము.

నీ పెళ్ళాం గాజులు కొను క్కుంది. దొంగవెధవ! రూపాయికి ఇరవై యిమ్మంటే యిచ్చాడుకాడు. ఒసే కమలా! ఆ గాజులు చూపిం చవే వాడికి. బొత్తిగా లేతరంగు. నా మట్టుకు నాకు బాగా లేవు సుమీ! చెప్తే విన్నదికాదు. ఏమో! ఈ కాలం పిల్లల షోకులు నాకేం తెలుస్తాయని వూరుకున్నాను.' — ఆ ధోరణితో వూసగుచ్చినట్టు



సంగతులన్నీ కొడుకు బుర్ర కెక్కిం చేస్తుంది.

ఆ తర్వాత — 'ఒరేయ్ మూర్తీ! బియ్యం నిండుకున్నాయి సుమీ! ఇప్పటికే అప్పుతెచ్చాను. అన్నట్టు జ్ఞాపకం వచ్చింది. పిన్నిగారి కోరాపాయి అప్పు తీర్చాలి. మొన్న సినిమాకెళ్దామంటే ఎక్కడైనా తీసుకుని వెళ్ళమన్నావు కావూ?' అంటూ అవసరాలన్నీ ఏకరువు పెడుతుంది.

నిజంగా భర్తని చూస్తే కమల కెంతో జాలికలుగుతుంది. బయట నానా హైరానా పడి యింటికి వస్తారు మొగవాళ్ళు. వచ్చీ రాగానే ఇంటి సొదంతా ఏకరువు పెడితే ఎంత విసుగ్గా వుంటుందో మరి! బట్టలు మార్చుకుని కాఫీతాగి ఓ ఘడియ తీరిగ్గా కూర్చున్నమీదట చెప్పాల్సిన సంగతులేమైనా చెప్తే వినటానికి కూడా సుఖంగా వుంటుంది.

కాని ఆ చిదంబర రహస్యం శేషమ్మకేమీ తెలియంది కాదు. తను చెప్పే లోపల కోడలే గదిలో దూరి అన్నీ చెప్పేస్తే...? అయినా తన కొడుకు తనమీద విసుక్కోడుగా?

చనువు వుందని ఎదటి మనిషి నెత్తెక్కి పీడికొట్టటం ఎలాంటి వివేకమో అర్థంకాదు కమలకి.

అసలు గమ్మత్తేమిటంటే — అలాంటి విషయాలేమైనా కమల భర్తతో అంటే—'నువ్విలా అపార్థం చేసుకోకూడదు కమలా! అమ్మకి అమాయకత్వం తప్పితే ఏమీ లేదు. చిన్నప్పట్నుంచీ అక్కయ్యకన్నా నేనంటే వాళ్ళకెంతో యిష్టం. వాళ్ళేలా ప్రవర్తించినా సరే నేను విసుక్కోలేను; పెంచి పెద్ద చేశారన్న కృతజ్ఞతయినా వుండద్దా నాకు?' అంటాడు.

మూర్తి అలా మాట్లాడ్డం వింటే కమలకి తగని ఆశ్చర్యం కలుగుతుంది.

ఏ తల్లితండ్రులకు మాత్రం తమ బిడ్డలంటే ఇష్టంవుండదూ? కన్నారు కాబట్టి ప్రేమతో పెంచుతారు. పెద్ద చేస్తారు. అది వాళ్ళ స్వార్థమూ బాధ్యతాను. అందులో ఎవరికో చేస్తోన్న నిర్వాకం ఏమిటి?

అలాగే పిల్లలుకూడా ప్రయోజకులై—వయస్సు మళ్ళిన తల్లిదండ్రుల్ని ఆదరాభిమానాలతో గౌరవిస్తూంటారు. అంతకు మించిన విశ్వాసాలకూ కృతజ్ఞతలకూ అవసరం ఏమిటి?

కమల కుతూహలంగా చూసింది 'అయితే నాకో సందేహం. కొడుకు తనను పెంచినందుకే తల్లిదండ్రుల్ని ప్రేమించాలీ అంటే—తనని పెంచని వాళ్ళందర్నీ ద్వేషించాలి. అవునా?'

'అదేమిటి? కన్నవాళ్ళే బిడ్డని పెంచుకుంటారు గానీ పరాయివాళ్ళెలా పెంచుతారు?'

'అదిమీరు ఒప్పుకున్నారు కదా? ప్రాణంతోఉన్నవాళ్ళు గాలిపీల్చటం ఎంత సహజమో - కన్న వాళ్ళు బిడ్డని పెంచి పెద్దచేయటం అంత సహజం కాదా? అందులో బిడ్డలకి జరుగుతోన్న విశేష మేమిటి?'

'అవుననుకో, ఉత్త పెంచటం గురించికాదు నేననటం. చిన్నతనం నుంచీ నన్నెంతో గారంగా చూశారని.'

'నిజానికి మీలో ఏ మాత్రం హృదయంవున్నా మీ అక్కగారికి దక్కని ప్రేమ మీకు ఒక్కరికే దక్కినందుకు సిగ్గుపడాలిగాని గర్వించకూడదు. కన్నబిడ్డల్లో పక్షపాతాలు చూపించే తల్లిదండ్రుల్ని ఏ విధంగా మనం సమర్థించాలి?'

'ఎలాగైనా నీ బుర్రకి ఆలోచన లెక్కువ' అనేస్తాడు మూర్తి.

నిజంగానే కమల బుర్రకి ఆలోచన లెక్కువ.

జరుగుతోన్న విషయాన్ని దుర్భిణీ యంత్రాల్లోంచి చూసి మంచీ చెడ్డా విమర్శించుకునే తర్కం ఎక్కువ.

'ఒరే మూర్తీ! బారెడు పొద్దెక్కింది లేవరా!' అంటూ చిమ్మ చీకటినుంచీ చంటిబిడ్డని లేపినట్టు చెట్టంత కొడుక్కి తల్లి మేలుకొలుపులు పాడటం కమలకి నచ్చదు.

అలాగే కొడుకూ కోడలూ మాట్లాడుకొంటోన్న కబుర్లలో అత్తగారు తల దూర్చటం కూడా కమలకి నచ్చదు.

ఇంకా అలాగే రాత్రిళ్ళు భోజనాలయ్యాక తనూ — తన భర్తా గదిలో పుస్తకాలు చదువుకొంటూ కూర్చున్నప్పుడు — 'మూర్తీ! రేడియో వెయ్యరా!' అంటూ మామగారు గదిలోకి రావటంకూడా కోడలికి బొత్తిగా నచ్చదు.

కమలకి నచ్చని ఎన్నో విషయాలు జరిగినప్పుడల్లా కమల తెగ ఆలోచిస్తుంది.

బిడ్డలు ఒక వయస్సుకు ఎదిగాక తల్లిదండ్రులతో అంతగా సంబంధం వుంచుకోవాల్సిన అవసరం వుండదు. ఎవరి పని పాటలు వారివే! ఎవరి దినచర్య వారిదే! ఎవరి కాలక్షేపం వారిదే!'

'పెద్దవాళ్ళకీ—చిన్నవాళ్ళకీ అన్ని విషయాల్లోనూ పొత్తు బావుండదు. తండ్రీ కొడుకులు - తల్లీ కూతుళ్ళూ వయస్సులో బొత్తిగా భేదం వున్నవాళ్ళు - ఎంత ఆత్మీయులైనా సరే కలిసి సినిమాలు చూడ్డం - షికార్లు చేయటం - సరదా ప్రయాణాలు చేయడం - ఇష్టాగోష్ఠి జరగటం - ఎబ్బెట్టుగా ఉంటుంది.

రోజుకోసారి ఏ భోజనాలవేళో పడకలవేళో ఎప్పుడో అప్పుడు యోగక్షేమాలు పరామర్శించుకుని మంచి చెడ్డలు మాట్లాడుకుని—నిగతా వేళల్లో ఎవరిదారిన వాళ్ళు ముభావంగా వుంటే హాయిగా తెరిపిగా వుంటుంది.

అలా కాకుండా తన అత్తమామలు - తన భర్తతో అస్తమానూ

అంత సన్నిహితంగా మసలటం - తామిద్దరూ నిశ్చింతగా కూర్చునే అవకాశాలు లేకుండా చెయ్యటం- దుర్భరంగానే వుంది కమలకి.

చిన్నవాళ్ళని పెద్దవాళ్ళు మూర్ఖంగా ప్రేమించినా - పెద్దవాళ్లని చిన్నవాళ్లు గుడ్డిగా ఆరాధించినా ఫలితం ఒక్కటే—అశాంతి! మనస్పర్థ!

• • •

'కుటుంబం కూతురి పెళ్ళిట. శుభలేఖ వచ్చిందిరా!' అన్నాడు వెంకట్రావయ్య తన ప్రయాణానికి డబ్బు అందించాలని అదో హెచ్చరిక కావచ్చు.

'ఊఁ అలాగే. వెళ్ళిరండి' మధుమూర్తి వూఁ కొట్టాడు.

'చేతులూపుకొంటూ వెళ్ళి రావడం కాదు. పెళ్ళికూతురి చేతిలో పదో పరకో పెట్టాలి.' అంది శేషమ్మ.

'సరి! అది చెప్పాలా ఏవిఁటి?' ముసలాయన.

మూర్తి లేచి గదిలోకి వెళ్ళాడు.

తల దువ్వుకొంటూ అద్దం ముందు చాలాసేపు నిలబడ్డాడు.

కమల భర్త దగ్గిరిగా వెళ్ళి మృదువుగా అడిగింది — 'ఏమిటి ఆలోచిస్తున్నారు?'

తేరుకున్న వాడిలా కదిలి దువ్వెన టేబుల్ మీద పెట్టి వెనక్కి తిరిగాడు—'ఏం లేదు కమలా! నాన్న ప్రయాణానికి నలభై రూపాయలు చూడాలి'

'ఈ నెలాఖర్లోనా?'

'బావుంది. ముహూర్తాలకు నెలాఖరేమిటి?'

'పెళ్ళికి వెళ్ళటం అంత ముఖ్యమా?'

'వాళ్ళు పిల్చారుగా? బాగా దగ్గిరవాళ్ళు కూడాను.'

'అంత దగ్గిర వాళ్ళయితే అందరికోపాటే ఓ శుభలేఖ వేసి వూరుకున్నారేం?'

'అంత దూరంనుంచి స్వయంగా వచ్చి పిలవగలరా?'

'పోనీ వేరే ఓ వుత్తరం రాయచ్చుగా?'

'పెళ్ళి హడావుడిలో ఎన్నని చూసుకుంటారు?'

కమల నుదురు చిట్లిస్తూ అంది— 'పిలవటానికి వాళ్ళకంత శ్రద్ధా ప్రత్యేకత లేనప్పుడు, డబ్బు ఖర్చు చేసుకుని ఇక్కణ్ణుంచి బయల్దేరి వెళ్ళి బహుమతులు యిచ్చి రావాల్సిన అవసరం ఏమిటి? వాళ్ళ శుభలేఖకి బదులుగా పెళ్ళి సమయానికి గ్రీటింగ్స్ పంపి వూరుకోరాదూ? పూర్వంలాగా చీటికీ మాటికీ ఏవేవో బంధుత్వాలు సందర్భాలూ పురస్కరించుకుని ప్రయాణాలుచేసి డబ్బు ఖర్చు పెట్టటం ఈ రోజుల్లో సామాన్య సంసార్లకి సాధ్యమయ్యే పనేనా?'

'నీకు తెలీదు కమలా! మావాళ్ళ పద్ధతులన్నీ వేరు. ఇలాంటి మంచి చెడ్డల్లో తప్పుకుంటే చాలా నిష్ఠూరాలు వేస్తారు. అంతవరకూ ఎందుకు? వెళ్ళద్దంటే మా నాన్నకే బావుండదు.'

'ఆయన అభిప్రాయం మనం పాటించి తీరాల్సిన అవసరం నాకేం కన్పించటం లేదు. ఇప్పుడు అప్పుచేసి ఆయన్ని పంపిస్తారు. బాగానేఉంటుంది. రేపు ఆ అప్పుతీర్చాల్సిందెవరు? ఇది అనవసరం ఖర్చని మీరనుకున్నప్పుడు ఎందుకు దాన్ని పాటించాలి — 'నాన్నా చేతిలో డబ్బులేదు. మీరు వెళ్ళటానికి. నేను శుభాకాంక్షలేవో పంపించేస్తానులెండి' అని ఖచ్చితంగా చెప్పరాదూ?'

అంతా విన్నాడు మధుమూర్తి. చివరికి అన్నాడు— 'వెళ్ళకపోతే బాగుండదు కమలా!' కమల భర్తకేసి తదేకంగా చూసింది. ఆలోచించగల మనుష్యులు ఎన్ని ఇబ్బందులు కోరి తెచ్చుకుంటారు?

బాగు — బాగు —బాగు. ఆ బాగు కోసం ఈ ఇంటు ఎన్ని అర్థంలేని పనులు — ఎన్ని అనవసరమైన పనులు సాగుతున్నాయో లెక్క లేదు.

నియమాలూ — ఆచారాలూ ఏనాడో ఎందుకో పెట్టారు. బాగానే వుంది

కానీ, ఈ నాడు ... వాటి అవసరాలు మారి—అర్థాలు మారి—కాలం మారి — రోజులు మారి — జీవన ప్రమాణం మారి—మనుషులు మారి— సమస్తం తల్లక్రిందులౌతున్నా ఆ నియమాలు మారవు ఆచారాలు మారవు. ఆచరణలు మారవు. మనస్తత్వాలు మారవు. బలహీనతలు మారవు. అసలు ఎవ్వరికీ ఎలాంటి మార్పూ గిట్టదు. కష్టమైనా-నిష్ఠురమైనా - భరిస్తూ వాటినే బ్రహ్మానందంగా స్వీకరిస్తూ-నిండు జీవితాలను రీతులకోసం - రివాజులకోసం - అంకితం చేసుకునే అభాగ్యులలో తన భర్తకూడా ఒకడంటే కమలకి పుట్టెడు జాలి కల్గింది.

అనవసరపు బెడదలేమీ లేకపోతే మధుమూర్తి తనకొచ్చే జీతం రాళ్ళతో — తిండి తిని — బట్టకట్టి — ఎలాగో కాలం నిశ్చింతగానే వెళ్ళమార్చగలడు.

అయితే శేషమ్మ దృష్టికి ఏదీ

• ఒక మతిమరపు మనిషి పనుండి బయటికి వెళ్ళవలసివచ్చి గంటలో తిరిగొచ్చేస్తానని చీటీ వ్రాసి తలుపుకిగుచ్చి వెళ్ళిపోయాడు.

పనిచూసుకుని తిరిగొచ్చి చీటీ అలాగే వుండటం చూసి మెట్లమీద అలాగే కూర్చుండిపోయాట్ట ఆ చీటీ తాలూకు మనిషి రాకకోసం ఎదురు చూస్తూ.

అనవసరం అవదు. ప్రతి సినిమా చూడ్డం—దారే పోయేవాళ్ళకి వండి వార్చటం-నెలకి నాలుగు మొక్కులు మొక్కటం—పండుగలూ పబ్బాలూ-మహాడంబరంగా చెయ్యటం — అన్నీ అవసరమే.

పొదుపు—సర్దుకోడం అనేవి ఆవిడ నిఘంటువుల్లో లేవు. బస్తీలో కాపురం అంటే నిత్యా రకరకాల వ్యక్తులు — ఏదో విధంగా పరిచయమో—స్నేహమో—చుట్టరికమో-వున్న వాళ్ళు—సినిమాలకో—ఆస్పత్రులకో — కోర్టులకో — షాపులకో — రైళ్ళకో—ఎందుకో అందుకు వచ్చిపోతూనే వుంటారు.

అవసరం కాస్తా గడిపేసుకుందామని—పోనీ ఓసారి చూసిపోదామనీ-ఏ మాత్రం తెలిసిన వాళ్ళైనా ఓసారి వచ్చి వెళ్తారు.

అందులోనూ శేషమ్మగారింటికి వచ్చేవాళ్ళకి లోటేమిటి? ఎవరు వచ్చినా ఎన్నిసార్లువచ్చినా నిష్ఠూరాలాడుతోనే వుంటుందావిడ-"ఊళ్లోకి వచ్చి మా కంటికే కన్పించకూడదూ? ఎంత ఆస్పత్రి పని మీద వస్తే మాత్రం ఎక్కడో సత్రంలో దిగటమేం ఖర్మ? రెండు పూటలు ముద్ద పెట్టలేకపోతామా?"

"అబ్బే! అది కాదండీ"

"అదంతా నాకు చెప్పకు. లక్షణంగా ఇక్కడ తిళ్ళు తిని వెళ్ళండి."

"సరే! మీరంతగా బాధపడితే ఏమంటాం?"

"ఏమంటానికి నే నూరుకుంటానా? ఒసే కమలా! కుంపటి అంటించి బంగాళాదుంపలు పడెయ్యి. పొయ్యి అంటించి ఎసరు పెట్టు. అరగంటకల్లా వంటకాదూ?" చుట్టాల ఎదుట హుందా పనులు పురమాయించే అత్తగార్ని చూస్తే కమలకి తగని కోపం వస్తుంది. "నేను పొయ్యిఅంటించను. వంటచెయ్యను.. పూళ్ళో వీధి కొక హొటలుంది. వాళ్ళని మర్యాదగా వెళ్లమనండి. కాఫీలుయిచ్చి జిడ్డు వదిలించుకున్నాం. చాలదూ?" అనగలిగే కమల - ఒక్కసారికూడా అనలేదు. కారణం - అత్తగారి అతిథి మర్యాదలకు భర్తగారు చేసే సమర్థన.

"ఇంటికి వచ్చినవాళ్ళని ఎలా పొమ్మంటాంలెద్దూ?" అంటాడు మధుమూర్తి.

"పొమ్మనటం కాదు. భోజనాల ప్రసక్తి తేకుండా వుండచ్చుగా? చూసి చూసి వాళ్లే వెళ్తారు,"

"వెళ్లకపోతే? భోజనాల సమయంలో అసలే హడావిడి పడాలి. అదిమాత్రం ఏం బావుంటుంది?"

"హడావిడి మాత్రం ఎందుకూ? భోజనాల టైంకి కూడా వాళ్ళు కదలనప్పుడు — 'మీరు మాట్లాడుకొంటూ కూర్చోండి. మేము భోంచేసి వస్తాం.' అని నిర్మొహమాటంగా అనేసి నేను కూర్చున్నప్పుడు అత్తయ్యా - ఆవిడ కూర్చున్నప్పుడు నేనూ — భోంచేసి రావాలి. అలా ఒకటి రెండుసార్లు జరిగితే గాని ఈ చుట్టాల బెడద తప్పదు."

"నువ్వు తేలిగ్గా చెప్పేశావుగానీ — అలా చెయ్యటం చాలా కష్టం. ఆ వివేకం వాళ్ళకే వుండాలి గానీ..."

"వివేకం నిజంగా లేకపోతే మనం నేర్పాలి. అన్నీ తెలిసివుండి కూడా అతి గడుసుతనంగా పని జరుపుకు పోదామని వచ్చే వాళ్ళ ఆటలు కట్టించాలి. యాభైలూ - అరవైలూ తగలేసి — కొనంతా తిరిగి - సినిమాలు చూసి షికార్లు చేస్తారు. తిళ్లకిమాత్రం మన యింటిమీదికి వచ్చి పడతారు. వాళ్లకి లేని బాగు మనకెందుకుండాలి? నెలనెలా మనం ఇలా అప్పులపాలై పోతోంటే ఏ చుట్టం వచ్చి రక్షిస్తాడు? అవ్తుల మాటా - కుటుంబంలో రక్తబంధువుల మాటా నేను చెప్పటంలేదు - ఏమో! నాకు మాత్రం అలాంటి మోమాటాలూ పిరికితనం వుండవు. నేనైతే తప్పకుండా అలాగే చేస్తాను." కమల కంఠశోష గాలిలో కలిసిపోతుంది. చివరికిఅంటాడుమూర్తి- "పోనిద్దూ? నీకెందుకా నిష్ఠూరం! పెద్దది వుందిగా? అమ్మకి యిష్టమైనట్టు చేస్కోనీ!"

"నిజమే. సంసారం మోసే మీకు లేనిబాధ నాకు మాత్రం ఎందుకు?"

ఎవరో బలవంతంగా చేయిస్తున్నట్టు - పొయ్యి అంటించి-కుంపటి వెలిగించి - రెండేసి పదార్థాలు చొప్పున చకాచకా వండి - వార్చి వడ్డించి - విస్తళ్ళు తీసి - అతిథుల్ని సాగనంపి ... సుదీర్ఘంగా నిట్టూరుస్తుంది కమల.

కొడుకు తెచ్చిపోస్తాడు. అప్పు చేస్తాడో సప్పుచేస్తాడో శేషమ్మకక్కర్లేదు.

కోడలు వండిపెడుతుంది - విసుక్కుంటుందో - తిట్టుకుంటుందో అసలే అక్కర్లేదు.

అతిథి మర్యాదలు జరిపి - "శేషమ్మగారూ! మీగుణం ... వెన్న

- పత్రికా ప్రతినిధి గంపెడు సంసారాన్ని ఈదే కుటుంబరావుని ఇలా ప్రశ్నించాడు : "ఏవండీ! వివాహం అవకముందేం చేసేవారు!

కుటుంబ్రావు : ఏం చెప్పమంటావు నాయనా! నాకేదిష్టమయితే అదే చేసేవాడిననుకో."

పూసలె-డి.' అన్న మెప్పులు పొంద కుండా ఎలా వుండటం ?

"అబ్బాయ్ ! వచ్చే శుక్రవారం మీ నాన్న పుట్టింరోజురా ! ఓ కట్టు పంచె - పైపంచె తీసుకురా ! ఎప్పుడూ కొత్తబట్టలు కట్టుకోటం ఆయనకి ఎంతకాలంగానో సాగుతోందా రివాజు. ఈ నాటి కెందుకు మానుకోవాలి ?" అందో సారి శేషమ్మ.

"అలాగేలే అమ్మా !" అన్నాడు మధుమూర్తి. నాలుగో రోజు జీతం అందింది. శెట్టి దుకాణంలో కాస్త పద్దు వెనక్కిపెట్టి తండ్రికి బట్టలూ, శెనగపిండీ — పంచదారా ఏవేవో తీసుకువచ్చాడు.

ఆ శుక్రవారం నలుగు రైదుగురు పేరంటాళ్ళని భోజనానికి పిలిచి — మిఠాయిలూ - పాయసాలూ చేసి - ఆర్భాటం చేసింది శేషమ్మ.


తిని లేచిన వాళ్ళు - ముసలాయన్ని పదేళ్లపాటు బ్రతకమనీ - శేషమ్మగారి తాడు గట్టిగా వ్రేళ్ళాడాలనీ - ప్రార్థించేసి - ఋణం తీర్చుకునే వెళ్ళారు.

మామ్మూలు సాదా పంచెతో, ముసలాయన ఆరోజు వెళ్లనిస్తే ఒచ్చే నష్టం ఏమిటి? సాధారణంగా బిడ్డలు చిన్నవాళ్లయినప్పుడు- తల్లిదండ్రులు తమ ఆనందం కోసం - బిడ్డణ్ణి పదిమందిచేతా ఆశీర్వదింప జెయ్యటం కోసం వున్నంతలో ఆ వేడుక జరుపుకుంటారు. తాహతు లేనప్పుడు అలాంటి వేడుకలు చెయ్యటంకూడా వివేకం కాదు.

పోతే బిడ్డ కష్టార్జితంతో వేడుకలు చేసుకు ఆనందించే తల్లిదండ్రుల అనురాగాన్ని ఏ కోణం నుంచి చూసినా సమర్థించలేక పోయింది కమల. భర్త నిస్సహాయస్థితికి మాత్రం నిట్టూర్చి వూరుకొంది.

• • •

(సశేషం)



సంధ్యావందన మహాత్మ్యం

బి.వి. రమణారావు

సినిమాకి బయలుదేరేటప్పటికి, తనూ సహగమనం చేస్తానంది మా ఆవిడ. కొత్త సినిమాకి చాలా రష్‌గా వుండికనక ఏదో చెత్త సినిమాకి వెడుతున్నాను, అందుచేత శిక్ష తప్పించమని ప్రాధేయపడ్డాను. ససేమిరా అంది. సరే, రా, అన్నాను.

బస్సు ఎక్కేం. బస్సు బయల్దేరే ముందు పరిగెత్తుకుంటూ వొచ్చి, రింగు పట్టుకుని ఒంటికాలు మీద నిలబడ్డ నన్ను ఢీకొట్టినంత పనిజేసిందో అమ్మాయి. మచ్చలేని సినిమా చంద్రబింబంలాంటి ఆ అమ్మాయి మొహంలోకి సూటిగా చూసేటప్పటికి కళ్ళు చీకట్లు కమ్మేయి. "నమస్కారమండి" అని ఆ అమ్మాయనగానే వొళ్ళు తిమ్మిరెక్కినట్టయింది. దూరంగా కూర్చున్న మా ఆవిడ చురుకూ చురుకూ, తారాజువ్వల్లాంటి రెండు చూపులు విసిరింది. కంగారులో ప్రతి నమస్కారం కూడా చెయ్యడం మరచిపోయేను.

దురదృష్టానికి కూడా హద్దూ పద్దూ వుండాలి. ఇలాంటి సంఘటన బస్సులోనే జరగాలా ! అందులోనూ మా ఆవిడ సమక్షంలో ! ఇంతలోకే మునిగి పోయినట్టు, కండక్టరాసురుడు, పెద్ద విప్లవవాదిలాగ, గొంతుకు చించుకుంటూ "ఆగేభడో, ఆగేభఢో" అంటూ ఆ అమ్మాయిని వెనక్కి, నన్ను ముందు గుంపులోకి నెట్టేశాడు. కాస్సేపటికి సీట్లు కాళీ అవగానే మా ఆవిడ పక్కన నేను కూర్చుంటే, గోరిచుట్టుమీద రోకలి పోటులాగ, ఆ అమ్మాయి పక్కన, మొహంమీద పడీ జుట్టూ, మెళ్లో గళ్ళ జేబురుమ్మాలూ, డ్రెయినేజ్ గొట్టాల ఫేషన్‌లో పంట్లాము, దువ్వెన్నలోంచి తీసి పారేసిన చిక్కుపడిన వెంట్రుకల డిజైన్‌తో బుష్‌షర్టూ, చేతులో ట్రాన్సిస్టర్ తోనూ ఓ పాతికేళ్ళ రౌడీ వెధవ కూర్చున్నాడు. వాడేమైనా వెర్రి వెర్రి వేషాలేస్తే, పేగులు తోడేద్దామనుకుని వెనక్కి తిరిగేను. వెధవ పోజూ వాడూను ! పక్కన మనిషే వున్నట్టు గమనించనట్టుగా ట్రాన్సిస్టర్‌ని కౌగలించుకుని బిగుసుకు పోయి కూర్చున్నాడు.

"ఏం ! వాడి పీకె పిసిగేస్తారా !" అంటూ పరామర్శించింది, మా ఆవిడ ఏం కర్ణ పిశాచం వుందో ఏమో !

'మనం వొచ్చి స్టాప్‌లో దిగి, ఎవరెస్ట్‌లో ఐస్క్రీం తిని వెళదాం' అన్నాను ధోరణి మార్దుదామన్న ఉద్దేశంతో.

'మీ విరహాగ్ని ఉపశమిస్తుందంటే, అలాగే చేద్దాం' అంది సానుభూతి ఉట్టిపడుతూ.

ఇంటర్వెల్‌లో రెండు సీట్లవతల, ఎవరో తెలుసున్న వాళ్ళుంటే అటు వెళ్ళింది మా ఆవిడ. నేను లేచి బయటకెళ్ళి సిగరెట్‌తో ఊపిరి పీల్చుకుందా మనుకుంటుంటే, నేల యీనినట్టు గబగబ వొచ్చి నా పక్క సీట్లో కూర్చుంది ఆ అమ్మాయి. సిగరెట్ మాట దేవుడెరుగును. నాకు శ్వాసే ఆగిపోయినంత పనయింది.

"ఇందాకా బస్సులో మీ పక్కన కూర్చోడం, తర్వాత ఒకే స్టాప్‌లో దిగడం చూసి ఆవిడ మీ మిసెస్సేమో అనుకున్నాను. మీ రొక్కరే వొచ్చేరన్నమాట! పని మీద బయల్దేరి మధ్యలో దిగిపోయేరేమో అనుకున్నాను, మొత్తంమీద మిమ్మల్ని మళ్ళీ పట్టుకున్నాను." అంది కళ్ళు చక్రాల్లా తిప్పుతూ. కంఠంమీద అడ్డంగా ముచ్చటగా మూడు సన్నని చారలున్నాయి. ఆమె పద్మినీ జాతి స్త్రీ అన డానికేమీ సందేహం లేదు. ఎటొచ్చీ ఢాకినిలాగ నన్ను వెంటాడుతోంది. గొంతు కూడా కోకిలస్వరం, ఎటొచ్చీ సంభాషణ అపస్వరం పలుకుతుంది. ఇంతకీ పరిస్థితి శ్రుతిమించకముందే, విషయం తుంప బద్దలు కొట్టినట్టు చెప్పేద్దామన్న ఉద్దేశంతో పెదిమలు తడిచేసుకునేలోగా, మా ఆవిడ లేచొచ్చి నా పక్కన కూర్చుంది. తడబడే మాటల్తో 'ఈవిడే మా ఆవిడ' అంటూ, అప్పటికే తనువెల్లా భాస్వరంలాగ మండిపోతున్న నా ముప్పాతికాంగిని పరిచయం చేశాను

'అదేమిటండీ. మీ రొక్కరే వొచ్చేరా అంటే, ఊఁ అన్నారు, ఈవిడ మీ మిసెస్సా అంటే కాదన్నారు. మంచి తమాషా అయినవారే!' అంది నా కళ్ళు తిరిగేలాగ తన కళ్ళు తిప్పుతూ. నా నోరు పెగలకపోతే, తను ఊహించినవాటికన్నీ నేనా బాధ్యుణ్ణి?

"ఆయనకిలాంటి విషయాల్లో వొళ్ళూపై తెలీదు, అసలే మతిమరుపు మనిషి కూడాను. ఆయనకి పెళ్ళి కూడా అవలేదని చెప్పేరా? చెప్పేవుంటారు" అంది మా ఆవిడ.

'అబ్బెబ్బె! ఆయనకి పెళ్ళయిందని నాకు తెలుసండి."

"ఓహో! నీ కలాంటి పట్టింపు లేదన్నమాట. ఏమిటమ్మా నీ పేరు?"

'సంధ్య."

'బాగుందమ్మా. ముచ్చటైన పేరు. ఇంతకీ నీకు ఈయనతో...' సమయానికి లైట్లారిపోయాయి. ఆట మొదలవుతుంది. మా ఆవిడ నోటికడ్డంగా నా జేబురుమ్మాలదిమి పెట్టి "చూడు. మిస్ సంధ్యా, యీ సీట్లో ఇందాక కూర్చున్నాయి



నడుగో వస్తున్నాడు. వెళ్ళి నీ సీట్లో కూర్చో' అన్నాను, అడ్డంగా కోత కోస్తూ.

'రేపొద్దున్నే మీ యింటి కొస్తానండి' అంది సంధ్య సవినయంగా.

'మా యిల్లుకూడా తెలుసునా!' అడిగింది మా ఆవిడ, నా చెయ్యి తప్పించుకుంటూ.

'తెలుసండి' అంది లేస్తూ.

'నువ్వెందుకూ రావడం. మీ తాలూకు వాళ్ళెవరూ లేరూ?' అంటుంటే మా ఆవిడ మాటలు వడఘాళుపులాగ నా మొహానికి తగిలేయి.

'మా అన్నయ్యున్నాడండి' అంది, ఆ అమ్మాయి మృదుమధుర కంఠంతో వెన్నెల జల్లులాగ.

'నా బంగారు తల్లే! రేపోసారి నన్ను కలుసుకోమని చెప్పమ్మా!' అన్నప్పుడు మా ఆవిడ కళ్ళు, ఆ చీకట్లో, డేంజర్ లైట్లులాగ మెరిసిపోయాయి.

'అలాగేనండి. శలవు' అంటూ మెరుపు తీగలాగ మాయమయ్యింది, నన్ను మా ఆవిడ కోపాంధకారంలో దిగవిడిచి.

ఆ అమ్మాయి వెళ్ళిపోయాక, సినిమాలో అడవిలన్‌లాగ మా ఆవిడ నా వైపు తిరిగి ఓ విషపు నవ్వు విసిరింది. సినిమా, మళ్ళీ మొదలయిందన్నమాటేకాని, యన్టీ రామారావూ సావిత్రీ ఓ లాగే కనబడుతున్నారు. మా ఆవిడ విషపు నగుమోము మేఘాకృతిలో నా మనస్సునావరించిందేమో కథ కూడా మరిచిపోయాను. అదే సమయానికి 'నే నింటికి పోతున్నా'నంటూ మా ఆవిడ లేచింది. టపటపటప నా ఎడం కన్నదిరింది. 'సినిమా అయ్యేక వెడదాం' అన్నాను, చెయ్యి పట్టుకుని బలవంతంగా కూర్చోపెడుతూ

'ఏమేమవ్వాలో అవన్నీ అయ్యేక, యిల్లు జ్ఞాపకమొచ్చినప్పుడే రండి. చూసిన సినిమా చాలు' అంటూ నా చెయ్యి విదిలించుకు లేచింది. అదే సమయానికి, రెండువరస లవతల్నించి ధామ్మని తుమ్మేడో అపశకునపక్షి. బయటకొస్తూ వాడికేసి పరకాయించి చూశాను. వాడిందాకటి డ్రెయినేజ్ ... మెళ్ళో గళ్ళరుమ్మా ... ట్రాన్సిస్టర్ ... వెంట్రుక ... గాడు. ఆ అమ్మాయీ, వీడూ కలిసి ఈ నాటక మాడుతున్నారా అన్న అనుమానం కలిగింది. ఇలా ఓ ఆడదీ మొగాడూ కలిసి పచ్చటి సంసారాల్లో చిచ్చుపెట్టే వృత్తిని చాలా సినిమాల్లోనూ నవలల్లోనూ ప్రోత్సహించడం చూస్తున్నాం. ఈ రౌడీ వెధవ నేను లేకుండా చూసి యింట్లో జొరబడి మా ఆవిణ్ణిమీ అల్లరిపెట్టి డబ్బు గుంజుకోడు కదా! ఇలా మనస్సు పరిపరి విధాల పోతుంటే, యాంత్రికంగా మా ఆవిడ వెనకాలే బస్సు ఎక్కుతూ, దిగుతూ, అడుగుల్లో అడుగు లేసుకుంటూ ఇల్లు చేరేను.

ఇంటికెళ్ళేక, ద్విగుణీకృత నూతనోత్సాహంతో, కజ్జాకి కాలు దువ్వడం ప్రారంభించింది, మా ఆవిడ.

'సినీమాకి రావద్దంటే ఏమిటో అనుకున్నాను, కూడా రాబట్టి మీ రంగు బయటపడింది. ఈ నాటకం ఎన్నాళ్ళనుంచి జరుగుతోందో!' అంటూ నాంది ప్రస్తావన చేసింది.

'మాటి మాటికి అమాటే అనొద్దంటు. ఆ అమ్మా యెవరో నాకు తెలీదు.'

'అవును, పాపం! ఏమీ తెలీదు. మిమ్మల్ని తొలిచూపులో నే ప్రేమించి వెంటపడింది ... ఎవరో చెప్పండా అమ్మాయి?'

'ఆ అమ్మాయెవరో నాకునిజంగా తెలీదు.'

'ప్చ్..ప్చ్. తెలియకేంగాని. మరిచిపోయుంటారు. జ్ఞాపకం వుండివుండదు. ఇలాంటి వ్యాపకాలెన్నాళ్ళబట్టి ఎన్నున్నాయోమరి.'

'ఆ అమ్మాయి ఎవర్ని చూసి ఎవరనుకుందో!'

'మనిషిని పోలిన మనుషులుండటం విన్నానుకాని, ఫలానా రోజున, ఫలానా యింట్లోంచి ఫలానా బస్సెక్కి ఫలానా సినిమా కెళ్ళే ఒకేరకం యిద్దరు మనుషులుంటారని వినడం యిదే మొదటి సారి.'

'చూడు. నిజంగా ఆ అమ్మాయితో సినిమా కెళ్ళాలనుకుంటే, నిన్నుకూడా తీసుకెళ్ళి వాణ్ణా!'

'ఆ మాత్రం మీకు తెలియదని కాదు. అ ప్రయత్నమూ చేశారు. నేను ఒద్దన్నా వెంటబడ్డాను.'

'పోనీ, నేను కూడా మానెయ్యచ్చుగా, యీ గొడవంతా లేకుండా ...'

'అదేం కట్టుకున్న భార్య కనకనా వస్తానని మానెస్తే పూరుకోడానికి!

● బెర్నార్డ్‌షా రాసిన 'పిగ్మాలియన్' నాటకం ప్రదర్శించారు. విజయవంతమైంది. నాటకమైపోయింతర్వాత ప్రేక్షకులు రచయిత తను స్టేజిమీదికి రమ్మని చూడాలని కోరారు. షా స్టేజిమీదికి వచ్చి ప్రేక్షకుల అభివాదాలను సవినయంగా స్వీకరించాడు. ఇంతలో వెనక గ్యాలరీనుంచి ఒకడు హేళనగా 'బూ, బూ' అని అరిచాడు.

షా ఆశబ్దం వచ్చినవేపు చూస్తూ 'నీ విమర్శతో నే నేకీభవిస్తున్నాను. కాని ఇంతమంది ముందు మనిద్దరిమాట నెగ్గుతుందా?'

ప్రియురాలుకదా! మీకు మాత్రం ప్రాణం పీకదూ!"

"ఈ విషయంలో నీ కున్న అనుభవం నాకు లేదు. ఎలాగైనా ప్రేమంటే ఏమిటో చవిచూసిన దానివి ఆ జగన్నాధరావు నిన్ను పెళ్ళాడ ననగానే నెల్లాళ్ళు మంచం ఎక్కేవు."

"అవన్నీ పెళ్ళికాని క్రితం. పెళ్ళయ్యేక ఆత్మగౌరవం వున్నవాళ్ళెవరూ యిలా ప్రవర్తించరు. అసలు మిమ్మల్ననేం లాభం! ఆ అమ్మాయికి బుద్ధుండాలి. ఏమిటో! మీ లాంటి వాళ్ళను కూడా ఆడాళ్ళు ప్రేమిస్తారన్న విషయం వూహించలేకపోయాను."

"నాలాంటి వాళ్ళంటే! ఏం! నాకేం తక్కువ! ఆడది ప్రేమించాలంటే, మొగాడు జగన్నాధరావు లాగుండాలేమో!"

"మీ దగుల్బాజీ వ్యవహారాల్లో అతని పేరు తీసుగొచ్చి అపవిత్రం చెయ్యకండి."

"నిన్ను ప్రేమించి మరొకర్తిని పెళ్ళాడ్డంలోనే కనబడుతుంది, అతని పవిత్రత."

"వంకలేనమ్మ డొంకట్టు కేడ్చిందట! అలా వుంది మీ వరస. మీ బండారం బయట పడిందికదా అన్న ఉక్రోషంతో, ఏవో కల్లబొల్లి కథలల్లి నా నోరు నొక్కుదామని చూస్తున్నారేమో! అసలు మీరిలాంటి మనిషని తెలుస్తే..."

"ఊఁ... తెలుస్తే! ఏం చేసే దానివి! నన్ను పెళ్ళాడ్డం మానేసి, ఆ జగన్నాధరావును తల్చుకుంటూ, ఆజన్మ బ్రహ్మచారిణిగా వుండిపోదువేమో! ఇప్పుడైతేనేం! నన్నొది లేసి..."

"ఇదన్నమాట మీ మనస్సులో కోరిక! నన్నొదుల్చుకో దలుచుకుంటే... యింతకంటె, మంచిమార్గం లేదూ..." అంది అమృతాంజనం డబ్బా అందుకుంటూ.

మహాప్రభో! భగవంతుడా! ఈ స్త్రీని ఈ భూమ్మీద ఎందుకు సృష్టించేవు; మొగ మానవుడిమీద నీకెందుకింత నిర్దయ! ఇవ్వాళ జరిగిన ఈ సంఘటనలో, మనసా, వాచా, కర్మణా, నా దోష మేమైనా వుంటే నన్ను తుపాకితో కాల్చెయ్యి. అంతేకాని నన్నిలా చిత్రవధ చెయ్యకు... అనుకుంటూ పుట్టెడు దుఃఖంతో 'లేజీఛైర్'లో కూలబడ్డాను. ఇంతలోకే రేడియోలో రంగవల్లి స్త్రీల కార్యక్రమం బుసకొడుతూ వినబడుతోంది. అఖిలభారత కళాకారిణుల సమావేశంలో, అంతర్జాతీయ మహిళోద్ధారణోద్యమ సంఘాధ్యక్షురాలైన శ్రీమతి (పేరు జ్ఞాపకంలెదు) గారు, నేటి జాతీయ అత్యవసర పరిస్థితిలో వనితల కర్తవ్యాన్ని గురించి ఉద్ఘాటించిన చిట్కాలూ, తర్వాత భర్తల దౌర్జన్యాలూ భార్యల దౌర్భాగ్యాలూ అనే అంశంమీద ఒక కన్నీటి కథనం, తదుపరి పిల్లల్ని కనడానికి వాళ్ళని పెంచడానికి సులభ మార్గాలూ, పిమ్మట అరటికాయితో అప్పడాలూ, వంకాయితో వొడియాలూ, బీరకాయితో వొరుగులూ చేసే విధానం, అటుపైన జాతీయ పొదుపు వుద్యమం, పాత బట్టలూ, స్టెయిన్లెస్‌స్టీల్ పాత్రలలో స్త్రీల పాత్రలపై ఒక లఘు ఉపన్యాసం, ఆఖరున మంగళం. అది వింటుంటే వొళ్ళంతా ఏవో పొగలూ అవిర్లూ వొస్తున్నట్టు కనబడి చల్లగాలికోసం బయటికి పోయాను.

• • •

అత్తారంటూ వుండటం మంచిది కాదనను కాని, దగ్గిరగా వుండటం దురదృష్టం. ఇంక మరీ మాకులాగ, మేము హైద్రాబాద్‌లో వుంటే అత్తారు సికింద్రాబాద్‌లో వుంటూ, ఫోన్ ఎత్తేటప్పటికి, పాత గ్రామఫోన్ రికార్డ్ లాగ, అమ్మాయి నామ సంకీర్తనా పారాయణం వినబడటం దుర్భరం! ఘోరం! కారణమేమిటంటే, ధాతీ విరుచుకు తిరిగే యీ మొగుడనే వాడికి వ్యక్తిగత స్వాతంత్ర్యంఅంతరిస్తుంది. అనుక్షణం వాడి వెనకాలే అత్తమామల దివ్య దృష్టి వెంటాడుతూ వుంటుంది. 'ఏమిటోయ్, ఈ మధ్య రాత్రిళ్ళు మరీ ఆలస్యంగా వొస్తున్నావుట యింటికి!" అనే మామగారి మృదువైన మందలింపో, 'బాబూ! మరీ అర్ధరాత్రి వరకూ తీరని పనులున్న రోజున అమ్మాయి నిక్కడ దిగబెట్టి వెడుతూ వుండు. అసలే దానికి భయం," అనే అత్తగారి సన్నాయి నొక్కో, 'ఏమిటి బావగారు! మొన్ననో స్నేహితుడితో 'లిడో'లో విస్కీ తీసుకుంటూ కనబడ్డారుట! నిన్న సాయంత్రం 'క్వాలిటీ'లో బ్రాందీ ఆనంద తన్మయత్వంలో దర్శన మిచ్చేరుట! ఇవ్వాళ ఎక్కడ మధుపాన వేదపారాయణా కాల

• అటవీ మార్గ మధ్యంలో నున్న ఒక రైల్వేస్టేషన్ మాష్టారు చీటికి మాటికి అనవసరంగా చాంతాడంత టెలిగ్రాములు పంపటంచూసి, పై అధికారి మరీ అత్యంత అవసర పరిస్థితుల్లోగాని అదైనా చాలా క్లుప్తంగా టెలిగ్రాం ఇవ్వాలని ఆదేశించాడు.

ఒక రోజు పెద్దపులొకటి స్టేషన్ ప్రాంతాలకి రావటం చూసి సిబ్బందంతా మాష్టారి గదిలో తలుపులు బిడాయించుకొన్నారు. అందులో ఒక కూలీ లేకపోవటం కనిపెట్టారు. కూలీని పులినోట కరుచుకెళ్ళటం వాళ్ళకి కనబడింది. స్టేషన్ మాష్టరు వెంటనే పై అధికారికి టెలిగ్రాం ఇలా ఇచ్చాడు. "పులి కూలీని నోటకరుచుకు పోతోంది. ఏం చెయ్యాలో ఉత్తర్వులు జారీ చెయ్యండి" అని.

క్షేపం!" అనే బావమరిది పరామర్శో టెలిఫోన్‌లో మధ్య మధ్య వినబడటం తథ్యం.

ఇంతకీ అసలు విషయ మేమిటంటే, పొద్దున్నే టెలిఫోన్‌లో మా బావ గొంతు వినబడగానే ఇదేదో ప్రళయానికి ఉపోద్ఘాతంగా గ్రహించేను. ఎంచేతంటే, నిన్నటి సంఘటన సందర్భంలో, నిన్నరాత్రి, మా అత్తారికి మా ఆవిడకి మధ్య టెలిఫోన్ రాయబారం జరిగిందన్న మాట.

'గుడ్‌మార్నింగ్! బావగారూ! ఈ మధ్య చాలా 'బిజీ'గా వుంటున్నట్టున్నారు. బొత్తిగా దర్శనాల్లేవు!' అంది మా బావమరిది గొంతు.

'ఏం! బెంగెట్టుకున్నావా! చెప్పు. నెల్లాళ్ళపాటు మీ యింట్లో వుండి వెడతాం.'

'ఆఁ... నిజంగా వొచ్చే వాళ్ళకేనా చెల్లదు. మా సిస్టర్ కులాసాగా వుందా?'

'ఉండు. చూసి చెప్తా.' అంటూ సీవర్ కింద పెట్టబోతూంటేరి మా బావమరిది గిలగిలారావం వినబడింది.

'ఏమిటి పొద్దున్నే నీ ఆర్తనాదం!' అన్నాను.

'నీతో మాట్లాడాలి.'

'సరే. మాట్లాడు.'

'రహస్యంగా మాట్లాడాలి. చాలా ముఖ్యమయిన విషయం'

'ఎవరికి ముఖ్యం?' అడిగేను.

'నీకూ, నాకూ, మనందరికీ సంబంధించిన విషయం.'

'నాకు సంబంధించినంత వరకూ నీతో మాట్లాడే ముఖ్య విషయాలేమీ లేవు. మీ చెల్లెలితో మాట్లాడు. వుండు పిలుస్తా.'

'బావా! బావా! నీకు పుణ్యం వుంటుంది. రిసీవర్ దించెయ్యకు. నీతో మాట్లాడాలి. ఇది నా జీవితానికే ఓ పరీక్ష.'

'ఏమిటి! నాతో మాట్లాడటమా!'

'మాట్లాడే విషయం.'

'అంత ముఖ్యమైన విషయంలో నేను నీకు యిచ్చే సలహా ఏముం

- ప్లాట్‌ఫామ్ మీదకి బోల్డు సామానుతో వచ్చిన భర్త రైలు అప్పుడే బయల్దేరి వెళ్ళిపోతూండటం చూసి నిట్టూరుస్తూ, భార్యతో 'చూశావా! ఇదంతా నువ్వు ఒక పట్టాన తెమలకపోవడం వల్లే జరిగింది. లేకపోతే మనకి రైలు అందుండేది' అన్నాడు.

  భార్య : ఇదీ మరీ బావుంది! మీరు అంత తొందర పెట్టకుండా వుంటే ఇంకో రైలుకోసం ఇంతసేపు ఉండుండక్కరలేదు.

తుంది! మీ నాన్నగారితో మాట్లాడు.'

'అబ్బెబ్బె! ఆయనతో మాట్లాడే దేమీ లేదు నీ తోనే మాట్లాడాలి. ఆ మాటకొస్తే, ఆయన చెబితేనే, నీతో మాట్లాడుతున్నాను.'

'అయితే మనిద్దరం ఓ షరతు పెట్టుకుందాం' అన్నాను.

'ఓ. యస్. చెప్పు.'

'చూడూ! నా అంతరంగిక విషయాల్లో ఇతరులు కలగజేసు కోడం నాకు నచ్చదు. నా బాగోగులు నాకు తెలుసు. ఒకళ్ళు చెప్పినా వినను.'

'అవునట. రాజ్యం (మా ఆవిడ) చాలాసార్లు చెప్పింది.'

'మీ సిస్టర్‌కి తెలిసిన విషయాలే చెప్పి వుంటుంది. మీ సిస్టర్, ఉరఫ్ మా ఆవిడకి తెలియని ,విషయాలు చాలా ఉన్నాయి.'

'వుంటాయి మరి. మొగాడన్న తర్వాత...'

'కరెక్ట్. జీవితాన్ని విశాల దృష్టితో చూసే వాడికి ప్రపంచ మంతా సహజంగానూ సమంజసం గానూ కనబడుతుంది.'

'నీ విశాల హృదయం గురించి వివరాలు తర్వాత వింటాను. ముందు షరతు సంగతి చెప్పు'

'అదే చెబుతున్నా. మనం ఒకళ్ళ కొకళ్ళు చెప్పుకునే రహస్యాలు ప్రాణం పోయినా ఇంకొకళ్ళకి చెప్పకూడదు. ఎవరైనా సరే. ఏం!' అన్నాను ముందరి కాళ్ళకి బంధం వేసే ధోరణిలో.

'అః! అంత పెద్ద, రహస్యా లేముంటాయితే!'

'నా విషయం నేను చెబుతున్నాను. రహస్యాలు బయటపడ్డం వల్ల ఎన్నో సంసారాలు నాశనమవుతున్నాయి. రహస్యాలు రహస్యాలుగానే వుండిపోతే అలాంటి ప్రమాదం జరగదు. ఏమంటావు!'

'నీ మాటలు వింటుంటే చమటలు పడుతున్నాయి. అయితే సాయంత్రం అరుగంటలకల్లా 'ఒయాసిస్' లో కల్సుకుందాం. ఏమంటావ్?'

'నీ యిష్టం. మరి నాకు 'స్కాచ్ విస్కీ' తప్పపడటం లేదు' అన్నాను గుమ్మంలో నిలబడి కర్ణానందంగా వింటున్న మా ఆవిణ్ణి చూడనట్టు నటిస్తూ.

'అంత గట్టిగా అనకు. రాజ్యానికి వినపడగలదు.' అన్నాడు.


ఓ సారి గంభీరంగా మా ఆవిడ మొహంలో దైన్యంకేసి చూసి, మనస్సులో నే మీసం మెలేసుకున్నాను, 'నాలాంటి మొగాళ్ళను కూడా ఆడాళ్ళు ప్రేమిస్తారని ఊహించలేక పోయిందిట! ఈ దెబ్బతో ఓ పాఠం నేర్పుతాను. కాళ్ళబేరాని కొచ్చేలాగ చేస్తాను' అనుకున్నాను, రాబోవు దృశ్యం నా మనో నేత్రాలతో తిలకిస్తూ.

● ● ●

సాయంత్రం, మాట ప్రకారం మా బావని 'ఒయాసిస్'లో కల్సుకున్నాను. నే ధరించవలసిన పాత్ర అప్పటికే నాలుగుసార్లు రిహార్సల్ వేసుకున్నాను. ఎంచేతంటే మా బావ అడగబోయే ప్రశ్నలు నే నూహించలేనివి కావు. నిన్నటి సంఘటన గురించి మా ఆవిడ ద్వారా విన్న తర్వాత జరిగిన వాళ్ళ కుటుంబ సమావేశంలో వాదోపవాదాలు జరిగివుంటాయి. తత్ఫలితంగా మా అత్త మామల సలహా ననుసరించి, సామ దాన భేద దండోపాయాలతో నన్ను పునరుద్ధరించడానికి మా బావమరిదిగా ఏర్పాటు చేసిన మహత్తర సమావేశమిది అయి వుంటుం దనుకోడానికి సందేహమేది!

కాస్సేపు కుశల ప్రశ్నలూ, అటు పైన అ మాటా ఈ మాటా అయిన తర్వాత కదనరంగంలో ప్రవేశిస్తూ మా బావమరిది పెద్ద డిటెక్టివ్‌లాగ మొహం పెట్టి సుదీర్ఘమైన ఓ సిగరెట్ దమ్ములాగి, డైరీలోంచి జాగ్రత్తగా ఓ ఫోటో బయటికి తీసి బోర్లించి నావైపు నెట్టి 'ఈ ఫోటో చూడు' అన్నాడు నా మొహంలోకి పరీక్షగా చూస్తూ. ఫోటో చూశాను. అది నిన్నటి సద్యఫోటో. వెంటనే నా మొహం నల్లబడిపోయి వాడికి చేతుల్తో అతని చేతులు పట్టుకుని బొంగురుపోయిన గొంతుతో 'క్షమించు బావా!' అంటా ననుకున్నట్టున్నాడు.

నేను కూడా ఊపిరితిత్తుల్ని నాభి వరకూ సాచి ఓ బ్రహ్మాండమైన



సిగరెట్ దమ్ములాగి నోటమ్మటా ముక్కమ్మటా పొగలు కురిపిస్తూ అన్నాను.

"ఆల్ రైట్. ఈ విషయం నీకూ తెలిసి పోయి దన్నమాట! ఇంక భయమెందుకూ! నిజం చెప్పేస్తాను. నేనూ ఆ అమ్మాయీ ప్రేమించుకున్నాం."

"బావా!" అన్నాడు గద్గదంగా, నా ఆగ్నేయాస్త్రానికి కుదేలయ్యి.

"ఇష్! అంత గట్టిగా అరవకు. ఇది పదిమందీ వచ్చేచోటు. అంత ఆవేశం పనికిరాదు. మానవ జీవితంలో ఇలాంటి సంఘటనలు సామాన్యం. సంవత్సరంనుంచీ ఎవరికంటా పడకుండా కాలక్షేపం చేశాం. నాకు పెళ్ళయిందని ఆ అమ్మాయికి తెలుసు. ఆ అమ్మాయిని పెళ్ళాడటం అసంభవమని నాకూ తెలుసు. అయినప్పటికీ బలవత్తరమైన ప్రేమబంధంఅలాంటిది."

"ఆ అమ్మా యెవరో తెలుసా?"

"సంధ్య. చక్కటి రూపం, రూపానికి తగ్గగుణం. నవనీతం లాంటి హృదయం."

"బావా!" మళ్ళీ ఆర్తనాదం.

"ఓయ్!"

"నిజంగా నువ్వూ ఆ అమ్మాయి ప్రేమించుకున్నారా! ఆ అమ్మాయి నిన్ను ప్రేమించిందా!"

ఈ ప్రశ్న సరిగ్గా వీడి చెల్లెలి ధోరణిలోనే ఉంది. నే నా అమ్మాయిని ప్రేమించడంకంటే, ఆ అమ్మాయి నన్ను ప్రేమించడం చాలా ఆశ్చర్యంగా వున్నట్టుంది వీళ్ళకు. ఏ ఆడదీ నన్ను ప్రేమించదని ఏమిటో వీళ్ళ ధీమా!" మీలాంటి వాళ్ళను కూడా ఆడాళ్ళు ప్రేమిస్తారని ఊహించలేకపోయాను"...ట!

"ఏం! ఆ అమ్మాయి నన్ను ప్రేమించడం ప్రకృతి విరుద్ధంగా తోచిందా!"

"ఎంతమంది హృదయాల్లో చిచ్చుపెడుతున్నావో తెలుసా!"

"రెండూ + రెండు. నీ హృదయంతో వెరసి ఐదు."

"ఆ అమ్మాయి భవిష్యత్తును గురించి ఆలోచించావా!"

"ప్రేమన్నది రెండు హృదయాలకి సంబంధించిన అనుబంధం. వ్యాపారం కాదు. లాభనష్టాలాలోచించడానికి. అయినప్పటికీ ఆ అమ్మాయి భవితవ్యంగురించీ కర్తవ్యం గురించీ సలహాలిస్తూనే వున్నాను. ఈ అనుభవంతో మరో బుద్ధిమంతుడయిన యువకుణ్ణెవణ్ణయినా ప్రేమించి పెళ్ళాడి సుఖపడమన్నాను. ప్రయత్నిస్తానని ఒప్పుకుంది. ఏమయినా కొంచెం టయిమ్ పట్టే వ్యవహారంకదా!"

"నువ్వింత రాక్షసుడివనుకోలేదు. ఇటు మా చెల్లెలిజీవితం..."

"మూడు బావా! నీకు ముందరే చెప్పేను, రహస్యం రహస్యంగానే వుంచాలని. ఇప్పుడు మీ చెల్లెలికొచ్చిన లోటేమిటి! ఎటొచ్చీ తెలుస్తే బాధపడుతుంది. తెలియకుండా వుంచుదాం. అథవా తెలిసినా మొదట్లోవున్న దుఃఖం రాను రాను అలవాటయిపోయి అంత ఉధృతంగా వుండదు. ఈలోగా నాకే పశ్చాత్తాపం రావచ్చు." అన్నాను తాపీగా.

"కథ యింతవరకూ వొచ్చిందన్నమాట! ఉండు. ఆ సంధ్యని రేపు నీ యింటికీడ్చుకొచ్చి..."

"ఆగు. అలాంటి వెర్రి వెర్రి వేషాలేశావంటే కథ చాలా దూరం వెడుతుంది. పొద్దున్న నా షరతు ఒప్పుగున్న మీదటే ఈ రహస్యం బయటపెట్టేను. ఆ మాటకొస్తే, మా ఆవిడ పెళ్ళికాని క్రితం జగన్నాధరావుని ప్రేమించిందిట. తర్వాత నన్ను పెళ్ళాడింది. జగన్నాధరావు మరో అమ్మాయిని పెళ్ళాడేడు. ఇప్పుడింకా మా ఆవిడా జగన్నాధరావూ ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నారో లేదో నాకేం తెలుసు! తెలుసుకోవాలని ఎప్పుడూ ప్రయత్నమైనా చెయ్యలేదు. ఎప్పుడైనా ఆ మాటెత్తేనా?"

"ఇప్పుడెత్తేవుగా! హుఁ. నువ్వూహించినంత నీచ సంబంధమేమీలేదు వాళ్ళిద్దరి మధ్యా. చిన్నప్పట్నుంచీ నేనూ జగన్నాధరావూ క్లాస్‌మేట్సూ ప్రాణ స్నేహితులమూను మా పెద్దలకీ వాళ్ళ పెద్దలకీ మధ్య వాళ్ళ పెళ్ళి మాటలు జరిగేయి. నిజమే. అయితే అతను పరిస్థితుల ప్రభావంవల్ల ఓ దిక్కులేని వితంతువుని పెళ్ళి చేసుకున్నాడు. అతను స్వార్థత్యాగి, ఆత్మాభిమాని. అందుకే నేనూ రాజ్యం కూడా అతన్ని ఓ ఆదర్శ పురుషునిగా ఆరాధిస్తాం."

"అంచేతనే ప్రేమ గుడ్డిదన్నారు. కష్టపడి మా ఆవిణ్ణి ప్రేమించి, చివరకి మరొకర్తిని కట్టుకున్నాడు. అలాగే నేనొకర్తిని పెళ్ళాడి మరొకర్తిని ప్రేమిస్తున్నాను. అందుకే యిలాంటి వ్యవహారాలలో మంచి చెడ్డలు విమర్శించకుంటంటే ఇది

- ఒక స్నేహితుడు మరొకడితో తన భార్యతో సంసారంలో ఇంకొంచెం పొదుపు ఆచరించమని ఖచ్చితంగా చెప్పెయ్యదలచుకున్నానని చెప్పాడు.

వారంరోజులు తరవాత ఇద్దరూ కలుసుకోవటం తటస్థించింది. మొదటివాడు దిగులుగా వుండటంచూసి "ఏమయ్యా చెప్పావా మీ ఆవిడతో? ఏమయింది?"

"ఏమవడమేమిటి! చెప్పిన రెండో రోజునుంచే నేను సిగరెట్టు మానేశాను. ఆఖరికి ఆఫీసుక్కూడా నడిచే వెడుతున్నాను."

మానవనైజం అని సరిపెట్టుకోడం మంచిది."

"ఇప్పుడు నా కర్థమయింది నీ ప్రేమలో అంతర్యం. నీకు జగన్నాథ రావంటే ఉన్న ద్వేషంతో అతని చెల్లెలి జీవితం నాశనం చేసి పగ దీర్చుకో దలుచుకున్నా వన్నమాట! ఛీ. ఎవరు క్షమించినా భగవంతుడు నిన్ను క్షమించడు" అంటూ శపించి, నే నింకా మూర్ఛ తేరక మునుపే, బిల్లు మాటకూడా ఎత్తకుండా చకచక నడిచి పోయేడు.

ఇంటి కొచ్చేస్తుంటే ఆలోచించేను. మాటమీద మాటొచ్చి ఇంత గొడవ చేశాను కాని, ఈ అమ్మాయి నా గర్భశత్రువు చెల్లెలని నాకేం తెలుసు! అసలా జగన్నాథ రావో పొగరుబోతు. కాలేజ్‌లో చదువుకునే రోజుల్లో వీడో పెద్ద రొమాంటిక్ హీరో అని పేరు. కాస్తో కూస్తో వీడిని ప్రేమించని ఆడది లేదని ప్రతీతి. వీడో సంఘ సంస్కర్తనీ, దేశాన్నుద్ధరించడానికే పుట్టాడనీ, ముందు ముందు నెహ్రూ అంతటి వాడవుతాడనీ వాదించే వాళ్ళు లేకపోలేదు. అసలు మరో సంగతేమిటంటే.. నేను ఫైనలియరు చదువుకునే రోజుల్లో ఓసారి నా గదిలో చొరబడి 'మాడు మిస్టర్! మీ వాళ్ళు, పదివేల కట్నం యిస్తే నీకు మా చెల్లెల్నిచ్చి పెళ్ళి చెయ్యడాని కొప్పుగుంటా నన్నారుట, జైలుకెళ్ళే సరదాతో వాళ్ళలా అన్నారేమో తెలీదుకాని కట్నం యిచ్చి మొగుణ్ణి కొనుక్కునే దుస్థితికి మా చెల్లెలింకా దిగజార లేదు' అంటూ కళ్ళురిమి చక్కా బోయేడు. జగన్నాథరావు మా అవిణ్ణి కాదని మరొకర్తిని కట్టుకున్న తర్వాత, మావాళ్ళూ మా అత్తారూ కూడా, మా పెళ్ళిలో ఈ జగన్నాథ రావుని ఐక్యకంఠంతో తిడుతూ మీ కెంత గండం గడిచిందని ఒకళ్ళ నొకళ్ళు పరామర్శించుకున్నారు.

మా పెళ్ళయిన తర్వాత, మాటల సందర్భంలో మా ఆవిడ అతని గుణగణాన్ని పొగుడుతూ పరవశమయినప్పుడల్లా నాకు అరికాలిమంట తలకెక్కేది. అంత అసహ్యించుకోవల్సిన దుర్గుణాలతనిలో వున్నాయని కాకపోయినా. అసలు కారణం నాలో దాగివున్న అసూయనుకుంటాను మా ఆవిడ సౌశీల్యంలో నాకు పరిపూర్ణ విశ్వాసమున్నా, అతన్ని ప్రేమించినంత గాఢంగా నన్నూ ప్రేమిస్తుందా అన్న సందేహం నన్నెన్నోసార్లు కలతబెట్టింది.

నేనిల్లు చేరేటప్పటికి మా సమావేశం తాలూకు వివరాలు తన కవితా మాధుర్యంతో రంగరించి, మా బావ ఫోన్‌లోంచి మా ఆవిడ చెవిలోకి నూరిపోసి వుంటాడు. అది నేపాళమాత్రలాగ పనిచేసి, నేను వెళ్ళగానె మా ఆవిడ సింహగర్జన చేస్తూ నా మీద రణరంగంలోకి లంఘిస్తుందా లేకపోతే నల్లమందు లాగ పనిచేసి బిక్క ముఖారవిందంతో ముక్కుపుటా లెగరేసుకుంటూ, కిక్కురుమనకుండా, తన అక్కసునంతా దిగమింగ 'గ్యాస్ సిలిండర్' లాగ టెన్షన్‌లో వుంటుందా! చక్కటి చుక్క లాంటి సంధ్య నన్ను ప్రేమించిందని విని ఎంత అసూయ పడుతుందో! తనేదో అందగత్తెనని కాకపోతే, నన్నే ఆడదీ ప్రేమించ దనుకుంటుందా!

ఇంతకీ అసలు ప్రమాద మేమిటంటే మా ఆవిణ్ణి పెళ్ళాడ లేదని కోపం లేదు సరికదా, మా బావమరిదాధముడికి జగన్నాథ రావంటే చచ్చేటంత ప్రేమ. ఇప్పుడు వీడెళ్ళి ఆ జగన్నాథరావుతో 'మీ చెల్లెలి నడతేం బాగాలేదు. ఒళ్ళు దగ్గిర పెట్టుకుని బతకమను' అంటూ వుచిత సలహా యిచ్చేడా, వాడసలే రౌడీ! లాంగ్‌జంపులు చేసుకుంటూ ఎకాయెకీని మా యింటి కరుదెంచి నా కాలరు పట్టుకుని ఉచిత రీతిని రెండుతుకులుతుకి సత్కరించావచ్చు. అసలు వారఫలాల్లో గృహకలహం, శత్రుభయం, అశాంతి అని రాసే వుంది. బుద్ధిః కర్మానుసారే చూసి చూసి దారినిపోయే కొరివితో తల గోక్కున్నాను. దీని కంతకీ కారణం ఆ సంధ్య నాకు కనబడి నమస్కారం చెయ్యడం. దాని మహాత్మ్యమే యీ రభసంతాను.

• • •

గుమ్మంలో అడుగెట్టగానే హాల్లోంచి ఏవో పెళ్ళి ప్రేమా అంటూ మాటలు వినబడ్డాయి. మా ఆవిడతో మాట్లాడుతున్న దెవరా అని ఆలోచిస్తూండగా కాళ్ళు చల్లబడ్డాయి. శక్తినంతా కూడగట్టుకుని శరీరాన్ని వరండా వరకూ మోసుకెళ్ళి స్తంభానికి ఘటాన్ని జార్లేశాను. లోపల్నించి మాటలు వినబడుతున్నాయి.

'మరి నే వెడతాను.'

'ఇంకాస్సేపు కూర్చోకూడదూ'

'మీ ఆయన ఎప్పుడొస్తాడో ఏమో'

'సరే వెళ్ళు. పెళ్ళికి అన్నీ సిద్ధం చెయ్యి.'

'మీ ఆయన ఒప్పుగుంటాడా! మన జీవితాలు అంత సుఖప్రదంగా

● విందులో ఒకడు చాలా అందమైన నర్సు నొకావిడని పరిచయం చేసుకున్నాడు. మాటల సందర్భంలో అతనామెతో 'నా కెప్పుడైనా ప్రమాదం సంభవిస్తే తప్పక మీరున్న ఆస్పత్రికే వస్తాను' అన్నాడు.

నర్సు : 'మీరు మా ఆస్పత్రికి రావడమన్నది ప్రమాదవశాత్తు కాకపోయినా, ఒక పెద్ద వింత కాగలదు. ఎందుకంటే నేనుంటున్నది పురుళ్ళుపోసే ఆస్పత్రి.'

దొర్లించుకునే అవకాశ ముందని నాకు నమ్మకం లేదు.'

'నాకు నమ్మకంవుంది. జరిగిపోయింది. ఇద్దరి ప్రేమ జీవుల జీవితాలు దగ్ధంచేసి ఆయన ఏం బావుకుంటారు!'

'ఒప్పుగోకపోతే?'

'ఒప్పుగోకపోతే అడ్డేదేమీ లేదు. ఇద్దరికోసం ఒకళ్ళు చెయ్యలేని త్యాగాన్ని ఒకడికోసం ఇద్దరు చెయ్యాలనేముందీ!'

'నీకున్న నమ్మకం నాకులేదు. పెళ్ళి నువ్వనుకున్నంత సులభం కాదు. ఇటు మీ తల్లితండ్రులూ, అటు మీ ఆయన, పైగా వాళ్ళ తల్లితండ్రులూ ... ఇన్ని ప్రతిబంధకాల్ని ప్రతిఘటించాలి'

'అన్నింటికంటే ముఖ్యం మా ఆయన ఒప్పుగోడమే కదా! ఆయన రాగానే యిప్పుడే తేల్చేస్తాను. నువ్వు కూడా కాస్సేపు ఆగకూడదూ! వచ్చే వేళయింది కూడాను.'

'అలాంటి సాహసం చెయ్యకు. నీకు చిన్నప్పట్నుంచీ ఆవేశం యెక్కువ. శాంతంగా మంచి మాటల్తో ఒప్పించటానికి ప్రయత్నించు. నేను వెడతాను. అతని ధోరణి సుముఖంగా వుంటే ఫోన్ చెయ్యి. తర్వాత నేను మాట్లాడతాను. వస్తాను. గుడ్‌నైట్.'

'గుడ్‌నైట్.'

ఎంతసాహసం! ఎంత దారుణం!! ఎంత ఘోరం!!! అర్నెల్లపట్టి నాతో కాపరం చేస్తున్న మా ఆవిడ జగన్నాధరావుతో లేచిపోయి పెళ్ళి చేసుకుంటుందా! దీనికి నే నొప్పుగోవాలా! దీనికి బుద్ధి లేకపోతే వాడికి బుద్ధుండొద్దూ! అటు, కట్టుకున్న పెళ్ళాం గొంతుకోసి, ఇక్కడ నా వచ్చటి కాపరంలో చిచ్చుపెడతాడా! ప్రేమజీవులుట! కామపశువులు! దీనికంతకీ కారణం ఈ ప్రేమరోగం. ప్రేమించడమో కళ ప్రేమించి పెళ్ళాడటమో ఫేషన్. పెళ్ళాడిన తర్వాత ప్రేమించుకోవడమో చాతగానితనం. ప్రియురాలూ భార్యా ఒకర్తే అయిన మొగాడూ ప్రియుడూ భర్తా ఒకడే అయిన ఆడదీ శుద్ధ దద్దమ్మల్లో జమ. ఈసిద్ధాంతాన్ని ప్రబోధిస్తూబోలెడు సినీమాలూ, కావల్సినంత సాహిత్య సంపద. పెళ్ళికాని పిల్ల గర్భవత వ్వడం, పెళ్ళయిన స్త్రీ బలవంతం చెయ్యబడటం లాంటి ఆదర్శాలు లేని సినీమాలు సినీమాలు కావు. పేజీకో సారయినా ప్రేయసీ ప్రియులూ ఒకళ్ళ ఒళ్ళో ఒకళ్ళు వాలిపోడం మొదలయిన రసవత్తరమైన దృశ్యాలతో లైంగిక విజ్ఞానాన్ని ప్రచారం చెయ్యని సాహిత్యం సాహిత్యమే కాదు. ఈ సినీకళాధారకుల దృష్టిలో ఈ సాహితీ సేవా దురంధరులదృష్టిలో మానవ జీవితాలకి ఏకైక లక్ష్యం, ఏకైక సందేశం– ప్రేమ. వావి, వరస, వయస్సూ విస్మరించి స్త్రీ పురుషులొకళ్ళ

నొకళ్ళు కామ చక్షువుల్తో చూసుకోడమే నేటి సంస్కారం! ఇప్పుడు నా బతుకేంగాను! నా భార్య యింకొకడితో లేచిపోవడమా! ఎంత అప్రతిష్ఠ! ఎంత అవమానం! ఇలా మనుషుల్ని నరపశువులుగా మార్చిన ఏ సినీమా ప్రొడ్యూసరు లేక డైరెక్టరు, ఏ రచయిత లేక రచయిత్రి నన్నిప్పుడు రక్షిస్తారు!

'ఏమండీ! ఏమిటండీ ఆ చూపు! ఇలా యీ మూల కూర్చున్నారేమిటి! ఎప్పుడొచ్చారింటికి!' అంటూ గుక్క తిప్పుకోకుండా ప్రశ్నలు వేస్తూ మా ఆవిడ నా బుజం పట్టుకుని కుదపగా మళ్ళీ యీ లోకంలో పడ్డాను. కాని ఎంత ప్రయత్నించినా నోరు పెదలేదు. ఏం మాట్లాడితే ఏం సమాధానం వొచ్చి గుండె ఆగిపోతుందోనని భయం అనుకుంటూనే. నా నోరు స్వాధీనం లేకుండా పోయింది.

'ఏమిటండీ అలా వున్నారేం! అసలు ఏం జరిగిందో! అదుగో ఘుమఘుమలాడుతున్నారు! ఏ పార్టీకో వెళ్ళేరు. మరిచిపోయేను, మా అన్నయ్యతో వెడతానన్నారుగా! ఇంక ఈ వీధిలో భాగోతంచాలు! లేవండి' అంటూ రెండుజబ్బలూ పట్టుకు లాగుతుంటే ఆ చేతులుకేసి చూశాను. ఇన్నాళ్లూ ఎంత బలాన్ని ఎంత ధైర్యాన్ని ఇచ్చేయి. అవి చేతులుకావు. వజ్రాయుధాలు! అవి నా చెంతనున్నంత వరకూ అజేయుణ్ణి. ఇక అవి నాకు దూరమయిపోతాయి!

'ఏమండీ! ఏమిటా వెర్రిచూపు! ఏమయిందండీ! ఏమయినా దుర్వార్త వచ్చిందా? మీ ఆఫీసరేమయినా



అన్నాడా? మీ ఉద్యోగం పోయిందా? మీ రెవర్నైనా ఖూనీ చేశారా? దేనికి సమాధానం చెప్ప రేమండీ?" అంటూ నేను కాదని తలూపుతున్నకొద్దీ ప్రశ్నలు వేసుకుంటూ పోయింది.

చివరికి కక్కడ కూర్చోడ మేమిటి లోపలి కెడదామంటూ చేతులు పట్టుకుని లేవదీసి నడిపిస్తూ లోపలికి తీసుకెడుతుంటే శరీరం కొద్దిగా స్వాధీనంలోకి రావడం మొదలెట్టింది. పెదవులు తడి చేసుకుని 'రాజీ' అన్నాను,

"ఓయ్! ఏమిటి మీ బాధ! ఉండండి డాక్టర్‌కి ఫోన్ చేస్తాను" అంటూ మంచంమీద కూలేసి లేవబోయింది.

"ఒద్దు. నువ్వు నన్ను విడిచి పెట్టకు." అన్నాను ఆమె చేతులు పట్టుకుని.

"పోన్లెండి. ఇక్కడే వుంటాను. ఇప్పుడు చెప్పండి" అంది అనునయంగా.

"అదికాదు రాజీ! నువ్వు నన్ను విడిచిపెట్టి వెళ్ళి పోదామనుకుంటున్నావుకదూ." సూటిగా మొహంలోకి చూడలేక గాజులు సవరిస్తూ అడిగేను.

"వెళ్ళనులెండి, ఇక్కడే కూర్చున్నానుగా."

"నిజం చెప్పు. నన్ను విడిచిపెట్టి ఆ జగన్నాధరావుతో లేచిపోదా మనుకుంటున్నావు. అవునా?" అన్నాను. 'అవును' అని సమాధానం వస్తే ఏం చెయ్యాల్రో ఆలోచిస్తూ.

"ఏమండీ! ఏమిటీ ధోరణి! ఇలా చూడండి! ఇవ్వాళ్టేం వారం! పోనీ ఇవెన్ని వేళ్ళు!" అంటూ నా మొహంముందు మూడువేళ్ళు అటూ యిటూ ఆడిస్తూ నా మొహంలోకి పరీక్షగా చూసింది.

"నిజం చెబుతున్నా రాజీ! ఆ సంధ్యని నే నెరగను. ఆ అమ్మాయి జగన్నాధరావు చెల్లెలని నా కసలు తెలీదు. ఆ అమ్మాయితో నాకేదో సంబంధం వుందని నువ్వనుకున్నావు. దీనికి సాయం మీ అన్నయ్య కూడా దబాయించేటప్పటికి పౌరుషమొచ్చి ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని అబద్ధమాడేను. దానికింతగా శిక్షిస్తావా!" అన్నాను ప్రాధేయపూర్వకంగా ఆమె రెండు అరచేతుల్నీ నా చెంపకు చేర్చుకుంటూ.

"పాపం! మీ మనస్సెంత బాధపెట్టేను! ఇప్పుడే జగన్నాధం అన్ని విషయాలూ చెప్పేడు. తప్పంతా నాదే. మిమ్మల్ననవసరంగా అనుమానించేను. ఏదో భార్యాభర్తా అయిన తర్వాత పేచీ పడితే పడతాం. మీ రాజీతో రాజీ చేసుకోడం ఎంతసేపూ! దానికోసం దేవదాసులాగ యింటికొచ్చి నన్నల్లరి పెడతారా! నన్ను హడలగొట్టాలంటే యిదా మార్గం!" అంది కంట నీరుబెడుతూ. ఎందుకో యీ అబద్ధం! ఈ నటన!

"ఇంకా ఎందుకు నిజందాస్తావు. నే నంతా విన్నాను. ఇందాకా అతను వెళ్ళబోయేముందర పెళ్ళికి సిద్ధం చెయ్యమనడం, నన్నొప్పిస్తాననడం ..." అంటుంటే నా నస్స హాయతకి నామీదనాకే జాలేసింది.

"ఇంకా ఏం విన్నారు!" అంది చిరునవ్వు నవ్వుతూ. ఎంత గుండె నిబ్బరం!

"ఇంకాస్సేపు ఆగితే ఆమన రాగానే అడిగి తేల్చేస్తా నన్నావు!"

"అవునన్నాను, ప్రేమా చోటా పెళ్ళోచోటా అయితే ఇద్దరి జీవితాలూ నాశన మయిపోతాయి." అంది మొహంలో అదే చిరునవ్వు. ఎంత ధైర్యం!

"నన్నెందుకు ప్రేమించలేవురాజీ! ఏం తప్పు చేశాను! నిన్ను ప్రాణప్రదంగా ప్రేమించానే! నిన్ను విడిచి బతకలేనని నీకు తెలియదా? నన్నన్యాయం చెయ్యకు. నువ్వు నా భార్యవు మాత్రమే కావు. నా దేవతవి. నా సర్వస్వానివి, నా ఆశాజ్యోతివి. నువ్వు లేకపోతే నేను బతకలేను. నన్ను విడిచిపెట్టకు రాజీ! నన్ను విడిచి పెట్టకు..." కట్టలు తెంచుకున్న ఉద్రేకంలో ఇంకా ఏమేమిటో అన్నాను

"ఇప్పుడు కాదు కదా, జన్మజన్మాకీ మిమ్మల్ని విడిచిపెట్టను. కిందటి జన్మలో ఏం పుణ్యం చేసుకున్నానో ఈ జన్మలో మీలాంటి దేవతని భర్తగా పొందేను. ఏ భార్య తన భర్తనుంచి ప్రత్యక్షంగా వినడానికి నోచుకోలేని ఆయ్యని మాటలు మీ నోటంటనే అన్నప్పుడు ఆనందం, గర్వం, సంతృప్తి భగవంతుడీ విధంగా ప్రసాదించేడు." అంది నా కౌగిలిలో తల దాచుకుంటూ.

"రాజీ" అంటూ ఈ మధురానుభూతి స్వప్నం కాదని రుజువు చేసుకోడానికి మా ఆవిడ తల నా గుండె కదుముకున్నాను.

"అసలు సంగతి తెలియక మీరు పడే బాధను నేను భరించలేను. మీరు విన్న మాటలన్నీ నిజమే. కాని అవి మా అన్నయ్యా సంధ్యా

● స్కౌట్స్‌లో కొత్తగా చేరినబ్బాయి తల్లితో "అమ్మా! అమ్మా! ఇవాళెంత మంచిపని చేశామో చూశావా? ఒక పండు ముదుసలావిడ్ని నేనూ వుంకో నలుగురు స్కౌట్సు కలిసి ఓ ప్లాట్‌ఫారమ్ నుంచి వుంకో దానికి తీసికెళ్ళాం."

తల్లి : అడేమిట్రా! ఆవిడ్ని తీసికెళ్ళటానికి అంతమంది కావల్సొచ్చారా!

కొడుకు : ఆ! మరేవిటనుకున్నావ్! ఆవిడ వద్దు మొర్రో అంటూంటే ఫరవాలేదు అని బలవంతాన ఈడ్చుకెళ్ళాం.

పెళ్ళిగురించి. ఈ మధ్యనే వాళ్ళిద్దరికీ పరిచయమై ప్రేమలో పడ్డారు.'

'మీా అన్నయ్యా సంధ్యా ప్రేమించుకున్నారా!' అన్నాను ఆశ్చర్యంగా. అప్పు డర్థమయింది. మా బావమరిది దగ్గిర ఆ అమ్మాయి ఫోటో ఎలా వొచ్చిందో.

'అవును. ఈ విషయం తెలుసుకుని మానాన్నగారు మండిపడుతూ, 'ఆ జగన్నాథరావు ఇటు మన కుటుంబాన్నీ అటు మీా బావనీ అవమానించేడు. అలాంటి వాడి చెల్లెల్ని పెళ్ళాడతానంటే నేను ఒప్పుగున్నా మీా చెల్లెలూ, బావా, అతని తల్లి తండ్రులూ నీ మొహం తగలేస్తారు. నేను తలెత్తుకు తిరగాలంటే మళ్ళీ యీ సంబంధం మాకెత్తకు' అని కేకలేశారుట. ఇది విని ఆ అమ్మాయే మనతో ముఖాముఖీ మాట్లాడదామనుకుని మన ఎడ్రస్ తెలుసుకుని, మా అన్నయ్యకికూడా చెప్పకుండా నిన్న మనింటికొచ్చింది. మన యిల్లుతాళం వేసి వుందిట. మన యింటిముందు నిలబడ్డంచూసి ఈ వీధిలో వాళ్ళే ఎవరో మీా రూపురేఖల్నీ వేసుకున్న బట్టల్నీ వర్ణించి ఇప్పుడే బస్ స్టాండులో చూశానని చెప్పేరుట. అందుకే గబగబవొచ్చి బస్ ఎక్కి మిమ్మల్ని ఆనవాలు పట్టి పలకరించింది...'

'మరి సినిమాలో ఎలా ప్రత్యక్షమయిందీ?'

'మీారు దిగిపోడం చూసి, ఇంక నడిరోడ్డుమీాద మాట్లాడ్డం ఎందుకు సాయింత్రం మళ్ళీ యింటి కొచ్చి మాట్లాడదామనుకుని దార్లో స్నేహితులు అడ్డగిస్తే దిగి మనలా గే మ్యాటినీకొచ్చింది. పాపం, ఏమనుకుదో ఏమిటో నా పేలాపన విని! సినిమాలో లైట్లార్పేసేరు. దానికి సాయం మీారు నా నోరు మూసేసేరు కనక సరిపోయింది లేకపోతే ఎంత అప్రతిష్ట! నోటికొచ్చినట్లు వాగేను. తనె మళ్ళీ మనింటికొస్తానంటే 'నువ్వు రావడం ఎందుకూ! మీా తాలూకు మొగాళ్లెవరేనా వుంటే నన్నొచ్చి కలుసుకోమను' అన్నానుకదా, అదే నిజమనుకుని వాళ్ళన్నయ్య జగన్నాథాన్ని ఇందాకా పంపింది మనింటికి. అమాయకురాలు! నిజానికి జగన్నాథానికి సంధ్య అనే చెల్లెలుందని విన్నాను కాని చూడలేదు. అప్పట్లో వాళ్ళ వాళ్ళెవరూ యీ వూళ్ళో లేరు. అతను హాస్టల్లోవుండి చదువుకునేవాడు. ఇంతకీ తన పేరు చెప్పగానే ఆనవాలుపట్టి వేళాకోళం చేస్తున్నారనుకుని వుంటుంది. నేనన్న మాటలు సరిగ్గావింటే ఎంత బాధపడేదో! ఏమిటో!' అంది తన కాబోయే వదినగారిని గురించి తలుచుకుని మురిసిపోయే తన్మయత్వంలో.

నా సందేహాలన్నీ మంచు తెరల్లాగ విడిపోయినమాట నిజమేకాని, అంతక్రితమే నేను మా బావతో చెప్పిన అబద్ధాల ఫలితంగా మరో కొత్తతుఫాను చెలరేగుతుందేమో నన్న భయం మాత్రం ఘనీభవించింది.

'ఏమండీ! అలా ముభావంగా ఉన్నారు. ఈ పెళ్ళికి మీారొప్పుకుంటారని జగన్నాధానికి అభయహస్త మిచ్చేను. మొదట్లో అతనే వొచ్చి అడిగితే మీారవమానించి పొమ్మంటారన్న భయంతో రాలేదుట' అంది నా మౌనంచూసి ఆ విషయమే ఆలోచిస్తున్నా ననుకుని.

'నువ్వు మాటిచ్చేసేక నేను కాదంటేమాత్రం నా మాట నెగ్గనిస్తావా!' అన్నాను దగ్గరికి తీసుకుంటూ.

ఇంతలోకే టెలిఫోన్ ప్రళయగర్జన వినగానే మళ్ళీ చెమట్లు పట్టడం ప్రారంభించేయి. మా ఆవిడే హాల్లోకి వెళ్ళింది. 'ఓ! ... అన్నయ్యా! నువ్వా!' అనడంతోటే ఈ అవమానం గండం గడిచే దెలాగ భగవంతుడా అనుకుంటుంటే మళ్ళీ మా ఆవిడ గొంతు వినబడింది. 'ఓ! అదా! నిన్నేడిపించడానికలా అన్నారుట! ఇంటికొచ్చి ఏదో ఘనకార్యం చేసినట్టు నాతో చెప్పి పెద్ద నవ్వులు! ఇంటికొచ్చి ఓ గంటయింది. ఇప్పుడే నాన్నగారికి టెలిఫోన్ చేసి ని పెళ్ళికి ఒప్పుకోమని చెబుదామనుకుంటున్నారు. అయినా ఏమిటో! అర్ధంలేని మనిషి! ఎంత ప్రమాదమైన సరసం! ... ఇంకానయం! ఆ వేడిమీాదెళ్ళి ఆ అమ్మాయితో దెబ్బలాడేటట్టున్నావు! అయినా నువ్వెలా నమ్మావు! ఆయనకి ప్రేమేమిటి! నా మొహం! అయన్ని ఏ అడది...'

ఇంక ఆ మాటలు వినబడకుండా రేడియో ట్యూన్‌చేసి వాల్యూం పెంచి సావకాశంగా సిగరెట్ వెలిగించేను.

□□□

● బడిలో మోటారుకారుమీాద వ్యాసం వ్రాయమన్నారు 200 మాటల్లో. ఒకబ్బాయి ఇలా వ్రాశాట్ట. 'మా మామయ్య ఒక కారు కొన్నాడు. ఒక రోజు అయన పల్లెటూర్లో ప్రయాణం చేస్తూ ఎత్తుగా వున్న ప్రదేశం ఎక్కించబోగా టైర్లు బ్రద్దలయి కారు తిరగబడిపోయింది. మిగతా 180 మాటలు మా మామయ్య నడిచి తిరిగి వచ్చేస్తూ అన్నవి. నాకు తెలును అవి మీారు మళ్లీ అడగరని.'



మన మాతృదేశం కోసం పోరాడుతున్న యోధులను జూచి మనం గర్విస్తున్నాం; నిజంగా గర్విస్తున్నాం. వాళ్లు మన స్వాతంత్ర్యాన్ని, మన గౌరవ మర్యాదలని, మన విలువలని, మన ప్రాణాలని కాపాడారు. బలవంతుడయిన శత్రువును వెనుకకు నెట్టి అల్లంత దూరంలో ఉంచారు. ఈ విధంగా చేస్తున్నప్పుడు చాలామంది తమ ప్రాణాలనే కోల్పోయారు. ఇంకా అనేకమంది క్షతగాత్రులయారు. అవును. మన యోధులు వారి కర్తవ్యాన్ని, ధర్మాన్ని నిర్వహిస్తున్నారు. మనం పూర్వం ఎప్పుడూ పనిచేయనివిధంగా కష్టపడి పనిచేసి, వారికి ఇంకా బలాన్ని చేకూరుద్దాము.

భారతదేశం ఒక్కటే
భారత జాతి ఒక్కటే

DA 68/F 8

[గత సంచిక తరువాయి]



యద్దనపూడి సులోచనారాణి

18

మెట్లెక్కి వరండాలోకి వస్తున్న మాధవ్ దగ్గరికి జ్యోతి పరుగెత్తుకుంటూ యెదురు వచ్చి 'దొంగా! నువ్వు చెప్పకపోతే మేం కనుక్కోలేమని కదూ! చూడు యెలా పట్టేశామో?' అంది నవ్వుతూ. జ్యోతి వేసుకున్న బట్టలు వుల్లిపొరలా చీరెలోని జాకెట్, జాకెట్‌లోంచి బాడీ కన్పించేంత పల్చగా వున్నాయి. జ్యోతి వంటరిగా రాలేదు. వెంట పిక్నిక్ పేరుతో పదిమందిని వేసుకువచ్చింది. వాళ్ళందరి నవ్వులతో, కేరింతలతో యిల్లంతా మారుమ్రోగిపోతోంది.

దొరగారింటికి రెండు కార్లనిండా చుట్టాలు వచ్చారని, వాళ్ళలో చాలామంది ఆడవాళ్ళని. వాళ్ళు చాలా ఫాషన్‌గా వున్నారని, మగవాళ్ళతో సమానంగా కూర్చుని కబుర్లు చెప్తున్నారని ఆ రాత్రికి రాత్రే వూరంతా ప్రాకిపోయింది. కొంతమంది కూరలు తెచ్చియిచ్చే నెపంతో, యింకా కొంతమంది పెరుగు పంపింది చాల్లా, యింకా కావాలా అంటూ అవసరాలు కనుక్కునే నెపంతో పదే పదే వచ్చి చూసి వెళ్ళసాగారు. మర్నాటికల్లా వచ్చిన వాళ్ళ గురించి కథలు కథలుగా చాలా చెప్పుకున్నారని జ్యోతికిగాని, మాధవ్‌కిగాని తెలియదు.

మర్నాడు ఆదివారం శలవురోజు కావటంవల్ల అంతా వుండిపోయారు. మాధవ్ శరీరం వచ్చిన ఫ్రెండ్స్‌తో తిరుగుతున్నా, మాట్లాడుతున్నా, అతని మనసు మాత్రం వాసు యింటిచుట్టూ తిరగసాగింది. ఈ చుట్టాలు, యీ ఆడపిల్లలు చూసి సంధ్య యేమనుకుంటుంది! యెలాగైనాసరే అర్థికంగా చితికిపోయిన సంధ్యని ఆ దరిద్రంలోంచి పైకి లేవనెత్తాలని అతని మనసు అప్పుడే నిర్ణయించుకుంది కాని సంధ్య చూపులు, ఆ ప్రవర్తన గుర్తుకువస్తే అది అంతసులభం కాదేమోనని భయం వేస్తోంది.

ఆ రాత్రి జరిగిపోతే మర్నాడు వుదయం వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోతారు. వాళ్ళు వెళ్ళగానే వాసు దగ్గరకి వెళ్ళవచ్చు. తను అనుకోకుండా ట్రాన్సిస్టర్ అక్కడ వదిలి

రావటం ఓ విధంగా మంచిదే అయింది. వాళ్ళెప్పుడు వెళ్ళిపోతారా అని నిముషాలు లెక్క పెట్టుకుంటూ పరధ్యానంగా నిలబడిన మాధవ్ దగ్గరకి జ్యోతి వచ్చింది.

"ఏమిటి మధూ! అలా వున్నావేం? ఒంట్లో బాగా లేదా?"

"ఎలా వున్నాను? బాగానే వున్నానుగా!" నవ్వు తెచ్చి పెట్టుకుంటూ అడిగాడు.

"వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. మనసు విప్పి మాట్లాడేవు. నిన్ను అడక్కుండా వీళ్ళందర్నీ తీసుకు వచ్చానని కోపం వచ్చిందా నా మీద?—"

"లేదు జ్యోతీ లేదు. నువ్వు నిన్న రాకుండా వుంటే నాకు పిచ్చెక్కేది" బైటచీకటిలోకి చూస్తూ మనస్ఫూర్తిగానే అన్నాడు మాధవ్.

జ్యోతి కళ్ళల్లోకి సంతోషంతో పాటు గర్వం కూడా తొంగి చూసింది.

"ఇక్కడ యీ మారుమూల కావాలని ఒంటరితనంతో నీ చుట్టూ నువ్వు సమాధి కట్టుకోకపోతే - అక్కడే మా అందరితో వుండిపోగూడదూ?—"

"యెక్కడుండను! ఇది ఒక్కటే నాకున్న యిల్లు."

"గొప్ప. నాచేత చెప్పించాలని." జ్యోతి లాలనగా నవ్వింది.

ఇంతలో మరొకరు అక్కడికి రావటంతో సంభాషణ ఆగిపోయింది.

జ్యోతి వాళ్ళు వెళ్ళిపోయారు. మాధవ్ వెంటనే వాసు దగ్గరకి వెళ్ళటానికి బట్ట లేసుకుని బైలుదేరాడు. కాని అడుగు ముందుకు పడలేదు. వాసుకి ఈ పాటికి తనెవరో తెలుస్తే! సంధ్య చెప్పి వుంటుందా? ఒకవేళ చెప్పినా చెప్పకపోయినా మాట్లాడవద్దని ఆజ్ఞాపిస్తే! సంకోచం వెళ్ళకు అని అడ్డుపడి వెనక్కు లాగితే అంతకంటే బలమైన శక్తి యేదో వెళ్ళమని ముందుకు తోస్తోంది. ఈ రెండింటి పెనుగులాటతో యేదీ నిర్ణయించుకోలేని మాధవ్ చివరికి ఆ రోజు కూడా వెళ్ళలేదు.

19

రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి మర్నాడు వుదయం బైలుదేరబోతూవుంటే కోగులు ట్రాన్సిస్టర్ తెచ్చి యిచ్చాడు. దాంతోపాటు చిన్న చీటి కూడా అందిచ్చాడు. వాసు వ్రాసిన వుత్తరం అది.

"అక్కయెందుకో చాలా కోపంగా వుంది. ట్రాన్సిస్టర్ పంపించేస్తున్నందుకు యేమీ అనుకోకండి. ఈ యింట్లో అక్క మాట శిలా శాసనం. నేను దురదృష్టవంతుడిని. లేచి నడువలేని, నిర్భాగ్యుడిని. లేకపోతే స్వయంగా వచ్చి కృతజ్ఞతలు చెప్పి యిది యిచ్చేవాడిని. నాకు మీరంటే చాలా యిష్టం. అది మర్చిపోకండి. మా అక్క మనసు నొప్పించలేని నా బలహీనతకు నన్ను క్షమించండి.

వాసు.

మాధవ్ అంతర్యంలో మెలి తిరుగుతున్న వూహ నిజమైంది. అందుకే అతనికి అంతగా ఆశ్చర్యం అనిపించలేదు. ఇంటికి వెళ్ళగానే తమ్ముడి దగ్గరున్న ట్రాన్సిస్టర్ ఎవరిదో తెలుసుకుని వెంటనే తిప్పి పంపెయ్యమని ఆజ్ఞాపించి వుంటుంది. ఆ సమయంలో వాసు ముఖం ఎలా వుంటుందో తేలిగ్గానే వూహించుకోవచ్చు.

కాని మనసులో మొన్నటినుంచి సంధ్యని మరొక్కసారి దగ్గరగా చూడాలనే కోర్కెని కాదనలేక పోతున్నాడు. కాని ఆ కోర్కె తీరే మార్గంలేదు. సంధ్య ట్రాన్సిస్టర్ తిప్పిపంపి తమీమని ఆ యింటి తలుపులు వేసేసింది. ఈ నిరాశ అనే గాఢాంధకారంలో వాసు మినుకు మినుకుమంటూ వెలిగి ఆరిపోతున్నాడు. వాసుకి తనంటే యిష్టం యేర్పడింది. అందుకు సందేహం లేదు. మాధవ్ దృష్టి "నాకు మీరంటే చాలా యిష్టం. అది మర్చిపోకండి" అన్న వాక్యాలమీద మరోసారి నిల్చింది. తను ప్రయత్నంచేసి చూస్తే వాసుని గెలుచుకోవటం యేమంత కష్టం కాకపోవచ్చు.

అందుకే ధైర్యంచేసి ట్రాన్సిస్టరు తీసుకొని తనే స్వయంగా వెళ్ళేడు. మంచంమీద మూతి ముడుచుకుని

జరిగిన కథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష తరవాత స్వగ్రామం తిరిగి వస్తున్న మాధవ్, త్రోవలో బండి బురదలో కూరుకుపోగా నిస్సహాయంగా ఉన్న ఒక యువతికి సహాయం చేస్తాడు. ఆమె అతన్ని అపార్థం చేసుకుని, కొట్టి అవమానిస్తుంది. ఆ తరువాత కొన్నేళ్ళకు అదే యువతి అతనికి రైల్లో ఒంటరిగా తారసిల్లుతుంది. తల్లి మరణం, ప్రేమించిన సుధ మరొకరిని వివాహమాడడం మొదలైన సంఘటనలతో వికలమనస్కుడై ఉన్న మాధవ్ ఆ యువతిపై పూర్వపు కసితో మానభంగం చేస్తాడు. మరికొన్నేళ్ళకు ఒక పల్లెటూరులోని తన భవనానికి వెళ్ళిన మాధవ్‌కు ఆ యువతే మళ్ళీ తటస్థపడుతుంది. అనుకోకుండా తిరిగి తిరిగి ఎదురవుతూ తనపై విపరీత ద్వేషం చూపుతున్న ఆమెను ఎలాగైనా తనను ప్రేమించేలా చెయ్యాలని అతను ప్రయత్నిస్తాడు. వికలాంగుడైన ఆమె తమ్మునితో స్నేహం చేస్తాడు.

కూర్చున్న వాసు ముఖం మాధవ్‌ని చూడగానే చాటంత అయింది. చప్పున లేవబోతూ 'మీరెంత మంచివారు! ఇంక యీ జన్మలో మళ్ళీ మిమ్మల్ని చూడననే అనుకున్నాను.' అన్నాడు వికసించిన ముఖంతో.

'వాసూ! ట్రాన్సిస్టర్ పంపివేయటానికి కారణం ఏమిటో నేను తెలుసుకోవచ్చా?–'

వాసు ముఖం వాడిపోయింది. 'నాకు తెలియదు. అక్క అలా పరాయివాళ్ళ దగ్గర్నుంచి యేమీ తీసుకో కూడదు. పంపివేయ్ అంది.'

'పుడుతూనే అంతా అప్తులు అవుతారా?–'

వాసు మౌనం వహించాడు.

'చెప్పువాసూ! నేను అపరిచితుడిననేనా? లేక యింకేమైనా కారణం వుందా?–' సంధ్య వాసుకు కారణం యేం చెప్పిందో తెలుసుకోవటానికి అతని మనసు ఆత్రపడుతోంది.

'నాకు తెలియదు. ఒకళ్ళనుంచి తీసుకోకూడదు అంది. అంతే నేను తీసుకోను.'

'అది నిజమే వాసూ! ఒకళ్ళనుంచి అయాచితంగా యేమీ తీసుకోకూడదు అన్న మీ అక్క అభిప్రాయాన్ని నేను అర్థం చేసుకోగలను. గుర్తించి గౌరవిస్తాను కూడా. కాని అది అందరి విషయంలోనూ చెల్లదు. నీ నుంచి నే నేదయినా ఆశిస్తూ స్వలాభాపేక్షతో యిస్తే నువ్వు తీసుకోకూడదు. కాని నా కలాటి ఉద్దేశ్యమే లేదు. కేవలం నిన్ను చూసి జాలిపడి యిచ్చాను. నాకు లేని ఉద్దేశ్యాలు అంటగడితే చాలా బాధనిపించింది. అది చెప్పి వెళ్ళటానికే వచ్చాను. వస్తాను' మాధవ్ వెళ్ళటానికి రెండడుగులు వేయగానే వాసు వంగి చప్పున చెయి జాచి అతని చెయ్యి గట్టిగా పట్టుకుని 'ఆగండి. నా మాట వినండి' అన్నాడు ఆత్రంగా.

'జరిగింది చాల్లేవాసూ! నే నింకా పొరపాటుగా కూడా యీ యింటి ఛాయలకి రాను. నా కిప్పు డర్థమైంది. నే నీ నెపంతో మీ యింటికి పదిసార్లు వస్తానని మీ అక్క భయంలా వుంది.' తను మాట్లాడే ప్రతిమాటా వాసు లేత మనసుమీద యెలాటి ముద్ర వేస్తోందో అతను గమనించకపోలేదు.

'ప్లీజ్. మీరు నామాట వినాలి.' దీనంగా పిలిచాడు వాసు.


మాధవ్ వెనక్కు తిరిగి యేమిటన్నట్టు చూశాడు.

వాసు కళ్ళల్లో తడి కన్పిస్తోంది. 'మా అక్కకి నచ్చినా నచ్చకపోయినా మీరు నాకు కావాలి. మనిద్దరం స్నేహితులం. అవునా?' అన్నాడు.

మాధవ్‌ని చూస్తుంటే అతనికి పెద్ద పెన్నిధి దొరికినట్టుంది. సంధ్య మొన్న వచ్చి కోపంతో యెగిరిపడుతూ ట్రాన్సిస్టర్ తిప్పిపంపివెయ్యమని ఆజ్ఞాపించినప్పుడే అతని మనసులో పెనుగులాట ప్రారంభమైంది. ఎడారిలో వయాసిస్‌లా, యీ పల్లెటూరులో, యీ నిరక్షర కుక్షుల మధ్య అతను దేవతామూర్తిలా దొరికాడు. అయినా అసలు అతనెంత మంచివాడు! ఎన్ని కబుర్లు చెప్తాడు! అన్నింటికంటే మించి తనంటే యెంత జాలి లేకపోతే ట్రాన్సిస్టరు వదిలి వెళ్తాడు! మాధవ్‌తో కూర్చుని మాట్లాడుతుంటే యింకో ప్రపంచంలో జీవిస్తున్నంత అద్భుతంగా వుంటుంది. ఎలాటి పరిస్థితులలోనూ, చివరికి సంధ్యకి కోపం వచ్చినా సరే అతని స్నేహం వదులుకోగూడదని నిశ్చయించుకున్నాడు. అక్కమాట కాదంటున్నా నేమోననే బాధ పీకినా వాసు మనసులో స్వార్థమే గెలిచింది.

'నా మూలంగా మీ యింట్లో అశాంతి యేర్పడటం నా కిష్టం లేదు వాసూ!' ఈ మాటలు మాధవ్ మనస్ఫూర్తిగానే అన్నాడు. తను చేస్తున్న యీ పనివల్ల సంధ్య బాధపడితే అని అసలే భరించలేడు.

'అక్కకి నేను నచ్చచెప్తాగా! అక్క భయం నాకు తెలుసు. మగవాళ్ళంతా దుర్మార్గులనీ, మోసగాళ్ళని అనుకుంటుంది. మగవాళ్ళలో మీలాంటి మంచివాళ్ళున్నారని అక్కకి తెలియదు. మీ రందుకు, మీరు వస్తూ పోతూ వుండండి. తనంతట తనే మీ మంచితనం గ్రహించకపోతే నా పేరు వాసే గాదు.' దృఢంగా అన్నాడు.



20

'వాళ్ళు ఆ యిల్లు అమ్మేస్తారుట. ఒప్పుకున్నారు' మేనేజర్ పరుగెత్తుకుంటూ వచ్చి సంతోషంగా చెప్పాడు.

'ఏ యిల్లు? –' నిర్లక్ష్యంగా అడిగాడు మాధవ్ చూస్తున్న పేపర్ మీదనుంచి దృష్టిని కదల్చకుండా.

'ఏ యిల్లు! మనం యిన్ని రోజులూ దేనికోసం ప్రయత్నం చేస్తున్నాం?' ఆశ్చర్యంగా చూశాడు మేనేజర్.

'ఆ పెంకుటిల్లు సంగతేనా ? –'

'అవును సార్. నాకు ఉదయం కబురు చేశారు. మనిష్టం వచ్చినంత ధర యిచ్చి తీసుకోమన్నారు'

'నేను అది కొనదల్చుకోలేదు. ఆ ప్రయత్నం విరమించుకున్నాను.'

'నిజంగా !'

'నిజంగానే! తర్వాత – నీతో నిన్ననే చెప్పా లనుకున్నాను. నీకిక్కడ పని పూర్తయి పోయిట్టుంది. నువ్విక హైద్రాబాద్ కి వెళ్ళిపోవచ్చు.' అన్నాడు నిదానంగా ఖచ్చితమైన స్వరంతో పేపరు మడుస్తూ.

'సార్! కానీ ఆ యిల్లు–'

'చెప్పానుగా!' మాధవ్ అక్కడినుంచి లోపలికి వెళ్ళిపోయాడు. మానేజర్ నోరు తెరిచి చూస్తుండిపోయాడు. ఏదయినా అంటే యెలాటి పరిస్థితుల్లోనూ వెనకాడని మనిషి మాధవ్, ఇప్పుడే ఈ విషయంలో-యింత ప్రయత్నం చేసిం తర్వాత యెందుకు కాదంటున్నాడో అతనికి బుర్ర పగలకొట్టుకున్నా అర్థంగాలేదు.

21

వాసుతో మాధవ్ పరిచయం దినదినాభివృద్ధి చెందసాగింది. అతనితో తనబంధాన్ని గట్టిగా ముడివేసుకుంటే గాని సంధ్యని చేరుకోలేదు. అందుకే యెన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తున్నాడు వాసు ఇప్పుడు మాధవ్ రావటం యే కారణం చేతనైనా అర నిమిషం ఆలస్యమైతే ఆగలేడు. ఎందుకు రాలేదు. ఏమైంది అంటూ విలవిలలాడిపోతాడు. అతని మనసంతా మాధవ్ రూపంతోనూ, మాటలతోనూ నిండిపోయింది. వీటన్నిటి మధ్యా అతన్ని వేధిస్తున్న బాధ కూడా ఒకటి లేకపోలేదు. అది యెంతకాలం గడిచినా యెన్ని విధాల తను తర్కించి నచ్చచెప్పాలని చూసినా సంధ్యకి మాధవ్ మంచితనంమీద నమ్మకం యేర్పడటంలేదు. అతని పేరు వింటే చాలు, సంధ్య కళ్ళలో అసహ్యం కన్పిస్తుంది. కంఠం కరుకుగా మారుతుంది. రాను, రాను వాసుకు అక్కగారి తెలివి తేటలమీద నమ్మకం సడలిపోసాగింది. మనుష్యుల్లో మంచివాళ్ళని గుర్తించలేకపోయిన తర్వాత యెంత చదువుంటే యేం లాభం? ఎన్ని తెలివితేటలుండి యేం ప్రయోజనం!

మాధవ్ వాసుకోసమని యిచ్చే వస్తువుల సంఖ్య నానాటికీ పెరిగిపోసాగింది. మొదట మొదట్లో చాక్లెట్లు, బిస్కట్లు,పుస్తకాలుమాత్రమే వుండేవి. అవి రానురాను హార్లిక్స్, కాఫీ పొడి, పంచదార, బ్రెడ్, పళ్ళుఅయి యిప్పుడు చాలా వుంటున్నాయి. సంధ్య వీటిల్లో వేటినీ తాకదని, విషంలా చూస్తుందని స్వయంగా వాసుకు కూడా ఆ సంగతి తెలియదు.

మొదట మొదట్లో ముభావంగా వుండే ఆయాకి కూడా క్రమేపీ మాధవ్ అంటే అభిమానం యేర్పడసాగింది. ఇప్పుడిప్పుడు మనసువిప్పి మాట్లాడుతోంది.వాసుతోపాటు కాఫీ అదీ యిస్తోంది. ఇన్నిరోజులనుంచి యింటికివస్తున్నా ఒక్కసారి సంధ్యవైపు చూడటంకాని, అసలు మాట్లాడాలని ప్రయత్నంకాని చెయ్యని మాధవ్ వ్యక్తిత్వం, ఆ పెద్దమనిషి తరహా ఆవిడకి నచ్చింది. ఆనందంగా కూడా అన్పించింది. కాని అతని హృదయం అంతా సంధ్య రూపమే నిండివుందని, సంధ్య మూలంగానే యీ యింటికి వస్తున్నాడని, కాని అది జాగ్రత్తగా మనసులో మారుమూల దాచేసుకున్నాడని వూహించలేదు.

ఓ రోజు మాధవ్ కూర్చుని వుండగా ఆకాశం, వెన్నెల యీ ప్రసంగం వచ్చింది. వాసు నిట్టూర్పు విడుస్తూ 'అబ్బ! బైటగాలి తగిలి, అనంతమైన ఆకాశాన్ని చూసి యెన్ని యుగాలైందో! ఇక జన్మలో చూస్తాననే ఆశ కూడా లేదు. యీ బ్రతుకిలా యీ గదిలో యీ మంచంమీద తెల్లవారాల్సిందే గాబోలు! హు! ఒక్కోసారి యీ బలవంతపు బ్రతుకు యెంత నరకం అన్పిస్తుందో!' అన్నాడు బాధగా.

- కొత్తగా కోళ్ళపెంపకపు వ్యాపారం మొదలెట్టిన ఒక పట్నవాసపు యువకుడు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎగ్రికల్చర్‌కి సలహా అడుగుతూ ఇలా వ్రాశాడు :

  'అయ్యా! నెలనుంచీ చూస్తున్నా. ప్రతి రోజు వుదయం సగటున మూడు నాలుగు కోడి పెట్టలు కాళ్ళు గాల్లో తేలేసి వెల్లకితలా పడుంటున్నాయి. దీని కారణం అంతు బట్టకుండావుంది. ఇందులో మీ సలహా ఏమిటి?'

  జవాబు ఇలా వచ్చింది: 'దీ నర్థం మీ కోళ్ళు చచ్చిపోయుండడమే' అని.

మాధవ్ మనసులో చిత్రమైన వూహ కలిగింది. అది పైకి వెంటనే చెప్పేశాడు: 'వాసూ! వెనక్కు జారగిలబడి కూర్చోగలవు కదూ!' వాసు కూర్చోగలను అన్నట్టు చూశాడు.

'నేనీసారి హైద్రాబాద్ వెళ్ళినప్పుడు చక్రాలబండికి ఆర్డర్ ఇచ్చి వస్తాను. అది తీసుకొచ్చి నిన్నందులో కూర్చోపెట్టి అలా సాయంత్రం వేళల్లో నదిఒడ్డుకి తీసుకు వెళ్ళొచ్చు.'

వాసు కళ్ళు ఆనందంతో, అపుకోలేని కోర్కెతో మెరిశాయి. వెంటనే కృతజ్ఞతతో నిండా నీళ్ళు తిరిగినాయి. మాధవ్ చేతిని లాక్కుని అందులో ముఖం దాచుకుంటూ 'నిజంగా మీరెంత మంచివారు! నాకు మళ్లీ బ్రతుకుమీద అంతులేని అపేక్షని పుట్టిస్తున్నారు.' అన్నాడు. మాధవ్ నిశ్శబ్దంగా వాసు జుట్టు నిమురుతూ వుండిపోయాడు మొదట మొదట్లో సంధ్యని చేరుకోవాలనే కాంక్షతో వాసుని ఆదరంగా తీసుకున్నమాట నిజమే! కాని - రోజులు గడుస్తున్నకొద్దీ - యిద్దరిమధ్యా పరిచయం అభివృద్ధి చెందినకొద్దీ వాసు తనంతట తను ప్రత్యేకంగా అతని మనసులో చోటుచేసుకోసాగాడు. జీవితం పట్ల యెంతో అనురాగం, యెన్నో ఆశలున్న యీ కుంటి పిల్లాడిమీద అతనికి దయాభిమానాలు నిండుగా కలగడం ప్రారంభించాయి.

మర్నాడు వూర్కు వెళ్ళబోయే ముందు బట్టలేసుకుని వాసుతో చెప్పివెళ్ళటానికి వచ్చాడు. వాకిట్లోకే బిగ్గరగా మాటలు వినిపిస్తున్నాయి. మాధవ్ సందేహిస్తూ వరండాలోనే ఆగిపోయాడు.

'నేను కానిపనేం చేశాను! ఆయనెంత మంచివారు! అది నువ్వు గుర్తించకపోవడం నా దౌర్భాగ్యం. నాకోసం, నన్ను చూసి జాలిపడి యిదంతా చేస్తున్నారని చెప్తే విన్పించుకోవేం? అసలు నిన్ను గుర్తించి నీ చుట్టూ తిరగడం లేదని, నిన్ను ఆరాధించకుండా నిర్లక్ష్యంగా వుంటున్నాడని నీకు కక్ష-' వాసు యేడుస్తూ బిగ్గరగా అరుస్తున్నాడు.

'నోర్ముయ్! మాటలు మిగలావంటే పళ్ళు రాలగొడ్తాను. జాగ్రత్త! బుద్ధిలేని వెధవా? నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?-' కోపంగా అరిచింది సంధ్య.

'తెలుసు. తెలిసే మాట్లాడుతున్నాను. అసలు ఆయనంటే నీకెందుకంత అసహ్యం?'

'అది నీ కనవసరం.'

'అనవసరం! అకారణంగా మంచివాళ్ళని అసహ్యించుకోటానికి నువ్వు సిగ్గుపడాలి.'

'నోర్మూయ్!'

'అబ్బబ్బ! సంధ్యా!'. ఆయా విసుగ్గా పిలిచింది.

'చూడమ్మా! ఎలా పేలుతున్నాడో! ఇదివరకు ఎప్పుడైనా

వాడిలా మాట్లాడాడా? నేనిప్పుడంత పరాయిదాన్ని అయిపోయాను. లేకపోతే—' సంధ్య చివరి మాటలని యేడుపు మింగేసింది.

క్షణం నిశబ్దం. సంధ్య యేడుస్తున్న చప్పుడు విన్పించింది.

'అక్కా, అక్కా—' వాసు కోపం మర్చిపోయి జాలిగా బ్రతిమలాడుతున్నాడు.

'నాతో మాట్లాడకు. ఇంకెందుకు నేను!' వెక్కిళ్ళ మధ్య అస్పష్టంగా అంది.

'అక్కా! నువ్వలా అంటే నేను చచ్చిపోయినంత ఒట్టు. నాకు నువ్వు తప్ప ఎవరూ లేరు. పొరపాటయింది. ఇంకెప్పుడూ అనను అని చెబుతున్నాగా! ఆయా! అక్కని దగ్గరకి తీసుకో!' వాసు యేడుస్తూనే ఆజ్ఞాపించాడు.

'ఏమిటమ్మా! నువ్వు కూడా మరీ చిన్న పిల్లలా. పసివాడేదో అంటే—' ఆయా అంది.

'నేనెవరికోసం బ్రతకాలి! వాడికికూడా అవసరంలేదు.'

'అక్కా!'

'అక్క చచ్చిపోయిన రోజున కాని నీకు తెలిసిరాదు.'

'అబ్బబ్బ! యేమిటా మాటలు. హుష్! వూరుకో! నా తల్లిగా.'

ఆయా మందలిస్తున్న ధోరణిలో ఆప్యాయంగా అంది.

'నాకు నువ్వు తప్ప యెవరూ అవసరంలేదు. నేను చచ్చిపోయినంత ఒట్టు. నిజం.' వాసు కూడా యేడుస్తున్నాడు.

స్థాణువులా నిలబడిపోయిన మాధవ్ నిశ్శబ్దంగా వెనక్కుతిరిగి వచ్చేశాడు. 'నేనెవరికోసం బ్రతకాలి!' ఆ మాటల్లో నిరాశ, ఆవేదన అతని గుండెలని చీల్చసాగింది. అయితే సంధ్య జీవితానికి ఒక్క ఆకర్షణ వాసేనా? అంతకుమించి యింకేమీ లేదూ! అసలు తనని దగ్గరగా రానివ్వదు యెందువల్ల? పోనీ అసహ్యంవుంటే ముఖంమీద వెళ్ళగ్రక్కెయ్యచ్చుగా! వాసు కోసం యిదంతా గరళంలా మింగి వూరుకుంటోంది కాబోలు, వాసు పట్ల తను చూపుతున్న యీ ఆదరణ సంధ్యకి రంపపుకోతలా వుందని

● మొ వా:- నాకు తెలిసినోకతను ౬0 ఏళ్ళు రాత్రిళ్ళు ఇల్లు కదలకుండా భార్యతో కాపరం చేయుటం నే నెరుగుదుము.

రె వా-: అదయ్యా! ఆదర్శ దాంపత్యమంటే:

మొ వా:- కాదు, వాడికి పక్షవాతం.

మొట్టమొదటిసారిగా గ్రహించిన అతని హృదయం బాధతో బరువెక్కింది. సంధ్య పరిస్థితులు సరిగ్గా వుండి, అందరి ఆడపిల్లల్లా ఆమె కూడా వుంటే అతనసలు పట్టించుకునేవాడుకాదు. కాని సిరిసంపదలతో పుట్టిపెరిగి ఆత్మాభిమానం కోసం కాయకష్టానికి కూడా జంకక యీ మారుమూల వచ్చి బ్రతుకుతున్న సంధ్య అంటే అతనికి జాలితోపాటు అభిమానం కూడా ఏర్పడుతోంది. ఆర్థికంగా దిగజారిపోయిన పరిస్థితుల్లో వుండి కూడా తను యిస్తున్న చేయూతని అందుకోకుండా నిర్లక్ష్యంగా వూరుకుంటోంది. సౌందర్యానికి మించిన స్వాభిమానం, చదువుకి మించిన సంస్కృతి, తెలివి తేటలని పదును పెట్టే వ్యక్తిత్వం, వాటన్నిటికంటే యెలాంటి స్థితి అయినా ధైర్యం కోల్పోకుండా, నిగ్రహంతో జీవితంతో పోరాడుతున్న సంధ్యని చూసి అతనిలో అణువణువు ఆకర్షింపబడుతోంది. ఎంత కష్టమైనా సరే ఆమె కావాలని, ఆమెని పొంది తీరాలని పట్టుపడుతోంది. కాని, ఆమెని పూర్తిగా జయించి తన దానిని చేసుకునేముందు తనతోపాటు సంధ్యకూడా తగినంత బాధకి గురికాక తప్పదులా వుంది.

తను వెడుతున్నది కేవలం వాసు కోసమేనని రుజువు చేయటానికి మనసులో యెంత పీడిస్తున్నా సంధ్యని గురించి యే విషయాలు అడగలేదు. ఏ మాత్రం తొందరపడకూడదని తనని తను ఆజ్ఞాపించుకున్నాడు. నెమ్మదిగా వాసే యెప్పుడో తనంతట తనే బైట పెడతాడు. ఆ అవకాశం కోసం ఓపిగ్గా యెదురు చూడాలి అంతే. పుష్పం సహజంగా దానంతట అది వికసించాలి. బలవంతంగా తెరవబోతే, వాడిపోయి యెండి నేల రాలే ప్రమాదం వుంది.

22

మాధవ్ వూరునుంచి వచ్చాడు. వెంటు చక్రాల బండీ తయారు చేయించి తీసుకు వచ్చాడు. అది చూడగానే వాసు ముఖం సంతోషంతో యెలా వికసిస్తుందో అతనికి తెలుసు. ఆ ఆనందాన్ని స్వయంగా చూడాలన్న ఆసక్తిని నిగ్రహించుకున్నాడు. అందుకే బండీని జోగులుని పిలిపించి అతనిద్వారా పంపించాడు. బండీ యిచ్చిన అతను వుత్తరం ఒకటి తెచ్చి యిచ్చాడు. వాసు వ్రాసింది అది.

'మీరు రాలేదెందుకు? ఈ బండీలో నన్నెవరు కూర్చోపెట్టారు? మొట్టమొదటిసారి మీరే స్వయంగా నన్ను బైటికి తీసుకెళ్తానని చేసిన వాగ్దానం మర్చిపోయారా? మీరు తీసుకెళ్ళకపోతే నాకసలు యీ బండీవద్దు. తీసుకు వెళ్ళిపోండి. అక్క ప్రవర్తన మీరు పట్టించుకోవద్దు.' క్రిందటిసారికంటే కుదురుగా పొందిగ్గా వుంది దస్తూరి. ఉత్తరం చూసి చాలాసేపు వెళ్ళటమా మానటమా అని తికమకపడి చివరికి బట్టలు మార్చుకుని బైలుదేరాడు.

మాధవ్ వెళ్ళేసరికి వాసు బిగ్గరగా వెక్కి వెక్కి యేడుస్తున్నాడు. ప్రక్కలో సంధ్య కూర్చుని వుంది. ఆయా తలవైపు నిలబడి వుంది. ఇద్దరూ అతన్ని సముదాయించటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారు.

'వాసూ! నా మాట వినవా? నా తండ్రివికదూ?—' సంధ్య జాలిగా బతిమలాడుతోంది.

'వినను. వినను. నువ్వసలు నాకు అక్కవికావు. నా పాలిట రాక్షసివి. దెయ్యానివి. అయన్ని - అయన్ని నువ్వే యేదో అనివుంటావు. అందుకే రాలేదు. నాకు తెలుసు—' వాసు సంధ్య చేతిని విసురుగా తీసేశాడు.

మాధవ్‌కి యేం చెయ్యాలో తోచలేదు. అలాగే నిలబడిపోయాడు. కనీసం కర్టెన్ బైటయినా [illegible] వెనక్కి తిరిగి వెళ్ళిపోయేవాడు. తీరా లోపలికి వచ్చేసిన తర్వాత యిప్పుడా అవకాశం లేదు.

'హుషీ - వూరుకో - వూరుకో - అదుగో ఆయన వచ్చారు.' అంటూ ఆయా.

సంధ్య వెనక్కుతిరిగి మాధవ్‌ని చూడగానే లేచి నిలబడింది. క్షణంలో సగం సేపు తన చూపుల్లో కలిసిన ఆమె చూపుల్లో కఠినత్వం నాడీశూలంలా వచ్చి అతని మనసులో గుచ్చుకుని కలుక్కుమంది. వాసు ఏడుపు నిగ్రహించుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

'అదేమిటి వాసూ! మరీ చిన్నపిల్లాడిలా—' దగ్గరగా వచ్చి పక్కలో కూర్చుని తలమీద చేయి వేసి ఆప్యాయంగా అన్నాడు. వాసు మాట్లాడలేదు. సమాధానంగా రెండు చేతులూ మాధవ్ మెడ చుట్టూ పెనవేసి దగ్గరకి లాక్కున్నాడు.

'ఛ ... ఛ ... యేడుస్తారా? యీ మాత్రానికే? మగవాళ్ళ పరువు తీసేస్తున్నావే! నాకు వీలుగాక రాలేదు. అంతే. ఆయా! వాసుకు తల దువ్వు. బైటకి తీసుకెడతాను.' అన్నాడు.

కొద్దిసేపట్లో వాసు యేడుపు మానేశాడు. ఆయా తలదువ్వి

● డాక్టరు రోగితో : ఆపరేషన్ అవసరమని తోస్తే నాకు, దానికి తగ్గ ఫీజిచ్చుకోగలవా?

రోగి : మీరు నేను ఫీజిచ్చుకోలేనని తెలిస్తే ఆపరేషన్ అవసరమని మీకు తోస్తుందా?

బట్టలు మార్పించింది. మాధవ్ జాగ్రత్తగా అతన్ని యెత్తి బండీలో కూర్చోపెట్టాడు. చాలా రోజుల తర్వాత కదలటంవల్ల వాసు బాధతో కెవ్వుమన్నాడు.

సంధ్య అదుర్దాగా పరుగెత్తుకొచ్చింది.

'యేం భయం లేదు. చాలా రోజుల తర్వాత కదలడంవల్ల అలా అన్పిస్తుంది. కొద్దిసేపట్లో సర్దుకుంటుంది.' వాసు ముఖాన పట్టిన చెమటను తన జేబురుమాలుతో తుడుస్తూ అన్నాడు మాధవ్.

'ఫర్వాలేదు. ఇంతకంటే వేయిరెట్లు బాధయినా భరించగలను. మీరు ప్రక్కన వుండాలిగాని—' మాధవ్ కళ్ళలోకి చూస్తూ అన్నాడు వాసు.

మాధవ్ వాసుని కూర్చోపెట్టిన చక్రాలబండీ తోసుకుంటూ బైటికి నడిచాడు. వెనక శిలలా నిలబడి పాలిపోయిన ముఖంతో చూస్తున్న సంధ్యని యెవరూ గమనించలేదు. వాళ్ళు పూర్తిగా కనుమరుగు అయింతర్వాత ఆ యా సంతోషంతో, 'నిజంగా! యేనాడో వాళ్ళిద్దరికీ ఋణం సుమా! లేకపోతే—'అంటూ వెనక్కు తిరిగి తెల్లబోయింది. అప్పటికే సంధ్య హిస్టీరియా వచ్చినదానిలా రెండు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి యేడవసాగింది.

23

మాధవ్ చక్రాలబండీని నది ఒడ్డుకి తీసుకొచ్చి ఆపాడు. నీరెండ పడుతోంది. సాయం సంధ్యలో నది మీదనుండి వస్తున్న చల్లటిగాలి హాయిగా ప్రాణం పోస్తున్నట్టుంది. తలెత్తి చూస్తే విశాలమైన నీలాకాశం. అందులో యెక్కడికో గుంపులు గుంపులుగా తరలిపోతున్న తెల్లమబ్బులు. వుండి వుండి పక్షులు బారులుతీర్చి గూళ్ళకి పరుగులెత్తుతున్నాయి. వాసుకి వీటన్నిటిని చూస్తుంటే ఆనందంతో మతిపోతోంది. ఎన్ని రోజుల తర్వాత బైట ప్రపంచం! యిలా మళ్ళీ బైటకి వస్తానని కల్లోనైనా అనుకున్నాడా? ఈ వూరు వచ్చింతర్వాత వంటరితనం భరించలేక, రాత్రింబవళ్ళు ఒకే తీరుగా భగవంతుడిని ప్రార్థించిన ఫలితమా యీ మాధవ్ అన్పిస్తుంది. కేవలం దేవుడికి దయకలిగి తనకోసం పంపబట్టిగాని లేకపోతే ముక్కూమొహం తెలియని తనమీద అతనికి యెందుకింత ఆసక్తి! యెందుకింత మమకారం!

'మీరు రోజూ నిలబడేచోటు నాకు చూపించండి.' అన్నాడు వాసు చుట్టూ చూస్తూ.

'సరిగ్గా నేనిప్పుడు నిలబడ్డ

చోటే—' సిగరెట్ తీసి వెలిగించుకుంటూ అన్నాడు మాధవ్.

వాసు తృప్తిగా కళ్ళారా చూశాడు.

'మీరెంత మంచివారు! ఒకవేళ యెందుకైనా కోపం వచ్చి యిక రారేమో ననుకున్నాను.' అన్నాడు కృతజ్ఞతతో కరిగిపోతూ.

సిగరెట్ వెలిగించటం పూర్తిచేసిన మాధవ్ అగ్గిపుల్ల ప్రక్కన పారేస్తూ 'మొదలు రాకూడదనే అనుకున్నాను. కానీ నీ ఉత్తరం చూసింతర్వాత వుండలేక పోయాను' అన్నాడు.

'నా వుత్తరమా?' వాసు ఆశ్చర్యంగా చూశాడు.

'అవును. యేం?'

'నేను—మీకు వుత్తరం వ్రాసి పంపానా?—' నమ్మలేనట్టు అడిగాడు.

'ఇదేమిటి మరి?' జేబులోంచి వుత్తరం తీసి యిచ్చాడు.

అది తీసుకుని చూడగానే వాసు ముఖం మారిపోయింది. 'ఇది నేను కాదు. అక్క వ్రాసింది. కాని ఆ మాటలు నావే.'

మాధవ్ తెల్లబోయి చూడసాగాడు. చూస్తూండగానే వాసు ముఖం విషాదంగా మారిపోయింది. 'ఛీ—ఛీ. నేనెంత చెడ్డ వెధవనో మీకు తెలియదు. పాపం. అక్కని యెన్ని మాటలన్నానని. మీరు రాలేదని కోపంతో దాన్ని యేమి టేమిటో అన్నాను. నాకు తెలుసు. నేను యిక్కడ మీతో సంతోషంగా మాట్లాడుతున్నాను. అది అక్కడ యింట్లో యేడుస్తూ కూర్చుని వుంటుంది.' సంతోషం యిగిరిపోయిన మొఖంతో దిగులుగా అన్నాడు.

మాధవ్ మాట్లాడలేదు. వుత్తరంలోకి చూస్తూండిపోయాడు.

ఈ వుత్తరం వ్రాసింది సంధ్యా!

- సినిమాహాలు మేనేజరింట్లో తెల్లారగట్ల 4 గంటలకు ఫోన్ మ్రోగటంతో విసుక్కుంటూ తీయగానే 'మీ హాలు పగలెన్నింటికి తెరుస్తారు' అని ప్రశ్న.

"2 గం॥లకి" అని కోపంగా రిసీవర్ పెట్టేశాడు మేనేజరు. మళ్ళీ కొన్ని నిమిషాల తర్వాత ఫోన్ మ్రోగి "అన్నట్టు ఎన్నింటికన్నారు హాలు తెరవటం" అదే గొంతుక.

"మళ్ళీ చెప్తున్నా! నువ్వెవరో. 2 గం॥ గానీ నువ్వు హాల్లోకి ప్రవేశించలేవు."

"అయ్యా! మీ హాల్లోకి రావటం గురించి గాదండీ నాబాధ. ఇందులోంచి ఎప్పుడు నేను బయటపడతానా అన్నదే నా గొడవ."

అక్క ప్రవర్తన నచ్చకపోతే పట్టించుకోవద్దు. యీ మాటలు స్వయంగా సంధ్యే వ్రాసింది అంటే అతను నమ్మలేకపోతున్నాడు,

'మా అక్క చాలా మంచిదండీ! మీరు చెప్తే నమ్మరు. నా కంటే కూడా చాలా మంచిది.' ఆత్రంగా అన్నాడు వాసు. మాధవ్‌కి జాలి వేసింది. పాపం! ఇటు జీవితంమీద తను చూపిస్తున్న ఆశ రెచ్చగొడుతుంటే నిగ్రహించుకోలేదు. అటు అక్క మనసు నొప్పించలేడు. వాసు పసి హృదయానికి యిది విషమ పరీక్షలా తయారైంది. కాని యెప్పుడూ విజయం మాధవ్‌కే లభిస్తోంది.

'మా అక్క మొదట్లో యిలా వుండేదికాదు. అది అలా కఠినంగా మారిపోటానికి కారణం వుంది. అది తెలుసుకుంటే మీరు నాకంటే యెక్కువ జాలిపడతారు.'

'ఏమిటది?–' ఆదుర్దాని అణుచుకుంటు మామూలుగా అడిగాడు.

వాసు సందేహించాడు. చెప్పవచ్చో! చెప్పకూడదో! అతని మనసులో మాధవ్ అంటే ఏర్పడిన గౌరవాభిమానాలు చెప్పవచ్చని హామీ యిస్తున్నాయి.

'చెప్పు వాసూ! యేమిటది? నువ్వేది చెప్పినా అది మనిద్దరిమధ్యే వుంటుంది. అది తెలుసుకో!'

వాసుకి ధైర్యం వచ్చింది.

'మా అక్క చదువుకునేటప్పుడు– ఒకటి–ఒకటి జరిగింది' వాసు ఆగిపోయాడు. ముఖం యెఱ్రబడింది.

'ఊ! చెప్పు. ఏం జరిగింది-' కుతూహలంగా అడిగాడు.

'ఓసారి–ఓసారి—'

'ఓసారి?—' మాధవ్ యింకో సిగరెట్ తీసుకుని వెలిగించుకున్నాడు.

'ఆ రోజు–ఆ రోజు నాకు ఇప్పటికీ బాగా గుర్తుంది. అక్క ఆ రాత్రి ఆయా గుండెల్లో తల దాచుకుని వెక్కి వెక్కి యేడుస్తోంది. ఆయా యెంత ఓదార్చినా వినటంలేదు. సంగతేమిటో నాకు తెలియదు. అక్క, నేను, ఆయా ఒక గదిలోనే పడుకునేవాళ్ళం. నేను మేలుకునే ఉన్నానని వాళ్ళకి తెలియదు. నేను అంతా శ్రద్ధగా వింటున్నాను.'

'ఇంతకీ అసలు సంగతేమిటి?–' అసహనంగా అడిగాడు మాధవ్.

'మా అక్కకి యేమైందో తెలియదు. వారం రోజులనుంచి కాలేజీకి వెళ్ళటం మానేసింది. 'నాన్నగారికి తెలిసేకంటే నేను చావటం నయం' యేడుస్తూ మాటిమాటికి యిదే అంటోంది. ఆయా అలా తెలిసే అవకాశంరాదని ఏదయినా ప్రయత్నంచేస్తే అంతా సవ్యంగా జరిగిపోతుందని దిగులు పడద్దని పదే పదే నొక్కి చెప్తోంది. ఇంతలో నాన్నగారు గదిలోకి వచ్చారు. అక్కా ఆయా మాట్లాడటం మానేశారు. బోర్లా పడుకుని వున్న నేను ఒక కన్ను తెరిచి దొంగతనంగా చూశాను. ఆయన పట్టరాని కోపంతో మండిపడుతున్నట్టున్నారు. ఆయన వెనక దాదా కూడా వున్నాడు. దాదా పూరికే చేతులు నలుపుకుంటున్నాడు.'

'ఊ! అయితే?—' మాధవ్ ఆసక్తి వినసాగాడు.

'నాన్నగారేమో 'సంధ్యా! డాక్టరు చెప్పింది నిజమేనా?' అని వురిమినట్టు అడిగారు. అక్క మాట్లాడ లేదు. నిలబడి తలవంచుకుని కాలి బొటన వేలుక్రింద వ్రాస్తూ వూరుకుంది.

'సరె! జరిగిందేదో జరిగింది. అసలు ఆడపిల్లకి యిలాటి స్వేచ్ఛ యివ్వటం నాదే బుద్ధితక్కువతనం. అతనెవరో చెప్పు. పెళ్ళికి ఏర్పాట్లు చేస్తాను. ఇదంతా బైటికి రాకముందే జాగ్రత్త పడటం మంచిది' అన్నారు. అక్క అప్పటికే మాట్లాడ లేదు. 'ఎవరు చెప్పు? గోపాలమేనా?' అన్నారు. అక్క కాదన్నట్టు తలూపింది. 'కాదూ? అయితే యింకెవరు మరి?' అక్క మళ్ళీ మాట్లాడలేదు. గదిలో భయంకరమైన నిశబ్దం ఏర్పడింది. 'అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు. ఊ! చెప్పు. నా కోప సంగతి తెలుసా?' అన్నారు.

'అతనెవరో నాకు తెలియదు.' అక్క చెప్పలేక చెప్పింది.

'తెలియదూ?' రెట్టించారు.

'తెలియదు. నిజంగా. మొన్న-మొన్న విజయ పెళ్ళికి వెళ్ళేటప్పుడు రైల్లో నేను తలుపులవీ

వేనుకునే జాగ్రత్తగానే కూర్చు న్నాను. కానీ ఒకతను యెలా వచ్చాడో మరి. అతను - అతను-' అంటూ అక్క యేడవడం మొదలు పెట్టింది—'

మాధవ్ తృళ్ళిపడ్డాడు. చేతిలో సిగరెట్ జారిపోయింది. నిటారుగా నిలబడి వినసాగాడు.

'ఫస్ట్‌క్లాస్‌లో అలా ప్రయాణం చేయటం మాకు అలవాటే. మా దాదా మూడో తరగతిలో కూర్చున్నాడుట. అక్క మాటలని బట్టి నాకు అర్థం అయింది యేమి



టంటే - ఒక రాస్కెల్ - అ స్కాండ్రల్. మా అక్కని-' వాసు యెర్రబడిన ముఖంతో ఆగి పోయాడు.

'తెలిసిందిలే! తర్వాత,' రోషంతో కోపంతో జేవురించిన వాసుముఖం చూసి యేలాగో అయి పోతూ అడిగాడు.

'కానీ మా అక్క యెంత, చెప్పినా నాన్నగారు నమ్మలేదు. హద్దుమీరి తిరిగిందికాక అబద్ధా లతో నన్నుకూడా మోసం చేయా లని చూస్తున్నావా అని చేయెత్తి అక్కని కొట్టబోయారు. ఇంతలో దాదా అడ్డుపడి అదంతా నిజమేనని చెప్పాడు. నాన్నగారు దాదాని కూడా తిట్టారు. కొట్టబోయారు. ఆ రాత్రి యింట్లో యెంత గొడవైందో చెప్పలేను.'

వాసు వూపిరి పీల్చుకోటానికి ఆగాడు. మాధవ్ వూపిరి పీల్చడం మర్చిపోయి వినసాగాడు.

'తర్వాత ఇంట్లో వాతావరణమే మారిపోయింది. నాన్నగారు ప్రతి చిన్న విషయానికి అందరిమీద చిరాకుపడి కొట్టినంత పని చేసే వారు. అక్కకి గోపాలం అనే ఓ ఫ్రెండ్ వుండేవాడు. అతను పద్యాలవీ వ్రాసేవాడు అతనంటే నాన్నగారికి యెందుకో. అసలే యిష్టం వుండేది కాదు. అప్పు డప్పుడు అక్కని అతనితో యెక్కువ మాట్లాడ వద్దని కేకలు వేసేవారు

కూడా. అలాటిది ఓ రోజున అతన్ని పిలిపించారు. అప్పుడు నేను నాన్న గారి దగ్గరే కూర్చుని ఆడుకుంటు న్నాను. ఆయన గోపాలాన్ని చూడ గానే మర్యాదగా ఆహ్వానించి కూర్చోమని కుర్చీ చూపారు. మొదట ఒకటి రెండు సంగతులు కాలేజీ గురించి అడిగారు. నాన్న గారు యెంత నిదానంగా, మంచిగా మాట్లాడుతున్నా గోపాలం పిల్లిలా ముడుచుకుపోయి సమాధానాలు యిస్తున్నాడు. తర్వాత నాన్నగారు నన్ను దగ్గరకు తీసుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుంటూ గోపాలంతో 'సంధ్య నిన్ను తప్ప యెవర్నీ పెళ్ళి చేసుకోను అని పట్టు పడుతోంది నీ అభిప్రాయం ఏమిటి? నీ కిష్ట మేనా?' అన్నారు.

గోపాలం తెల్లబోయి చూడ సాగాడు. నాన్నగారు అదేం గమ నించనట్టు నా జుట్టు సవరిస్తూ 'నా ఆరోగ్యం అంతగా బాగుండటం లేదు. సాధ్యమైనంత త్వరలో సంధ్యపెళ్ళి చేసెయ్యాలనుకుంటు న్నాను. మీ యిద్దరికీ యిష్టమైతే లగ్నాలు పెట్టిస్తాను.' అన్నారు. గోపాలం ముఖం వికసించింది. అంత క్రితంవరకూవున్న భయం కూడా పోయింది. కుర్చీలో నిటారుగా ఠీవిగా కూర్చున్నాడు. సంధ్య అంటే తనకి ప్రాణం అని యేదేదో పద్యాలు వ్రాసే భాషలో మాట్లాడాడు.

గోపాలంతో అక్కపెళ్ళి జరుగు తుంది. అక్కకి కూడా గోపాలం అంటే యిష్టమేగా! అందుకే నేను వెంటనే యీ వార్త చెప్పాలని ఆపుకోలేని సంతోషంతో లోపలికి పరుగెత్తాను. గదిలో అక్కా ఆయా కూర్చుని వున్నారు. నేను వెళ్ళి చప్పట్లు చరుస్తూ 'అక్క పెళ్ళి పెళ్ళి' అన్నాను సంతోషంతో. సంధ్య చివ్వున నా వైపు తిరిగి 'యేమిటి వాసూ?' అంది. గోపాలం వచ్చా డని నాన్నగారితో మాట్లాడుతున్నా రని అక్క పెళ్ళి అవుతుందని చెప్పాను. ఆయా, అక్క ముఖాలు చూసుకున్నారు. ఇంతలో నాన్న గారు గదిలోకి వచ్చి ఆయాతో అక్కపెళ్ళి గోపాలంతో స్థిరపరు స్తున్నానని పురోహితుడికి కబురు చేశానని చెప్పారు. అక్కా ఆయా ఇద్దరిలో యెవరూ మాట్లాడలేదు. నాన్నగారు మర్నాటినుంచి సంధ్యని మామూలుగా కాలేజీకి వెళ్ళమని ఆజ్ఞాపించి గదిలోంచి వెళ్ళారు. 'చూశావా? నా మాట నువ్వు నమ్మలేదు' అన్నట్టు నేను అక్క వైపు ఠీమాగా చూశాను. కాని అక్క అప్పటికి ఆయా గుండెల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి యేడుస్తూ 'యీ పెళ్ళి జరగటానికి వీల్లేదు. వీల్లేదని చెప్పు ఆయా' అంది. ఆయా 'వూరుకో-వూరుకో' అని సముదాయించింది. కారణం నాకు తెలియలేదు. కాని ఆ రాత్రంతా అక్క యేడుస్తూనే వుంది. ఆయా ధైర్యం చెబుతూనే వుంది.

లగ్నాలు పెట్టించేశారు. పెళ్ళి వారం రోజుల్లోకి వచ్చింది. యేర్పాటులన్నీ అర్భాటంగానూ అంతస్తుకి తగిన ఫాయలో జరుగుతున్నాయి. అక్క కాలేజికి వెడుతోంది కాని మనిషి మునుపటిలా లేదు. నీరసంగా, విసుగ్గా యెలాగో వుండేది. ఏదయినా మా అక్క పెళ్ళి అవుతోంది. నాకు బోలెడంత సందడి. నా ఆనందానికి హద్దులేదు. ఆరోజు స్కూల్లో నా క్లాస్‌మెట్ రమణని "మా అక్క పెళ్ళికి నువ్వుకూడా రెండురోజులు శలవు పెట్టు ఇద్దరం సరదాగా తిరుగుదాం" అన్నాను. అప్పటివరకూ మేమిద్దరం స్నేహితులంగానే వుండేవాళ్ళం. వాడు ముఖం అంతా మాడ్చుకుని 'నేను రాను' అన్నాడు. 'యెందుకని?' అన్నాను. "నేనే కాదు. మా యింట్లో యెవరూ మీ అక్క పెళ్ళికి రారు. మా అక్కకూడా రాదు. అసలు మీ సంధ్యతో మాట్లాడవద్దని మా యింట్లో మా అక్కని కేకలేశారు" అన్నాడు!

"ఎందుకని?"

"మీ అక్క మంచిదికాదు."

"ఏయ్? రమణా!"

"అవును నిజంగా మీ అక్క మంచిదికాదు. పెళ్ళి కాకుండానే మీ అక్కకి పాపాయి పుడుతున్నాడు. చెడ్డవాళ్ళకే అలా పుడతారు."

పెళ్ళి కాకుండా పాపాయి పుట్టవచ్చో లేదో అప్పుడు నాకు తెలియదు. కాని మా అక్క మంచిది కాదు. చెడ్డది అని వాడు అనటం నేను భరించలేకపోయాను. మరుక్షణమే మీదపడి కొట్టాను. ఇద్దరం బాగా కలబడ్డాం. వాడికి కంటిమీద దెబ్బతగిలింది. నాకు ముక్కులో నుంచి రక్తం రావడం ప్రారంభించింది. మా హెడ్మాష్టరుగారు వచ్చి మా యిద్దర్నీ విడదీశారు. నన్ను యింటికి పంపించేశారు. పంపించేటప్పుడు నాన్నగారికి నా ప్రవర్తన బాగా లేదని, యిలా దురుసుగా యింకోసారి ప్రవర్తిస్తే స్కూల్లో నుంచి పేరు తీసెయ్యాల్సి వస్తుందని వుత్తరం వ్రాసిపంపాడు.

నాన్నగారు అదిచూసి యెన్నడూ లేంది నన్ను పట్టుకుని కొట్టారు. దాదా అడ్డుపడి నన్ను తీసుకెళ్ళి ఆయాకి అప్పచెప్పాడు. నాన్నగారు వెనకనుంచి "వెధవకి రాత్రికి అన్నం పెట్టకండి. గాడిదని రేపటినుంచి స్కూలు మాని యింట్లో కూర్చోమనండి" అన్నారు. ఎప్పుడూ లేంది నాన్నగారు నా మీద మండిపడటం చూసి నాకు నిజంగా పట్టలేనంత యేడుపు వచ్చింది. గదిలోకి రాగానే సంధ్య నన్ను దగ్గరకు లాక్కుని అసలు విషయం యేమిటి అని అడిగింది. నేను యేడుస్తూనే విషయం చెప్పాను. నేను రమణని యెందుకు కొట్టానో తెలుసుకున్న అక్క ఆయా ముఖాలు చూసుకున్నారు. అక్క వెంటనే నన్ను దగ్గరకి లాక్కుని 'వాసూ!' అంటూ యేడ్చింది.

(సశేషం)

"ఆత్మగౌరవం"

విశ్వనాధ్

సినిమా

1965లో ఒకే చిత్రం అనేక మంది కొత్త నటీ నటులను పరిచయం చేసింది.

1966 ఆరంభంలో ఒకే చిత్రం ఒక కొత్త దర్శకుని. మరి కొందరు కొత్తవారిని పరిచయం చేస్తున్నది.

1965 కొత్తవారికి సినీ శిక్షణ నిచ్చి వారిని 'సినీమనసులు' చేసిన 'సినిమాస్టార్' ఈ 'కొత్త' (కె) దర్శకుడు (విశ్వనాధ్)

1966 సంస్థ అన్నపూర్ణా పిక్చర్స్. "తేనెమనసులు" సహసారధికి స్వంత సారధ్యం యిచ్చింది అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత దుక్కిపాటి మధుసూధనరావు.

ఆ మాటకువస్తే ఈ సినీ విశ్వంలో ఈ విశ్వనాధ్ మొదట అన్నపూర్ణా సంస్థ పట్టభద్రుడు; ఆ మీదట బాబూ మూవీస్ సినీ చట్టభద్ధుడు.

కృష్ణా జిల్లాకు చెందిన కాశీనాధుని విశ్వనాధ్ ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సైన్సు పట్టంపొంది మొదట వాహినీ స్టూడియోలో శబ్దగ్రాహకుడుగా చేరారు. అక్కడ మొదటి 'గురువు' వాహినీ శబ్దగ్రహణ కు ముఖ్యాచార్యులు కృష్ణన్. శివరామ్‌తోడు నీడగా వుండగా పదేళ్ళు దాదాపు 1959 వరకూ వాహినీ, విజయా సంస్థల చిత్రాలలో పని చేశారు.

అన్నపూర్ణా వారి చిత్రాలు అందాలు దిద్దుకొన్నప్పుడు "విశ్వం" పై కళానురక్తి కలిగిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత శ్రీ డి. మధుసూధనరావు తమ సంస్థలో అసోసియేట్ డైరెక్టర్‌గా తీసుకొనడం జరిగింది. "వెలుగు నీడలు" ఈ విశ్వంకు "రెండవ గురువు"ను (ఆదుర్తి) చూపి వెండితెర అసలు వెలుగు నీడలు పరిగ్రహించే అవకాశ మిచ్చింది, తదాది అన్నపూర్ణ సంస్థ చిత్రాలకు ఆ హెూదాలోనే వుంటూ, ముఖ్యంగా కథ, స్క్రీన్‌ప్లే శాఖలకు పెద్ద అండగా ఉంటూ బాబూ మూవీస్ "మూగ మనసులు" సెకండ్ యూనిట్ డైరెక్టర్ గిరి వహించారు. ఆ "పైమెట్టు" అంతకు ముందు 'రంగు' పూసుకొనని పన్నెండుమందికి సినిమా రంగు మాత్రమే కాక ఈస్టుమన్ రంగు కూడా వేయించి, వారిని పై

మెట్టుకు తీసుకు వెళ్ళిన 'సినీ శిక్షణ మార్గ దర్శకుని' హెూదా.

అంతకు పై బడిన హెూదా యిచ్చినది, 'సహ' బాధ్యతను స్వంత బాధ్యతగా పరిణమింప జేసినది "ఆత్మగౌరవం" డైరెక్టర్ విశ్వనాథ్‌కు "మూడవ గురువు" డి. మధుసూదనరావు.

పబ్లిసిటీ అంటే వెనక్కు పరుగిడే ఈ నిరాడంబర మితభాషి ముగ్గురు గురువుల గౌరవాన్ని, తన ఆత్మ గౌరవాన్ని తొలి చిత్రంలోనే నిలుప గలననే ఆత్మ విశ్వాసంతో ఉన్నారు. పరిశీలన, ఆత్మ పరిశీలన, పఠన, నిరాడంబరత్వం, జ్ఞాన తృష్ణ, జన హృదయ పరిశోధన దర్శకునికి ఆదర్శ సూత్రాలు కాదగుననే ఈ 'విశ్వం'కు ఎటువంటి కథలైనా సినిమాకు సుఖలే. అయితే ఏ కథ అయినా జన జీవిత పథానికి అతి చేరువలో ఉండాలంటూరు. చిత్రం చూస్తున్నంత సేపు ప్రేక్షకులను రెండు విధాలుగా గాని, రెండింటిలో కనీసం ఒక విధంగా గాని ఆకట్టుకోవాలంటూరు.

ఆత్మ గౌరవం

అన్నపూర్ణా పిక్చర్స్ వారి "ఆత్మగౌరవం" రీరికార్డింగ్ మద్రాసు భరణీ స్టుడియోస్‌లో ఫిబ్రవరి 14 వ తేదీన సమాప్తమైనది. 1965 డిసెంబర్ మాసాంతంలోనే సెన్సార్ అయినది. ఏ క్షణంలోనైనా ఈ చిత్రం విడుదల కావచ్చు.

వరంగల్లు సమీపంలోనే రామప్ప దేవాలయంవద్ద తొలిసారి ఈ చిత్రానికి షూటింగ్ జరిగింది. కొత్త దర్శకుడు కె. విశ్వనాథ్‌తో పాటు కొత్త నృత్య దర్శకురాలు శ్రీమతిసుమతికౌశల్, కొత్తరచయిత భమిడిపాటి రాధాకృష్ణ, కొత్త బాల తార శ్యామల ఈ చిత్రం ద్వారా పరిచయ మౌతున్నారు. గొల్లపూడి మారుతీరావు, భమిడిపాటి రాధాకృష్ణ, వచన రచనకు దాశరథి, ఆరుద్ర, సి. నారాయణరెడ్డి, శ్రీశ్రీ గేయ రచన జోడయినవి. సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు. ఛాయాగ్రహణ దర్శకుడు సెల్వ రాజ్, కళా దర్శకుడు జి. వి. సుబ్బారావు, కూర్పు: ఎమ్. ఎస్. మణి, కొన్ని నృత్యాలకు దర్శకుడు హీరాలాల్. నాగేశ్వరరావు, కాంచన, రాజశ్రీ, గుమ్మడి, రేలంగి, పుష్పకుమారి, సూర్యకాంతం, హేమలత, చలం. అల్లురామలింగయ్య, జగ్గయ్య (గెస్టు) వాసంతి (గెస్టు) తారాగణంలో కలరు. నిర్మాత శ్రీ దుక్కిపాటి మధుసూధనరావు.

• • •

పద్మశ్రీ చిత్రం

పద్మశ్రీవారు ఈసారి 'సీరియస్' చిత్రం తీయదలచారు. మే, జూన్ లలో సెట్స్‌కు వెడుతుంది. ముళ్ళపూడి వెంకటరమణ రచన సాగిస్తున్నారు.

"పద్మశ్రీ" భానుమతి చిత్రంలో నాగేశ్వరరావు

"ఏక్ టుక్ బాషా" అనే బెంగాలి చిత్రం ఆధారంగా భరణీ పిక్చర్స్ వారు ఒక వినోద ప్రధాన చిత్రం నిర్మించ సంకల్పించారు. మద్రాసు భరణీ స్టుడియోలోనే నిర్మించబడే ఈ చిత్రంలో నాగేశ్వరరావు, "పద్మశ్రీ" భానుమతి, ఎస్. వి. రంగారావు, సూర్యకాంతం నటిస్తారు. సంగీతం: ఎస్. రాజేశ్వరరావు, దర్శకుడు: పి. ఎస్. రామకృష్ణారావు.

గోదావరి తీరాన హిందీ చిత్ర నిర్మాణం

"మూగ మనసులు" హిందీ వర్షను "కభీ తో మిలింగే" ఔట్ డోర్ షూటింగ్ గోదావరి తీరాన ఫిబ్రవరి ద్వితీయార్థంలో ప్రారంభమై మార్చి 20వ తేదీ వరకు సాగనున్నది. తీరాన శ్రీ సుధేందురాయ్ ఒక బ్రహ్మాండమైన సెట్ వేశారు. సునీల్ దత్, నూతన్ జమునలు చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఎల్. వి. ప్రసాద్ నిర్మించే ఈ ఈస్టుమన్ కలర్ చిత్రానికి దర్శకుడు ఆదుర్తి. ఛాయాగ్రహణం: పి. ఎల్. రాయ్, ముఖ్య సహాయకుడు: కె. ఎస్. రామకృష్ణారావు, సంగీతం: లక్ష్మీకాంతం, ప్యారేలాల్.

అన్నపూర్ణావారి "ఆత్మగౌరవం"లో నాగేశ్వరరావు, కాంచన



క్యారక్టర్ యాక్టర్ ఎస్. వి. రంగారావు

ఎస్. వి. రంగారావు అంటే స్కూలు, కాలేజి, 'ఫైర్ బ్రాండ్' ఉద్యోగ సంస్థల రిజిస్టర్లలో సామర్ల వెంకట రంగారావు అని ఉంటుంది.

కాని ... 175 సినిమా రిజిస్టర్లలో అయన్ని చూచిన మీదట 'ఎస్. వి' అంటే 'సంతోష విషాద' అని భాష్యం చెప్పవచ్చు; 'సరస విరస' రంగారావు అని వ్యాఖ్యానించ వచ్చు.

పావుకారు, పాతాళభైరవి, పెళ్ళి చేసిచూడు, బ్రతుకుతెరువు, బంగారు పాప, మాయాబజార్, దాసి, దేవదాసు, అంతా మనవాళ్ళే, తోడికోడళ్ళు, సంతానం; మంచి మనసులు, సతీ సావిత్రి, దేవాంతకుడు, భట్టి విక్రమార్క, మామకు తగ్గ అల్లుడు, కలసివుంటే కలదు సుఖం, పెళ్ళితాంబూలం, ఆత్మబంధువు, గుండమ్మకథ, నర్తనశాల, పాండవ వనవాసం, బొబ్బిలియుద్ధం నాదీ ఆడజన్మే, మొనగాళ్ళకు మొనగాడు, ఆటబొమ్మలు మొదలైనవి

రంగారావు బి. ఎస్. సి. సైంటిఫిక్ నటన యిస్తారు. ఒక్క పాల్లు తక్కువ వుండదు. పాత్రను బంగారం తూచే త్రాసులో ఒకవైపు, రంగారావును సైంటిఫిక్ నటన బరువును మరొకవైపువేస్తే ముల్లు నిశారుగా నిలుస్తుంది.

రంగారావు కాబట్టే ఆ నటన బరువురాళ్ళు రత్నాలవంటివి.

రంగారావుకు భారీ శరీరం ఉన్నది. అది (బ్రాన్) వున్న వారికి మానసికశక్తి (బ్రెయిన్) తక్కువంటారు. కాని కనిపించే రంగారావు శరీరక శక్తిలో దానిని మించి కనిపించని మానసిక శక్తి ఉంది. అందుచేతనే ఆయన పాత్ర ధర్మమెరింగి నటించే విశిష్ట నటుడు, పాత్ర స్వభావజ్ఞుడైన సహజ నటుడు; అధర్మ భూమికలలోకూడా పాత్ర ధర్మజ్ఞుడు.


పాత్ర లక్షణాలకు స్వీయ ప్రజ్ఞ జోడించి పాత్ర విలువ పెంచుతాడు. అంత శరీరాన్నే కాదు కళ్ళు, పెదవులు, చెక్కిళ్ళు, ఫాల భాగం సంపూర్ణశుద్ధితో కదుపుతారు. కంఠంలో అనగా భాషలో, సంభాషణలో తనే పంక్చువేషన్‌లు పెట్టుతారు. కామాలూ కోలన్‌లు వచ్చినప్పుడు భాషపై భావాల్ని ఎక్కిస్తారు. స్వీయ కల్పనతో భాషారీతిని, భావగతిని మేళవించి ఇది రంగారావే చేయగలడు అని నిరూపించుకొంటారు. అందుచేతనే ఆయనభాష, సంభాషణ వినిపించడమే కాదు; కళాభిమాని కళ్ళల్లో నిలుస్తుంది.

సాధారణంగా 'విలను' లను ప్రేక్షకులు (తెరపై వున్నంతసేపూ) ద్వేషిస్తారు. చంద్రమోహన్ అంతటి వారికే అది తప్పలేదు. కాని రంగారావుఘనత విలనునటనలో అయినా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొనడం. ఆయన్ను ద్వేషించనంతటి విద్యుచ్ఛక్తి నటన, అణుశక్తి నటన అయనలో ఉంది. హీరోతో సమానంగా కవితో సమానంగా, డైరెక్టరుతో సమానంగా ప్రేక్షకులను తనలో లీనం చేసుకోగల, తన వెంట పరుగులెత్తించగల అభినయ శక్తి రంగారావుకే ఉన్నది. అందుచేతనే అయనకు హీరో, కవి, డైరెక్టర్‌తో సమాన హోదా ఉంది. 'మొనగాళ్ళకు మొనగాడు' 'బొబ్బిలియుద్ధం' శారద (తమిళం-సుమంగళి) నామంజరు పెణ్ (తమిళం — నాదీ ఆడజన్మే వంటి చిత్రాలు ఎక్కువగా రంగారావు ప్రతిభతో కనక ప్రభ ఎత్తినవనటం అతిశయోక్తికాదు.

1918 జులై 3 న నూజివీడులో జన్మించి మద్రాసు విశాఖపట్నం, కాకినాడలలో విద్య నభ్యసించిన రంగారావు హ్యాపీక్లబ్ నాటకాలలో నటించే ఒక్కొక్కప్పుడు 'అన్ హ్యాపీ'గా వున్నారు. షేక్స్పియర్ కామెడీలు, ట్రేజడీలు నటించి జీవితంలో రెండూ అనుభవించారు. తన భూమికలలో రెండింటిని మేలుగా ప్రదర్శించ కలిగారు కూడా.

'ఫైర్ బ్రాండ్' ఉద్యోగాలు చేశారు. ఫైర్ బ్రిగేడ్ సబ్ ఆఫీసర్, జెంషడ్పూర్ ఎర్ర ఇనుము కర్మాగారంలో చిన్న ఆఫీసర్‌గా

మహాలక్ష్మీ ప్రొడక్షన్స్‌వారి "భీమాంజనేయ యుద్ధం"లో భీముడుగా దండమూడి రాజగోపాల్, ద్రౌపదిగా ఎస్. వరలక్ష్మి



పని చేశారు. ఆ 'ఫైర్ బ్రాండ్' నటన (సినిమాలలో) లోగడ చూశారు; ముఖ్యంగా భస్మాసుర, హిరణ్యకశిప, రావణాసుర, విశంభుడు (శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ) భూమికలలో చూడబోతున్నాము.

నిప్పు ఉద్యోగాలు చేసిన రంగారావు నిప్పువంటి మనిషి. ఆయన సినీ జీవితం కూడా నిప్పు వంటి స్వచ్ఛత కల ప్రవరాఖ్యుడు (వరూథిని) తోటి ప్రారంభమైంది: సున్నపు రంగడు (షావుకారు) నేపాళ మాంత్రికుడు (పాతాళ భైరవి) మొదలు కత్తుల రత్తయ్య (మొనగాళ్ళకు మొనగాడు) వరకు ఆ అగ్ని రక రకాలుగా ప్రజ్వలించింది.

శృంగార, హాస్య, కరుణ, వీర, రౌద్ర, భయానక, బీభత్స, అద్భుత శాంతి రసములను రంగరించకలిగిన ఏకైక నటుడు నవ(రస) రంగారావు నవరంగ రంగారావు.

ఉషాఫిలింస్‌వారి

"దైవశాసనం"లో దేవిక



• • •

నవరాత్రి

'నవరాత్రి' షూటింగ్ చివరి షెడ్యూల్ ఒక పిచ్చి ఆస్పత్రిలో జరుగుతుంది. జమున, జయలలిత, గీతాంజలి, కాంచన, రాజశ్రీ, ఛాయాదేవి, గిరిజ, సూర్యకాంతం అందులో గెస్టు ఆర్టిస్టులుగా పాల్గొంటారు. వీళ్ళందరూ సావిత్రిని భయపెడతారన్నమాట. ఈ చిత్రంలో నవరస పాత్రధారి నాగేశ్వరరావు, వి. వి. సుబ్బారావు, కాతినేని రామారావు, చలపతిరావు, ముళ్ళపూడి వెంకటరమణ చిత్ర ముఖ్యులు.

జ్యోతి

"శ్రీకృష్ణ పాండవీయం"

బొంబాయిలోవలె మద్రాసులో 1965 సినిమా సాంకేతిక రంగంలో మరికొంత ముందుకు వెళ్ళింది. ఇందుకు మద్రాసు విశిష్ట నిదర్శనం రామకృష్ణ–ఎన్. ఏ. టి. కంబైన్స్ 'శ్రీకృష్ణ పాండవీయం' (5815.78 మీటర్ల నిడివికల ఈ చిత్రం 1965 డిసెంబర్‌లో సెన్సార్ అయినది.)

తారలు దర్శకత్వం కూడా వహించేతరం నాగయ్యతోకే తీరిపోయిందా, పోతుందా అన్నది తెలుగు రంగాన్ని వేధించింది. 'శ్రీకృష్ణ పాండవీయం' మేటినటుని, మేటి దర్శకునిగా కూడా చూపింది (ఎన్. టి. రామారావు దర్శకుడుగా టైటిల్ కార్డుపై సాధికారంగా కన్పించడం ఇదే మొదలు.)

ఒకే పోలికకలిగిన రెండు పాత్రలను ధరించీ, దర్శకత్వం వహించిన తారలు మహా అయితే ఒకరిద్దరు వుండివుండవచ్చు (ఉదాహరణ "నాడోడిమన్నన్" తమిళ చిత్రంలో ఎమ్. జి. ఆర్.) కాని ఒకే పోలిక

భారత్ ఫిలింస్‌వారి "భక్తపోతన" చిత్రంలో

పోతనగా గుమ్మడి



లేకుండా భిన్నమైన రెండు భూమిక లను—శ్రీక్రిష్ణ, దుర్యోధన భూమిక లను—నిర్వహించడం చలన చిత్ర చరిత్రలో బహుశా యిదే మొదటి సారి. దీనికంటే కూడా మెచ్చ దగింది ఒకే నటుడు రెండుపాత్రలు ధరించినా వారిద్దరూ ఒక్క రేనన్న అభిప్రాయం కలుగనంతటి సుస్పష్ట మైన ఖండితమైన నటన ప్రదర్శిం చడం.

రాజసూయ యాగమునకు అర్హ మైన విజయములను శ్రీకృష్ణ దర్శ కత్వమున భీముడు(ఉదయకుమార్) సాధించడం, (హిడింబాసుర, బకా సుర, జరాసంధ వధలే ఈ విజయ ములు), రాజసూయమునకు వచ్చి మయసభా మందిరమున విడిది చేసిన దుర్యోధనుని భంగపాటునకు ద్రౌపతి నవ్వగా అతడు ఉద్రిక్తు డవడము, యాగానంతర కృష్ణ సత్కారములో ఆక్షేపణకు దిగిన శిశుపాలుని (రాజనాల) వధించ డము, సత్కారాంతర నిరూపణగ శ్రీకృష్ణుడు స్వరూప విజృంభణము చేయుటు "శ్రీకృష్ణ పాండవీయం" చిత్ర కథా ఖండములు.

ఆద్యంతము శ్రీకృష్ణునిగా రామా రావు నటన, మయసభలో సుయోధ నునిగా రామారావు నటన, భీము నిగా ఉదయకుమార్, శకునిగా ధూళిపాళ, ధృతరాష్ట్రునిగా మల్లాది నటన విశిష్టం.

ధృతరాష్ట్ర దుర్యోధన సంవా దము, భీమ పోరాటము, మయసభ మనోహరము, శ్రీకృష్ణుని ఉన్న తాసన పరిణామము, ప్రళయ స్వరూప వర్ణనములలో దర్శకుని రామారావు ఉత్కృష్ట శైలి కాన వచ్చింది. మహీపతులైన పంచపాండ వులు భిక్షాటన చేయు ఘట్టము హృదయమును ద్రవింపజేయక మానదు. సంగీత సాహిత్యములు ఇతి వృత్త స్థాయికి తగినట్లున్నవి. చిత్ర సాంకేతిక శాఖలను (టైటిలు) చూపు నప్పుడు కూడ ఆంగ్ల పదములను ఉపయోగించక తెలుగు స్థాయిని తెలుగు వాతావరణమును నిలుపుట చిత్రోచితం: హర్షదాయకం.

సాంకేతికజ్ఞులలో కళా దర్శ కుడు టి. వి. ఎస్. శర్మ, ఛాయా గ్రహణ దర్శకుడు రవికాంత్ నగ యాచిప్రజ్ఞ ప్రత్యేకించి ప్రశంస నీయం.

ఈ చిత్రంలో అంతటి అందమైన సెట్‌లు, విశేషించి మయసభ సెట్ ఆంధ్ర సాంకేతికాభివృద్ధికి విశిష్ట నిదర్శనం.

భారత గాథను, ఉన్నత ప్రమా ణములో నిర్మించి సినిమా కళ ప్రయోజనమును నిరూపించిన నిర్మాత శ్రీ నందమూరి త్రివిక్రమ రావు అభినందనీయుడు.

లోగుట్టు పెరుమాళ్ళు కెరుక

గౌరి ప్రొడక్షన్స్ వారి "లోగుట్టు పెరుమాళ్ళు కెరుక" ఉత్కంఠ ప్రేరేపక అపరాధ పరిశోధక చిత్రం.

సినిమా అన్నాక వడిగా నడ వాలి; పరుగులిడాలి.

డిటెక్టివ్ చిత్రం అన్నాక హంతకు డెవరు ? అన్న ప్రశ్న ప్రేక్షకులను వేధిస్తూ వుండాలి.

అపరాధ పరిశోధన అన్నాక అప రాధాలు తెలిసి మరింత తెలివిగా చెయ్యడం, వాటిని మరింత తెలివిగా ఎదిరించ వచ్చిన వారిని ఎదుర్కో నడం, వారి ప్రతిఘటనను ఎదుర్కో నడం వుండాలి.

ఇవన్నీ ప్లస్ ఓ బాల అపహర ణతో కొంత కుటుంబ వాతావరణం వున్న చిత్రం 4502. 51 మీటర్ల నిడివి కల "లోగుట్టు పెరుమాళ్ళు కెరుక."

చిత్ర నిర్వాహకులు ఎస్. భావ నారాయణ, నిర్మాత వై. వి. రావు, దర్శకుడు కె. ఎస్. దాసు.

శాంతి అశాంతికథ.

"లోగుట్టు పెరుమాళ్ళ కెరుక."

శాంతి(రాజశ్రీ) తండ్రి ధర్మయ్య (స్వర్గీయ కె. వి. ఎస్. శర్మ) పడవ లలో దొంగతనంగా సామానులు తెచ్చే దుండగుల ముఠాకు అడ్డుపడి హత్యగావించబడినాడు. హంతకుని

"ఆడబ్రతుకు" చిత్రం ఫిబ్రవరి 19 న విజయవాడ లక్ష్మీటాకీసులోను. మరి 9 కేంద్రాలలోనూ శతదినోత్సవాలు జరుపుకొంది. ముఖ్యనటుడు శ్రీ రామారావు, జెమినీ అధిపతి శ్రీ వాసన్, మంత్రి శ్రీ ఎన్. రామ చంద్రారెడ్డి, (వెనుక వరసలో) శ్రీ రాజనాల, నవయుగాధిపతి శ్రీ శ్రీని వాసరావు గారలను చూడవచ్చు.



పట్టుకొని తండ్రి ఆత్మకు శాంతి చేకూర్చేవరకు తన ఆత్మకు శాంతి లేదన్నది శాంతి.

సముద్ర తీరానే శాంతిపై ఓ ముఠా దౌర్జన్యం చేయబోతే మధు (శోభన్‌బాబు) అనే సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ ఆమెను రక్షిస్తాడు. ఈతని ఆశయమూ హంతకుని పట్టుకొనుటే.

ఆ రామాపురంలో ఆ దుండగుల నుంచి ప్రజలను సంరక్షించేందుకు భాస్కరరావు [డాక్టర్ ప్రభాకర రెడ్డి] అనే పెద్దమనిషి, చిదంబరం [గుమ్మడి] అనే మరీ పెద్దమనిషి అధ్యక్షతను నగర సంరక్షక సంఘాన్ని నెలకొల్పి హంతకుని గుండెపై కుంపటిపెట్టాడు. ఫలితం ఆ హంతకుని ముఠాచే తన కుమార్తె [బేబి అవంతి] దొంగిలించబడడం. భాస్కరరావు లక్ష్యమూ హంతకుని పట్టుకొనడమే.

హంతకుని, అతని ముఠావారి లక్ష్యంపై వారినేకాదు అడ్డువచ్చిన ప్రతి ఒక్కరినీ హతమార్చడమే.

ఇంతకీ హంతకుడెవడు? ఎవరి లోగుట్టు పెరుమాళ్ళకెరుక?

ఈ ప్రశ్నకు ఓ మెలికతో మెరుపు వంటి లైటింగ్‌తో సమాధానం వస్తుంది.

సత్యనారాయణ, రామకృష్ణ, పద్మనాభం, అల్లు రామలింగయ్య, పేకేటిశివరాం, గీతాంజలి, వాణిశ్రీ, సూర్యకళ, కళ్యాణి, 'వండర్ డాగ్' ఝాన్సీ, వీటూరి, కోదండపాణి, హెచ్. యన్. వేణు.

చలన చిత్ర వార్తలు

"సంగీత లక్ష్మి" ప్రారంభోత్సవం

సీతా రామాంజనేయ పిక్చర్స్ వారి "సంగీత లక్ష్మి" సంగీత ప్రధాన చిత్రం షూటింగ్ ఫిబ్రవరి 11 వ తేదీన వాహినీ స్టుడియోలో మూడవనెంబరు ఫ్లోర్‌లో ప్రారంభమైంది. హీరోసెట్ పై వరుసగా వారం రోజులు షూటింగ్ జరిగింది. త్యాగరాజు, సరస్వతి చిత్రాలు కల మందిరంలో నాయికా నాయకుల [రామారావు. జమున] సప్తస్వర జీవిత ఘటనలతోపాటు "పాటకు పల్లవి ప్రాణం – నా జీవన జీవం గానం" [రచన ఆత్రేయ, పాడినది ఘంటసాల, సుశీల] పాటలో కొన్ని భాగములు చిత్రీకరించారు. ప్రారంభోత్సవ శుభ సమయమునకు చలనచిత్ర రంగం ప్రముఖులు అనేకమంది విచ్చేశారు. బి. నాగిరెడ్డి పూజ గావించిన మీదట మద్రాసులోని సోవియట్ కాన్సల్ జనరల్ శ్రీ జి. ఐ. కావెరిన్ కెమెరాకు స్విచ్ ఆన్‌చేయగా, హిందీ చిత్ర దర్శకుడు శ్రీ తాతినేని ప్రకాశరావు క్లాప్ కొట్టారు. రామారావు ప్రథమ దృశ్యములో పాల్గొన్నారు.

చిత్రమునకు కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహిస్తున్నది శ్రీ గిడుతూరి సూర్యం. అడివి బాపిరాజువద్ద చిత్రలేఖనం, ఏ భీమ్ సింగ్ వద్ద సుసంప్రదాయ కథా విధానం; ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇటలీ, గ్రీసు, ఉభయ జర్మనీలలో ప్రావంచికానుభవము, సోవియట్ రష్యాలో చిత్ర నిర్మాణ సంవిధానం గడించిన శ్రీ సూర్యం కవి, గాయకుడు, సంభాషణ కర్తకూడా. లండన్‌లో వ్యక్తి చిత్రకళా ప్రదర్శనం నిర్వహించి వున్నారు. మాస్కో స్టేజిపైన, టెలివిజన్‌లోను ప్రోగ్రాములు యిచ్చి వున్నారు. సోవియెట్ రష్యాలో దాదాపు నాలుగు సంవత్సరాలుండి 1962లో భారత దేశానికి తిరిగి వచ్చారు. బహుభాషావేత్త శ్రీ సూర్యం స్వస్థలం విజయవాడ, గుంటూరు క్రైస్తవ కళాశాల పట్టభద్రుడు. ఢిల్లీలో టెలివిజన్‌లో పెక్కు హిందీ నాటకములను నిర్వహించి వున్నారు.

"సంగీతలక్ష్మి" యూనిట్ వివరమిది:

తారాగణం: రామారావు, రంగారావు, రమణారెడ్డి, నాగభూషణం రాజబాబు, ప్రసాద్, జమున, విజయలక్ష్మి, సూర్యకాంతం, నిర్మల.

సాంకేతిక వర్గం: సంగీతం ఎస్. రాజేశ్వరరావు, ఛాయాగ్రహణం – అన్నయ్య, కూర్పు–ఎమ్. ఎస్. ఎన్. గాంధి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గిడుతూరి సూర్యం. నిర్మాత; పి. నరసింగరావు, సమర్పణ: ఏ. ఆర్. సుబ్బారావు.

అన్నపూర్ణావారి "ఆత్మగౌరవం"లో కాంచన, రాజశ్రీ



మద్రాసు చిత్రాలలో నాగేశ్వరరావు

మద్రాసులో స్వంత స్టుడియోలు ఉన్న నిర్మాతలకు ఎటువంటి యిబ్బంది కలుగజేయ కూడదనే ఉద్దేశంతో, వారి మద్రాసు స్టుడియోలలో జరిగే చిత్రీకరణలో పాల్గొనడానికి అక్కినేని నాగేశ్వరరావు అంగీకరించారు. అంతే కాదు అమలు పరచినారు కూడా,

విక్రమ్ ప్రొడక్షన్స్‌వారు మద్రాసులో విక్రమ్ స్టుడియోస్‌లో నిర్మిస్తున్న "వసంతసేన" తెలుగు చిత్రం షూటింగ్‌లో ఫిబ్రవరి మొదటి వారంలో పాల్గొన్నారు. నాయిక పద్మిని. ఛాయాగ్రహణ దర్శకుడు, చిత్ర దర్శకుడు బి. ఎస్. రంగా.

హైదరాబాద్‌లో చిత్రనిర్మాణం హెచ్చిపోయి 'ఫ్లోర్ కరువు'కూడా ఏర్పడినందున మద్రాసులో నిర్మించబడే చిత్రాలలో సయితం పాల్గొని ఆంధ్ర చిత్రకళా సౌభాగ్యానికి దోహదమివ్వడం తన ఆశయమని శ్రీ నాగేశ్వరరావు స్పష్టం చేసివున్నారు.

ప్రారంభోత్సవం రోజున శ్రీ ఏ. ఎల్. శ్రీనివాసన్ కెమెరాకు స్విచ్ ఆన్‌చేశారు. మద్రాసు కోడక్ మేనేజరు శ్రీ ఎస్. రామమూర్తి ఈ ఈస్టుమన్ కలర్ చిత్రం మొదటి షూటింగ్‌కు క్లాపర్‌బాయ్‌గా వ్యవహరించారు.

తెలుగు చిత్రంలో యింకా రంగారావు, రేలంగి, సత్యనారాయణ, బాలకృష్ణ, అంజలిదేవి, గిరిజ, సవిత నటిస్తున్నారు. రచన సదాశివబ్రహ్మం. సంగీతం ఎస్. రాజేశ్వరరావు.


ఇదే చిత్రాన్ని హిందీలో కూడా నిర్మిస్తున్నారు. చారుదత్తునిగా సునీల్‌దత్, వసంతసేనగా పద్మిని నటిస్తున్నారు.

గాజులమ్మ గుడిలో షూటింగ్

బాబూ మూవీస్‌వారి 'కన్నె మనసులు'లో ఫిబ్రవరి మూడవ తేదీ నుంచి పదవ తేదీ వరకు వాహినీ, ప్రసాద్ స్టుడియోస్‌లలో రెండు సెట్లపై జరిగిన షూటింగ్‌తో ఇండోర్ షూటింగ్ పూర్తి అయినట్లే చెప్పవచ్చు. మళ్ళీ మార్చిలో ఔట్‌డోర్ షూటింగ్ జరపడతో చిత్రీకరణ భాగం పూర్తి అయిపోతుంది.

వాహిని స్టుడియోలో గాజులమ్మ గుడిలో షూటింగ్ జరిగింది. గుమ్మడి, పుష్పకుమారి పాల్గొన్నారు. ఆత్మవికాసం పొందిన అంధుడైన గజదొంగ నిజవృత్తాంతమును ఆమె గ్రహించుట గుడిలోని సంఘటన. ప్రసాద్ స్టుడియోలో జరిగిన చిత్రీకరణలో రామమోహన్, సుకన్యలపై వర్ష పాత సందర్భమున పాటనుచిత్రీకరించారు.

□□□



గిరీశం లెక్చర్లు

ఓరి నీ యిల్లిరవై రెండు కారట్ల బంగారంగానూ. నీ మాటలు రేడియో పాటలు గానూ, నీ పుస్తకాలు ఎకాడమీ తర్జుమాల పాలుగానూ... సినిమాలో ఒక్కలాటి వేషాలే దొరకా...నువ్వుపెద్దాడివైతే ఫుడ్ మినిస్ట్రీ దాపరించా. సిగార్సుకో బేడ్డబ్బులు చెక్కేసేనా పత్రూవోయ్, షికారు పోవాలంటూ ఘంటాయి కంఠసోష పడుతుంటే, బెల్లం కొట్టిన రాయిలా కదలవేం. ఈపాటి తిట్లు గనక ఏ అకాడమీ మీటింగులోనో లెక్చ్రరూపంలో దంచికొడితే సిట్టింగు ఫీజు పదిరూపాయలు దాఖలు పడూరుకునేది తలుసా.ఏది. ట్రా వెలింగలవెన్సుబిల్లుకాక.ఏదోనీలాటి బడుద్ధాయివిడోసునీ, మీ సిస్టర్లాటి బ్యూటిఫుల్ యంగ్ విడోస్‌నీ ఉద్ధరిద్దాంవన్న వూహ చొప్పనిక్కడి కొచ్చానే తప్ప—మనీ మేకింగ్‌లో మెసీవేన్ తెలియక్కాదు. వెధవడబ్బంటే గడ్డిపోచతో సమానం నాకు. అయ్యా గిరీశం గారూ తవరు చెయిజేసుకు తీరితే తప్ప వల్లకాదూ అంటూ సంఘాలూ ఉపసంఘాలూ అకాడమీలూ చెవినిల్లు గట్టుకు పోరుతున్నా, డబ్బు గుమ్మరిస్తాంవంటున్నా వదిల్పక్కా వచ్చానంటే ఎందుకు? డబ్బు

చేదనిటోయ్ మెథడ్స్ నచ్చక. పురిట్లోనే సంధికొట్టిందన్నట్టు చేరబోతూనే రాజీనామా ఇచ్చిపారేశా... ఎందుకు? మెథడ్స్ నచ్చక. కొందరు విడ్డూరపు జనం పోగవుతున్నారు, ఆనరరీ మెంబర్లు ఆనరరీగానే అనగా భత్యం లేకుండానే వచ్చి కూచోవచ్చుకదా అంటున్నారు. ఏదో మాటవరసకి దేశసేవా, సాహిత్యపు చాకిరీ అంటాంగాని, ఆ మాట పుచ్చుకు అదేపనిగా వేళ్ళాడతామటోయ్. ఉన్న డబ్బంతా పుస్తకాలమీదే తగలేస్తామంటే — ఇంకా అకాడమీ లెందుకని → ఈ ఫండ్లెందుకని...

సిగార్సు ఫీల్డన్నట్టు నేతిబీరకాయలో నెయ్యెంత అంటూ. పరిషత్తులు, సంఘాలు కమిటీలూ అలాగే నడుచుకోవాలిగదా. ఈ పరమసత్యం గమనించక కొందరు ప్రబుద్ధులు - ఈ పుస్తకాల్లో సాహిత్యపు విలవలు లెక్క దీస్తామంటూ బయల్దేరుతున్నారు. పాలూ నీరూ వేరుచేసినట్టూ పేజీ కర వరహా చొప్పున వంద పేజీల క్లాసిక్సు బుక్కు పరిష్కరించడానికి రెండొందలు ఫీజు సరిపోవాలి గదా దీనికి పద్ధెనిమిది వందల దాకా అనవసర పీఠిక తో ఎందుకు డేకినట్టు, అసలది పీఠికా, అడ్డమైన వ్యాసాల చేంతాడా అంటూ పేచీలు మొదలుపెడుతున్నారు. ఇలా ఐతే ఇంక సాహిత్య సేవ ఎలా అని. కొంపలు మునిగిపోవాని. ఆ మధ్య నేను గైడ్ చేసిన ప్రచురణ లెలా ఉన్నాయి? మాట వరసకి షేక్స్పియ రున్నా డనుకో. దాందుంపతెగ, దాని గుట్టంతా తెలుగులో బట్టబయలు చేసి పారేస్తే - వాటిని ప్రతి అడ్డమయినవాడూ చదివిపారేస్తే కొంప లంటుకోవాని. టయిము లేనందువల్ల చదవకపోయినా, ఆ యొక్క జీనియస్సు వల్ల లెక్చరు దంచే నా వంటి వాళ్ళకిహ నాబోరు దక్కుతూందాని— షేక్స్పియ రా మాట రాయలేదే ఈ మాట రాయలేదే అంటూ ప్రతివాడూ అడ్డసవాళ్ళు వేస్తే ఇంక పనులేం సాగుతాయి. అందుకని ఎటువంటి తర్జుమాలు చేయడమూ... ఏ ఆంధ్రుడైనా చదవబోతే కొరుకుడు పడక పళ్ళు విరిగి, ఇది చెత అనో, లేదా గిరీశంగారివంటి హేమా హేమీలు తప్ప వీటిని సామాన్యులు అర్థం చేసుకోలేరనో నిట్టూర్చి దూరం జరిగిపోయే ఫక్కీలో స్ట్రాటజీ వేసి రాయించాం.

ఇప్పుడు కొందరు వాటిని దుయ్యబడుతున్నారు. ఛచెన్ ఇలాంటి అసంస్కృతులతో మనకేల అని తప్పుకున్నాన్నేను.

ఇదిలా వుండగా ఇంకో రకం జనాభా తయారవుతున్నారు. అకాడమీ కమిటీలు ఓ లక్షరూపాయల బడ్జెటులో పదేళ్ళు (కునికి)పాట్లు పడి తయారించవలసిన రిసెర్చి, పరిష్కార, సాహిత్య చరిత్ర వగయిరా

గ్రంథాలని కొందరు విడిమనుషులు కొన్ని పుస్తకాల కంపెనీలు చకచక లా గవతల పడేస్తున్నారు. ఈ మధ్య ఒక డలాగే తెలుగు సాహిత్య చరిత్ర రాసేశాడు. ఆ తక్షణం మా వాళ్ళమంతా ఐదారు మీటింగుల్లో, విడివిడిగానూ సమిష్టిగానూ కూడా వాడి నాడి పోసుకుని వాడి కేం రాదనీ అది యావత్తూన్నూ తప్పుల తడకనీ మాలో మేము తీర్మానించుకున్నాం... దీనిక్కూడా కొందరు సిటింగు ఫీజు తీసుకోవద్దన బోయారు!

అంటే, అక్కడికి నువ్వొక్కడివే బుద్ధిమంతుడివీ మేమంతా స్వార్థపరులమానా అంటూవాణ్ణి హడలగొట్టి ఫీజు తీసుకునేట్టు చేశామనుకో.

అహ చెప్పొచ్చేది పదిమందికి పదికాలాలు పదిరాళ్ళు పారేసే ఉద్యమాలని ఇలా ప్రయివేటు ఎంటర్ ప్రయిజుగాళ్ళు లాగవతల పారెయ్యడం ఏవన్నా బాధ్యతగల పనేనా అని. ఇంకీ అకాడమీ లెందుకని... అందికే, రచనలోను, పబ్లిషింగువంటి సాహిత్య సేవల్లోనూ ప్రయివేటు ఎంటర్ ప్రయిజు నిషేధించి అంతటిని నేషనలైజు చేసి బండిని నిదానంగా నడిపించాలని నా థియరీ. వెనకటి కో డాక్టరు ఊరి కెళ్తే - ఆయన కొడుకు - వాడూ డాక్టరీ చదివాడులే, తండ్రి తిరిగి రాగానే నాన్నా నాన్నా నువ్వు పద్దానుగేళ్ళనించి వైద్యం చేస్తున్న కడుపునొప్పి కేసున్నేను నాలుగు రోజుల్లో నయంచేసి పారేశాను తెలుసా అన్నాడట తండ్రి నెత్తీ నోరూ బాదుకుని 'ఓరి వాజమ్మా — ఎంతప చేశావురా ఆ కేసు చలవనే గదరా ఇల్లు గట్టింది, నీ చేత డాకర్టీ చదివించిందీనూ - నాకు చేతగాక నే అదలా మెయిన్ టెయిన్ చేశానుట్రా అంటూ ఏడిచాడు. అదీ సంగతి కుర్రకార్కేం తెలు సుండేడ్చని.

అందువల్ల చెప్పొచ్చే దేమిటుంటే, నావంటి జీనియస్సుని వాడుకుంటే అకాడమీలు నిజంగా బాగుపడతాయి. నన్నడిగితే అసలిన్ని అకాడమీ లనవసరం. సంగీత సాహిత్య నాట్య నాటకాది పరిషత్తు లన్నిటినీ ఏకం జేసి నాటక అకాడమీ అని ఒకేసంస్థ పెడితే చాలు. కోటినదులు ధనుష్కోటిలో నుండగ ... అన్నాడుత్యాగరాజు. ది వరల్డీజె స్టే జన్నాడు షేక్స్పియరు. అంతా నాటకమేగదా!.

యాజమాన్యం తదితర వివరాలు

"జ్యోతి"

ఫారం 4 (8 వ నిబంధన ప్రకారము)

ప్రచురణ స్థలం	:	విజయవాడ.
ఎంతకాలానికొకసారి	:	మాసపత్రిక.
ముద్రాపకుని పేరు	:	వి. వి. రాఘవయ్య,
జాతి	:	భారతీయుడు,
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
ప్రకాశకుని పేరు	:	వి. వి. రాఘవయ్య,
జాతి	:	భారతీయుడు,
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
సంపాధకుని పేరు	:	వి. వి. రాఘవయ్య,
జాతి	:	భారతీయుడు,
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
పత్రిక యజమానులు	:	శ్రీమతి వి. లీలావతి, లబ్బీపేట, బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేయు చున్నాను.


విజయవాడ-2,
ది. 30-12-65


(సం.) వి. వి. రాఘవయ్య

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
Congress Office Road, Governorpet, Vijayawada-2










అన్నపూర్ణావారి



సంగీతం రాజేశ్వరరావు
ఛాయాగ్రహణం సెల్వరాజ్
నవయుగ విడుదల

